www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
Navabhoomi daily fallows..

హైదరాబాద్ | 15 ఆదివారం | డిసెంబర్ 2024 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:3 సంచిక: 90

పుష్ప విడుదల 2

కేటీఆర్‌కు అరెస్ట్ తప్పదా?

- ఇప్పటికే 2 సార్లు బాంబులు పేల్చిన మంత్రి పొంగులేటి
- ఫార్ములా ఈ కార్ రేసు స్కాంలో కేటీఆర్ పేరు
- విచారణకు హాజరు కావాలంటూ ఏసీబీ నోటీసులు
- కేసు విచారణ..అరెస్టులకు సంబంధించి గవర్నర్
- అనుమతి కోరిన సర్కార్..గవర్నర్ గ్రీన్‌సిగ్నల్
- ఇక అరెస్టు చేయడమే తరువాయి..తీవ్రస్థాయిలో చర్చలు
- కేటీఆర్ అరెస్టయితే..ఆందోళనలకు బీఆర్ఎస్ సిద్ధం

2

జైలు జీవితం తప్పదా!?

హైదరాబాద్-నవభూమిబ్యూరో
కేటీఆర్ అరెస్టు తప్పదా..? ఏసీబీ ఏం చేయబోతోంది..? కానీ.. ఇంతవరకు అరెస్ట్ విషయంలో ఎలాంటి ముందడుగు పడలేదు. తెలంగాణ రాష్ట్రంలో కేటీఆర్ అరెస్ట్ వార్త ఇప్పుడు హాట్ టాపిక్‌గా నిలిచింది. ఇదే ఇప్పుడు ట్రెండింగులోనూ ఉంది. ఫార్ములా ఈ కార్ రేసింగ్ వ్యవహారంలో కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తారంటూ గత కొద్ది నెలలుగా ప్రచారం జరుగుతూనే ఉంది. కానీ.. ఇంతవరకు అరెస్ట్ విషయంలో ఎలాంటి ముందడుగు పడలేదు. ఈ రోజు కీలక పరిణామం చోటుచేసుకున్నట్లు తెలిసింది. కేటీఆర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ప్రభుత్వం నుంచి అప్పీల్ చేశారు. నెలన్నర రోజులుగా అది గవర్నర్ వద్దే పెండింగులో ఉండిపోయింది. తాజాగా.. దానికి గవర్నర్ నుంచి ఆమోదం లభించిందని, సంబంధిత ఫైల్ రాష్ట్ర ప్రభుత్వానికి చేరిందని సమాచారం. ఈ క్రమంలో కేటీఆర్‌పై ఏ క్షణాన

పార్టీ పగ్గాలు ఎవరికీ?

2

కవితకా..హరీశ్‌కా..
ఇటీవల దూకుడు ప్రదర్శిస్తున్న కవిత
కవితకే ఖాయమని సంకేతాలు

2029లోనే ఎన్నికలు!

- లోక్‌సభలో జమిలి బిల్లులకు ముహూర్తం ఫిక్స్
- దేశవ్యాప్తంగా ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఉద్దేశించిన కీలకమైన బిల్లుల్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు కేంద్రం సిద్ధం
- 2 బిల్లులను కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ రేపు లోక్‌సభలో ప్రవేశపెట్టే ఛాన్స్
- 2029లోనే ఎన్నికలు జరుగుతాయంటున్న చంద్రబాబు
- వైసీపీ జమిలి ఎన్నికలపై దుష్ప్రచారం చేస్తుందన్న సీఎం

2

న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో
లోక్‌సభలో జమిలి బిల్లులకు ముహూర్తం ఫిక్స్-ఎన్నికలు మాత్రం అప్పుడేనన్న చంద్రబాబు..! దేశవ్యాప్తంగా ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఉద్దేశించిన కీలకమైన బిల్లుల్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు కేంద్రం సిద్ధమైంది. లోక్‌సభతో పాటు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా తయారు చేసిన రెండు బిల్లులను కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. వీటిని ఇప్పటికే కేంద్ర కేబినెట్ ఆమోదించింది. జమిలి ఎన్నికల నిర్వహణకు వీలుగా రాజ్యాంగానికి చేస్తున్న 129వ సవరణ బిల్లుతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లుకు ఇప్పటికే కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. దీంతో నిన్న ఈ బిల్లుల్ని ఎంపీలకు పంపించారు. ఈ ముసాయిదా బిల్లుల్లో సార్వత్రిక ఎన్నికల తర్వాత లోక్‌సభ తొలి సమావేశానికి రాష్ట్రపతి నోటిఫై చేయడానికి అపాయింటెడ్ తేదీ నుండి జమిలి ఎన్నికలు అమలులోకి వస్తాయి. అలాగే ఈ అపాయిం ట్ మెంట్ తేదీ తర్వాత ఎన్నికైన అన్ని రాష్ట్రాల అసెంబ్లీల పదవీ కాలాలు లోక్‌సభ పూర్తి కాల వ్యవధితో పాటు ముగిసేలా తగ్గిస్తారు. దీంతో జమిలి ఎన్నికలకు మార్గం సుగమం అవుతుంది.

పార్లమెంట్‌లో ఏం జరగబోతోంది?
2024లో ఎన్నికైన లోక్‌సభ మొదటి సమావేశం ముగిసినందున, 2029 ఎన్నికలలో ఎన్నికైన సభ యొక్క తొలి సమావేశమే అప్పుడు అపాయింట్ మెంట్ తేదీగా గుర్తిస్తారని తెలుస్తోంది. అంటే 2034 నాటికి ఆ సభ పూర్తి కాలం ముగిసిన తర్వాత జమిలి ఎన్నికలు నిర్వహించవచ్చని సమాచారం. తాజా బిల్లుల ప్రకార లోక్‌సభ లేదా ఏదైనా రాష్ట్రం లేదా

బాలకృష్ణ, జానారెడ్డి ఇళ్లకు హైడ్రా మార్కింగ్..!

- నందమూరి బాలకృష్ణతో పాటు కాంగ్రెస్ మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి
- ఇంటికి హైడ్రా అధికారులు స్వల్పంగా మార్కింగ్
- కేబీఆర్ పార్క్ చుట్టూ ఫై ఓవర్, అండర్ పాస్ నిర్మాణాలకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం
- ఈ నేపథ్యంలో ఇళ్లతో పాటు పలు నిర్మాణాలకు హైడ్రా అధికారులు మార్కింగ్
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై బాలయ్య, జానారెడ్డి మండిపడుతున్నట్లు వినికిడి

2

హైదరాబాద్-నవభూమిబ్యూరో
టాలీవుడ్ హీరో అల్లు అర్జున్ అరెస్టు వివాదం ముగియక ముందే తెలంగాణ ప్రభుత్వం మరో సంచలనానికి తెరలేపింది. ఇప్పటికే హైదరాబాద్‌లో అక్రమంగా చెరువుల్ని, పార్కుల్ని ఆక్రమించుకున్న వారిపై బుల్ డోజర్లతో కూల్చివేతలకు దిగుతున్న ప్రభుత్వం.. ఇద్దరు సినీ, రాజకీయ ప్రముఖుల ఇళ్లకు హైడ్రాతో మార్కింగ్ వేయించింది. త్వరలో వీటిని కూల్చివేసేందుకు సిద్ధమవుతోంది.
హైదరాబాద్‌లో శనివారంనాడు సినీ నటుడు నందమూరి బాలకృష్ణతో పాటు కాంగ్రెస్ మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి ఇంటికి హైడ్రా అధికారులు స్వల్పంగా మార్కింగ్ వేశారు. కేబీఆర్ పార్క్ చుట్టూ ఫై ఓవర్, అండర్ పాస్ నిర్మాణాలకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ నేపథ్యంలో వీరి ఇళ్లతో పాటు పలు నిర్మాణాలకు హైడ్రా అధికారులు మార్కింగ్ చేసినట్లు తెలుస్తోంది.
దీంతో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై బాలయ్య, జానారెడ్డి మండిపడుతున్నట్లు సమాచారం.
ఇప్పటికే హైదరాబాద్ లో హీరో అక్కినేని నాగార్జున కు చెందిన ఎన్ కన్వెషన్ ను హైడ్రా కూల్చేసింది. దీనిపై కోర్టుకు వెళ్లినా నాగార్జున దాన్ని కాపాడుకోలేకపోయారు. ఇప్పుడు

త్వరలో 6వేల పోస్టులతో మరో మెగా డీఎస్సీ

- రాష్ట్రవ్యాప్త ఒకరోజు హాస్టల్ తనిఖీలో భట్టి విక్రమార్క
- ఖమ్మం, మధిర, బోనకల్‌లోని సంక్షేమ, గురుకులకు భట్టి
- రాష్ట్రవ్యాప్తంగా అన్ని సంక్షేమ వసతి గృహాల్లో కొత్త మెనూను ప్రారంభించిన డిప్యూటీ సీఎం



ఖమ్మం-నవభూమిబ్యూరో
నిరుద్యోగులకు తెలంగాణ డిప్యూటీ సీఎం, మంత్రి మల్లు భట్టి విక్రమార్క తీపి కబురు చెప్పారు. త్వరలోనే 6వేల పోస్టులతో మరో మెగా డీఎస్‌సీ వేస్తామని భట్టి విక్రమార్క ప్రకటిం చారు. ఈరోజు రాష్ట్రవ్యాప్త ఒకరోజు హాస్టల్ తనిఖీ కార్యక్రమంలో భాగంగా ఖమ్మం, మధిర, బోనకల్‌లోని సంక్షేమ, గురుకుల పాఠశాలలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని సంక్షేమ వసతి గృహాల్లో కొత్త మెనూను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. 10 సంవత్సరాలుగా మెస్, 16 సంవత్సరాలుగా కాస్మోటిక్స్ ఛార్జీలలో పెరుగుదల లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పెరిగిన ధరలకు అనుగుణంగా డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలను 200 శాతం పెంచామన్నారు. అలాగే త్వరలో 6వేల పోస్టులతో మరో మెగా డీఎస్‌సీ నోటిఫికేషన్ ఇస్తామన్నారు.

గ్రూపు -2 పరీక్షలకు సర్వం సిద్ధం

- రాష్ట్రవ్యాప్తంగా 1,368 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- ఓఎంఆర్ పద్ధతిలో పరీక్షల నిర్వహణ
- ఫలితాలు వేగంగా ఇస్తామన్న టీజీపీఎస్సీ ఛైర్మన్
- సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో
తెలంగాణలో గ్రూపు -2 పరీక్షలకు సర్వం సిద్ధమైంది. టీజీపీఎస్సీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,368 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలను ఓఎంఆర్ పద్ధతిలో నిర్వహించనున్నారు. ఈసారి గ్రూప్ 2 ఫలితాలను వేగంగా ఇస్తాం అని టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు. ఇదే సమయంలో పరీక్షలకు వచ్చే అభ్యర్థులకు కీలక సూచనలు చేసారు. ఏర్పాట్లు పూర్తి ఆదివారం, సోమవారం జరగనున్న గ్రూప్ 2 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని టీజీపీఎస్సీ ఛైర్మన్ వెంకటేశం వెల్లడించారు. పది రోజులుగా అన్ని అంశాలను సమీక్షించామని తెలిపారు. పరీక్షలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతాయని, పబ్లిక్ సర్వీస్ కమిషన్‌పై నమ్మకముంచి పరీక్షలు రాయాలని కోరారు. అభ్యర్థులు ఎలాంటి అపోహలు, అనుమానాలు

ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ అనుకూలం

- ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్ వైఖరి ఇదేనంటూ రేవంత్ కీలక వ్యాఖ్యలు
- చేవెళ్ల డిక్లరేషన్ ద్వారా ఎస్సీ వర్గీకరణపై పార్టీ వైఖరిని వెల్లడించిన ఖర్గే
- ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పులో తమ ప్రభుత్వం కీలక పాత్ర
- రాజకీయ, అధికార నియామ కాల్లో మాదిగలకు ప్రాధాన్యం

2

హైదరాబాద్-నవభూమిబ్యూరో
ఎస్సీ వర్గీకరణపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన గ్లోబల్ మాదిగ డే-2024 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ అనుకూలమని స్పష్టం చేశారు. చేవెళ్ల డిక్లరేషన్ ద్వారా ఎస్సీ వర్గీకరణపై పార్టీ వైఖరిని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే వెల్లడించారని సీఎం రేవంత్ గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పులో తమ ప్రభుత్వం కీలక పాత్ర పోషించిందని సీఎం చెప్పారు. వారం రోజుల్లో ఎస్సీ వర్గీకరణపై షమీమ్ అక్తర్ కమిషన్ నివేదిక వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ' ఎలాంటి ఇబ్బందులు రాకుండా వర్గీకరణ ప్రక్రియ చేపడతామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాజకీయ, అధికార నియామ కాల్లో మాదిగలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. చరిత్రలో తొలిసారి ఓయూ వీసీగా మాదిగ వర్గానికి చెందిన వ్యక్తిని నియమించామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మెనూ చేంజ్ తెలంగాణ వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులందరికీ ఒక విధమైన ఆహారం అందించాలన్న సంకల్పంలో చేపట్టిన కామన్ డైట్ మెనూ నేటి నుంచి ప్రారంభమైం ది. చేవెళ్ల నియోజకవర్గం చిలుకూరు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కామన్ డైట్‌ను ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా కామన్ మెనూ డైట్ కార్యక్రమం జరగ్గా.. చిలుకూరులో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి అక్కడ పలువురు విద్యార్థులతో ముచ్చటించారు. ఈ స్కూల్ నుంచి ప్రతిభ

కల్తీ లడ్డుపై సిట్ నివేదిక సిద్ధం

- సుప్రీం ఆదేశాల మేరకు విచారిస్తున్న సిట్
- తిరుపతిలోనే మకాం..అన్ని కోణాల్లో విచారణ
- సీబీఐ జేడీ నేతృత్వంలో సిట్ విచారణ వేగవంతం
- విచారణలో తేలిన అంశాలపై ప్రాథమిక నివేదిక సిద్ధం చేసి,డైరెక్టర్‌కు సమాచారమిచ్చిన సిట్

2

తిరుపతి-నవభూమిబ్యూరో
తిరుమల లడ్డూ కల్తీ ఘటన విచారణ కీలక దశకు చేరుకుంది. సుప్రీం ఆదేశాల మేరకు ఏర్పాటైన సిట్ విచారణ ముమ్మరంగా సాగుతోంది. తిరుపతిలోనే మకాం వేసి సిట్ అధికారులు అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. లడ్డూ తయారీ కేంద్రం మొదలు..నెయ్యి సరఫరా కంపెనీల వరకు వివరాలు సేకరించారు. పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక నివేదిక సిద్ధం సిట్ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. సంచలనం రేకెత్తించిన తిరుమల లడ్డూ కల్తీ ఘటన విచారణలో కీలక అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. సుప్రీం కోర్టు ఆదేశాలతో ఇప్పటికే సీబీఐ జేడీ నేతృత్వంలోని ఏర్పాటైన సిట్ వేగవంతం చేసింది. తిరుమలలో లడ్డూ తయారీ పోటును పరిశీలించింది. కావాల్సిన సమాచారం సేకరించింది. తిరుమలకు నెయ్యి టెండర్లు - కాంట్రాక్టర్ల ఖరారుపైన ఆరా తీసింది. తిరుమలకు నెయ్యి సరఫరా చేసిన కంపెనీలను పరిశీలించింది. ఏఆర్ డెయిరీలో విచారణ చేసింది. కొన్ని ఫైల్స్ ను స్వాధీనం చేసుకుంది. అక్కడి సిబ్బందిని విచారణ చేసింది. నెయ్యి సరఫరా చేసిన సమయంలో లారీల డ్రైవర్ల విచారణకు సిద్ధమైంది.ఇప్పటి వరకు విచారణలో వెలుగు లోకి వచ్చిన అంశాలను టీం సభ్యులు సీబీఐ ఉన్నతాధికారులకు నివేదించారు. తిరుపతి కేంద్రంగా సిట్ తమ కార్యాలయం ఏర్పాటు

తెలంగాణకు మళ్లీ భారీ వర్షాలు

- బంగాళాఖాతంలో వరుసగా వాయుగుండం
- అల్పపీడన ప్రభావంతో వర్షాలు పడే ఛాన్స్
- 3రోజుల పాటు వర్షాలు:వాతావరణ శాఖ హెచ్చరిక
- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తం

2

హైదరాబాద్-నవభూమిబ్యూరో
తెలంగాణ రాష్ట్రంలో వర్షాలు ఇంకా అడపా దడపా కురుస్తూనే ఉన్నాయి. బంగాళాఖాతంలో వరుసగా ఏర్పడుతున్న అల్పపీడనాల కారణంగా వర్షాలు కురుస్తున్నాయి. ఒకపక్క శీతాకాలం చలి వణికిస్తుంటే మరోపక్క ఉపరితల ఆవర్తనాలు, అల్పపీడనాలు తెలుగు రాష్ట్రాల పైన దాడి చేస్తున్నాయి. అల్పపీడనా ల కారణంగా వర్షాలు తరచూ ఏర్పడుతున్న అల్ప పీడనాల వలన కురుస్తున్న వర్షాలు అన్నదాతలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ప్రస్తుతం తాజాగా నేడు దక్షిణ అండమాన్ సముద్రం మీదగా ఉపరితల ఆవర్తన విస్తరించే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసింది. ఇది రేపటికి అల్పపీడనంగా మారుతుందని పేర్కొంది. ఏపీ, తెలంగాణాలలో వర్షాలు ఆ తదుపరి 48 గంటల్లో ఈ అల్ప పీడనం కాస్తా బలపడి పశ్చిమ వాయువ్య దిశగా తమిళనాడు తీరం వైపు కదిలే అవకాశం ఉందని అంచనా వేసింది. దీని ప్రభావంతో తెలుగు రాష్ట్రాలలో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఇక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సోమ మంగళవారాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని చెప్పిన వాతావరణ శాఖ తెలంగాణ రాష్ట్రంలోనూ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. నేటి నుండి 17 వతేదీ వరకు వాతావరణం ఇలా ఇక ఈరోజు రాష్ట్రంలో పొడి వాతావరణ నెలకొని ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం

దువ్వాడ శ్రీనివాస్‌కు షాక్..!

- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు టెక్కలి పోలీసులు షాక్
- ఎమ్మెల్సీ దువ్వాడ విచారణకు రావాలని 41 ఏ నోటీసులు
- గతంలో దువ్వాడ,పవన్‌కు చెప్పు చూపించి అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు జనసేన కార్యకర్తలు ఫిర్యాదు

2

అమరావతి-నవభూమిబ్యూరో
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నుండి పలువురు వైసిపి నేతలపైన కేసులు నమోదవుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు టెక్కలి పోలీసులు షాక్ ఇచ్చారు. వైసిపి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్కు విచారణకు రావాలని 41 ఏ నోటీసులను ఇచ్చారు. దువ్వాడ శ్రీనివాస్‌కు నోటీసులు గతంలో దువ్వాడ శ్రీనివాస్ పవన్ కళ్యాణ్‌కు చెప్పు చూపిస్తూ చేసిన తీవ్ర వ్యాఖ్యలపైన జనసేన కార్యకర్తలు దువ్వాడ శ్రీనివాస్ మీద పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు దువ్వాడ శ్రీనివాస్‌కు నోటీసులు జారీ చేశారు. ఇక తనకు నోటీసులు ఇవ్వడం పైన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ స్పందించారు. తమకు ఎన్ని నోటీసులు ఇచ్చిన భయపడేది లేదని ఆయన స్పష్టం చేశారు. తన మీద జనసైనికులు చేసిన అనుచిత వ్యాఖ్యలపై చర్యలేవి? తాను గతంలో తీవ్ర వ్యాఖ్యలు చేశానని తన మీద ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసు పెట్టిన పోలీసులు టిడిపి కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత జనసేన కార్యకర్తలు తనను దుర్భాషలాడుతూ తిడుతూ పెట్టిన పోస్టుల పైన ఎటువంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. తన కారును తగలబెడతామని, తనను చంపేస్తామని బెదిరించారని ఆయన ఆరోపించారు. సాక్ష్యాధారాలతో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు జనసేన కార్యకర్తల బెదిరింపులపై తాను

జానీ మాస్టర్ జైలుకు వెళ్లటంలో అల్లు అర్జున్ కుట్ర.. అందుకే ఉసురు తగిలింది: మల్లన్న

హైదరాబాద్-నవభూమి:అల్లు అర్జున్ అరెస్ట్ వ్యవహారంపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సంచలన కామెంట్స్ చేశారు. అల్లు అర్జున్‌కు జానీ మాస్టర్ ఉసురు తగిలిందని అన్నారు. జానీని అక్రమంగా అరెస్ట్ చేసి జైలుకు పంపించటంలో అల్లు అర్జున్ కుట్ర ఉందని.. ఆ ఉసురు తగిలే నేడు జైలుకు వెళ్లాడని ఆరోపించారు. నేషనల్ అవార్డు తానొక్కడికే ఉండాలనే కుట్రతో అల్లు అర్జున్ జానీ మాస్టర్ అరెస్టుకు ప్లాన్ చేశాడని సంచలన ఆరోపణలు చేశారు మల్లన్న.ఓహైదరాబాద్ సంధ్య థియేటర్ ఘటనలో అల్లు అర్జున్ అరెస్ట్ కావటం దేశవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. తొక్కిసలాటలో మహిళ చనిపోవటానికి అల్లు అర్జున్ కూడా కారణమంటూ చిక్కడపల్లి పోలీసులు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేయగా.. ఆయన్ను అరెస్టు చేశారు. ఆ తర్వాత హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అయితే అల్లు అర్జున్ అరెస్ట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నారు. కొందరు ప్రభుత్వ చర్యను సమర్థిస్తుండగా.. మరికొందరు కక్షపూరితం అంటూ వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో అల్లు అర్జున్ అరెస్ట్ వ్యవహారంపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సంచలన కామెంట్స్ చేశారు. జానీ మాస్టర్ జైలుకు వెళ్లటంలో అల్లు అర్జున్ కుట్ర ఉందని.. ఆ ఉసురు తగిలే ఇప్పుడి జైలుకు వెళ్లాడని సంచలన వ్యాఖ్యలు చేశారు. తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన మల్లన్న.. ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు జాతీయ అవార్డును ప్రకటించటం పట్ల అల్లు అర్జున్ జీర్ణించుకోలేకపోయాడని అన్నారు. నేషనల్ అవార్డు తనకొక్కడికే ఉండాలని కుట్రపూరితంగా ఓ అమ్మాయితో కేసులు పెట్టించి జైలుకు పంపినట్లు ఆరోపించారు. జానీ మాస్టర్‌కు బెయిల్ కూడా రాకుండా సుప్రీం కోర్టు దాకా వెళ్లి కేసులు పెట్టినట్లు చెప్పారు.జానీ మాస్టర్ కి బెయిల్ వచ్చినా కూడా నేషనల్ అవార్డు వెనక్కి తీసుకోవాలని లేఖ కూడా రాశారని ఆరోపించారు.



బాలుడి ప్రాణం తీసిన సెల్‌ఫోన్ ఛార్జర్.. ఇలాంటి తప్పు చేయకండి

వరంగల్ -నవభూమి: వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం జల్లి గ్రామంలో సెల్‌ఫోన్‌కు ఛార్జింగ్ పెడుతుండగా కరెంట్ షాక్ కొట్టి ఓ బాలుడు మృతి చెందాడు. స్థానికంగా తొమ్మిదో తరగతి చదువుతున్న బాలుడు రాకేష్ ఇవాళ ఉదయం తన సెల్‌ఫోన్ ఛార్జింగ్ పెట్టే క్రమంలో కరెంట్ షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోయాడు. దీంతో అతడి కుటుంబంలో తీవ్ర విషాదం అలముకుంది.వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం జల్లి గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. సెల్‌ఫోన్ ఛార్జర్ ఓ బాలుడి ప్రాణం తీసింది. సెల్‌ఫోన్ ఛార్జింగ్ పెడుతుండగా.. కరెంట్ షాక్ కొట్టి బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. దీంతో బాలుడి కుటుంబంలో విషాదం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జల్లి గ్రామానికి చెందిన సంపంగి రాకేష్ (16) స్థానికంగా ఉన్న గవర్నమెంట్ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. అయితే శనివారం (డిసెంబర్ 14) ఉదయం నిద్రలేచిన రాకేష్.. తన సెల్‌ఫోన్ ఛార్జింగ్ పెట్టేందుకు ప్రయత్నించాడు.

ఎలక్ట్రిక్ బోర్డు సాకెట్‌లో ఛార్జర్ పెట్టిన రాకేష్.. ఆ తర్వాత కేబుల్‌ను తన సెల్‌ఫోన్‌కు కనెక్ట్ చేసే సమయంలో కరెంట్ షాక్‌కు గురయ్యాడు. అక్కసారిగి విద్యుత్ సరఫరా కావటంతో కుప్పకూలిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్లగ్ నుంచి కరెంట్ తీసేసి రాకేష్‌ను పరిశీలించగా.. అప్పటికే మృతి చెందాడు. దీంతో బాలుడి కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.కాగా, ఇటీవల ఇటువంటి ఘటనలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. సెల్‌ఫోన్లు పేలిపోవటం, షార్ట్ సర్క్యూట్ కారణంగా పలువురు ప్రాణాలు కోల్పోయారు. బ్యాటరీని ఛార్జ్ చేసినప్పుడు అయాన్లు ఒకే దిశలో ప్రవహిస్తుంటాయని నిపుణులు చెబుతున్నారు. ఛార్జింగ్ ప్లగ్ తీసేయగానే అవి విద్యుత్‌ను రెండు వైపులా ప్రసారం చేస్తాయిని అంటున్నారు. క్విక్ ఛార్జింగ్ పద్ధతుల్లో బ్యాటరీని ఛార్జి చేసేటప్పుడు అధిక వేడి ఉత్పత్తి అయి ఆనోడ్‌పై లిథియం పేరుకుపోతుందని అంటన్నారు. దానివల్ల షార్ట్ సర్క్యూట్ జరుగుతుందని నిపుణులు వెల్లడిస్తున్నారు. బ్యాటరీలను ఒక నిర్దిష్ట ఓల్టేజి విద్యుత్‌తో ఛార్జ్ చేసేలా తయారు చేస్తారని.. వేగంగా చార్జ్ చేసేందుకు ప్రయత్నిస్తే కూడా ప్రమాదాలకు అవకాశం ఉంటుందంటున్నారు.

గవర్నమెంట్ హాస్పిటల్‌లో నర్సుల డ్యాన్స్.. రోగులను వదిలేసి కోలాటాలతో నృత్యాలు

జగిత్యాల-నవభూమి:జగిత్యాల జిల్లా హాస్పిటల్‌లో రోగులను వదిలేసి నర్సులు, సిబ్బంది డ్యాన్సులు వేయటం వివాదాస్పదంగా మారింది. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా నర్సులు, సిబ్బంది కోలాటాలతో పాటు డ్యాన్సులు చేశారు. పేషేంట్ల రూమ్ పక్కనే నృత్యాలు చేయగా.. దీనిపై రోగుల బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న జిల్లా అడిషనల్ కలెక్టర్ విచారణకు ఆదేశించారు.

జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సుల డ్యాన్సులు వేయటం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. డ్యూటీ టైంలో రోగులను గాలికి వదిలేసి చిందులు వేయటం వివాదాస్పదంగా మారింది. ప్రభుత్వ ఆసుపత్రిలోని ఓ గదిలో ఎక్కువ సౌండ్ పెట్టి క్రిస్మస్ వేడుకల్లో భాగంగా డ్యాన్సులు వేశారు. రోగులు ఉన్న వార్డులోనే మధ్య గదిలో పెద్దగా సౌండ్ పెట్టి కోలాటాలు, డ్యాన్సులు వేశారు. గది నుంచి పెద్దగా శబ్దం, కేరింతలు రావడంతో రోగుల బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే హాస్పిటల్ ఆర్ఎంవో సుమన్‌కు ఫిర్యాదు చేశారు. అయినా ఫలితం లేకుండా పోయింది. ఆయన నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్లు తెలిసింది.దీంతో రోగుల బంధువులు మీడియాకు విషయం చెప్పారు. అక్కడకు చేరుకున్న మీడియా ప్రతినిధులు ఘటనపై ఆరా తీశారు. ఆర్ఎంవో సుమన్‌ను వివరణ కోరగా.. ముందస్తు క్రిస్మస్ వేడుకలలో భాగంగా డ్యాన్స్ ప్రాక్టీస్ చేసేందుకు తానే పర్మీషన్ ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. రోగులు ఎక్కువ సంఖ్యలో లేకపోవడంతో ఖాళీగా ఉన్నారనే తాను అనుమతి ఇచ్చినట్లు నర్సుల చర్యకు మద్దతు పలికారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు, బోనాల సమయంలో కూడా పూజలు చేశామని, డ్యాన్సులు వేశారని.. అప్పుడు లేని అభ్యంతరం ఇప్పుడు ఎందుకు అని మీడియాను ప్రశ్నించారు. విషయాన్ని పెద్దది చేయొద్దని సూచించారు.జగిత్యాల హాస్పిటల్ విషయం తెలుసుకున్న జిల్లా అడిషనల్ కలెక్టర్ గౌతమ్ రెడ్డి వెంటనే హాస్పిటల్ చేరుకొని ఘటనపై ఆరా తీశారు. డ్యూటీ టైంలో డ్యాన్సులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. విచారణ పేరుతో కాలయాపన చేయకుండా శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ఆదేశించారు. హాస్పిటల్‌లో పని లేకపోతే పర్మినెంట్‌గా ఇంటికి వెళ్లిపోవాలని.. అంతే కానీ రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్యాన్సులు చేసిన నర్సులకు వెంటనే మెమోలు జారీ చేయాలన్నారు.కాగా, ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. డ్యూటీ టైంలో రోగులను వదిలేసి నర్సులు డ్యాన్స్ చేయటాన్ని పలువురు వ్యతిరేకిస్తున్నారు. అనుమతులు ఇచ్చిన వారితోపాటు డ్యాన్సులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పెషేంట్ల బంధువులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం నర్సుల డ్యాన్స్ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

కల్తీ లడ్డుపై సిట్ నివేదిక సిద్ధం

(1వపేజీ తరువాయి)చేసుకుంది. అక్కడే టీటీడీ అన్ని వసతులు కల్పించింది. నెయ్యి సరఫరాలో లోపాల పైన ప్రాథమిక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. అదే విధంగా నెయ్యి సరఫరా చేసే కంపెనీలే సరఫరా చేసాయా.. మధ్యలో ఇతర కంపెనీల జోక్యం ఉందనే ఆరోపణల పైన చెక్ పోస్టుల నుంచి సమాచారం సేకరించారు. అదే విధంగా తిరుమలకు చేరిన నెయ్యి శాంపిల్స్ లాబ్‌లో ఏ విధంగా పరిశీలన చేస్తున్నారు... నాణ్యత ఏమేర నిర్ధారణ అవుతుందనే అంశాలను పరిశీలించారు. ఇక, తిరుపతిలో మకాం వేసిన సిట్ టీం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీబీఐ డైరెక్టర్‌కు వివరాలు తెలిపారు. అంతకుముందు టీటీడీ ఈవో శ్యామలరావును సిట్ సభ్యులు కలిసారు. దర్యాప్తునకు కావాల్సిన సమాచారం కోరింది. నెయ్యి కొనుగోలుకు సంబంధించి విచారణలో తేలిన అంశాలతో ప్రాథమిక నివేదిక సిద్ధం చేసిన సిట్.. ఉన్నతాధికారులను నివేదించినట్లు సమాచారం.

మాజీ మంత్రి కేటీఆర్ అరెస్టు పక్కా..

టాలీవుడ్ హైదరాబాద్ రావటానికి కారణం వాళ్లే.. టీపీసీసీ చీఫ్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్

హైదరాబాద్-నవభూమి:మాజీ మంత్రి కేటీఆర్ ఫార్ములా ఈ కారు రేసు స్కాంలో అరెస్టు కావడం పక్కా అని టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

కేటీఆర్,అలాగే అల్లు అర్జున్ అరెస్టుపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. ఈ మేరకు ఇంట్రెస్టింగ్ కామెంట్లు చేశారు.

టీపీసీసీ చీఫ్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్

రోజుకో పరిణామంతో తెలంగాణలో పరిస్థితులు రసవత్తరంగా సాగుతున్నాయి. ఏ పరిణామం చోటుచేసుకున్నా అది రాజకీయంగా దుమారం చెలరేగుతోంది. కలుషిత ఆహారంతో విద్యార్థులు ఆస్పత్రుల పాలైనా.. సినిమా థియేటర్‌లో తొక్కిసలాట జరిగినా.. ఆ ఘటనలో హీరో అల్లు అర్జున్ అరెస్టయినా.. ఎటు పెట్టీ చివరికి రాజకీయంగా రచ్చ కావాల్సిందే. అయితే.. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అరెస్ట్ వ్యవహారం ఇప్పుడు తెలంగాణ లోనే కాదు అటు ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశవ్యాప్తంగా చర్చనీయాంశం కాగా.. రెండు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయంగా దుమారం చెలరేగింది. అల్లు అర్జున్‌ను ఖండించిన రాజకీయ సినీ ప్రముఖులు.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కావాలనే అరెస్టు చేసిం దని పెద్ద ఎత్తున ఆరోపణలు చేస్తున్నారు. అయితే.. ప్రతిపక్షాలు, సినీ ప్రముఖులు, అభిమానులు చేస్తున్న ఈ ఆరోపణలను కాంగ్రెస్ నాయకులు తిప్పికొడుతున్నారు. అల్లు అర్జున్ అరెస్టుకు తమకు ఎలాంటి సంబంధం లేదని వివరిస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి కూడా.. ప్రభుత్వంపై వస్తున్న ఆరోపణలను తనదైన శైలిలో ఖండించారు. తాజాగా.. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కూడా అల్లు అర్జున్ అరెస్టుపై స్పందిస్తూ.. ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు.హీరో అల్లు అర్జున్‌పై తమ ప్రభుత్వానికి ఎలాంటి కక్ష లేదని మహేష్ కుమార్ స్పష్టం చేశారు. అయితే.. ఆయన కారణంగా జరిగిన తొక్కిసలాటలో ఓ మహిళ చనిపోతే కూడా అరెస్ట్ చేయొద్దా అని మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. ఈ క్రమంలోనే.. తెలుగు చిత్ర పరిశ్రమ హైదరాబాద్ రావటానికి.. కాంగ్రెస్ ముఖ్యమంత్రులే కారణమని మహేష్ కుమార్ గౌడ్ చెప్పుకొచ్చారు.

దీంతో.. మరో సరికొత్త అంశం చర్చనీయాంశంగా మారింది.

అల్లు అర్జున్ మా బంధువు.. అరెస్ట్ దురదృష్టకరం: ఎమ్మెల్యే దానం నాగేందర్

హైదరాబాద్-నవభూమి:జాతీయ అవార్డు గ్రహీత, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అరెస్ట్ వ్యవహారం ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో ఓ మహిళ మరణించిన ఘటనలో చిక్కడపల్లి పోలీసులు అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. అయితే.. అల్లు అర్జున్ అరెస్ట్ ఘటనపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పందించారు. హీరో అల్లు అర్జున్ తమ బంధువని దానం నాగేందర్ తెలిపారు. అల్లు అర్జున్ అరెస్ట్ కావడం బాధాకరమన్నారు. అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయడంపై విచారం వ్యక్తం చేస్తున్నానని తెలిపారు. అయితే.. వెంటనే బెయిల్ దొరకడం సంతోషక రమని చెప్పుకొచ్చారు.అల్లు అర్జున్.. తెలుగు సినిమాతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పేర్లను జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లి.. మంచిపేరు తీసుకొచ్చారని దానం నాగేందర్ కొనియాడారు. అల్లు అర్జున్ పాన్ ఇండియా హీరోనే కాదు పాన్ వరల్డ్ హీరో అంటూ ప్రశంసించారు. అరెస్ట్ కావడం దురదృష్టకరమైన సంఘటనగా తాను భావిస్తు న్నట్టు ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. ప్రభుత్వమే అల్లు అర్జున్‌ని అరెస్ట్ చేయించిందని ప్రతిపక్షాలు ఆరోపించటం భావ్యం కాదని దానం అన్నారు. అయితే.. సంధ్య థియేటర్ ఘటనలో పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన చిక్కడపల్లి పోలీసులు శుక్రవారం రోజు అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేశారు. మొదట పోలీస్ స్టేషన్‌కు తరలించి.. స్టేట్‌మెంట్ రికార్డు చేసిన పోలీసులు.. అనంతరం గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేశారు. అటు నుంచి నేరుగా నాంపల్లి కోర్టు ఎదుట హాజరుపర్చగా.. 14 రోజులు రిమాండ్ విధించింది.

కేటీఆర్‌కు అరెస్ట్ తప్పదా?

(1వపేజీ తరువాయి)అయినా ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్ట్ చేసే అవకాశాలు లేకపోలేదని ప్రచారం మరోసారి ఊపందుకుంది. నాలుగేళ్లపాటు హైదరాబాద్ మహానగరంలో ఫార్ములా- ఈ కారు రేసు నిర్వహణకు సంబంధించి ఎఫ్ఈఓ, ఏస్ నెక్ట్స్‌జెన్ ప్రైవేటు లిమిటెడ్‌తో కలిసి పురపాలక శాఖ 2022 అక్టోబర్ 25 త్రైపాక్షిక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం మేరకు 2023 ఫిబ్రవరి 10,11 తేదీల్లో నిర్వహించిన ఈ కార్ల రేస్‌కు దేశవ్యాప్తంగా అభిమానులు వచ్చారు. అయితే ప్రమోటర్ ఏస్ నెక్ట్స్‌జెన్ సంస్థ ఆశించిన మేరకు ఆదాయం రాలేదు. దాంతో ఆ ప్రమోటర్ తప్పుకున్నారు. ఇక.. 2024 ఫిబ్రవరి 10న జరగాల్సిన రెండో దఫా ఈ కార్ రేసు నుంచి హైదరాబాద్ పేరును ఎఫ్ఈఓ తొలగించింది. అయితే.. అప్పటి మంత్రి కేటీఆర్ ఫార్ములా ఈ నిర్వహిస్తే హైదరాబాద్‌కు తలమానికంగా ఉంటుందని భావించారు. దాంతో 2024 ఫిబ్రవరిలోనూ హైదరాబాద్ లోనే నిర్వహించాలని కోరారు. ప్రమోటర్ నిర్వహించే బాధ్యతలను నోడల్ ఏజెన్సీగా హెచ్ఎండీఏ చూసుకుంటుందని ఎఫ్ఈఓకు చెప్పారు. దాంతో రెండో దఫా ఈ కార్ రేసు 2023 అక్టోబర్‌లో ఎఫ్ఈఓతో పురపాలక సంఘం ఒప్పందం కుదుర్చుకుంది. రేస్ నిర్వహణకు రూ.100 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఇందులోభాగంగా హెచ్ఎండీఏ రూ.55 కోట్లను ఎఫ్ఈఓకు సైతం చెల్లించింది. అయితే.. గతేడాది కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. పురపాలక శాఖ ఒప్పందంలోని అంశాలను ఉల్లంఘించారంటూ ఎఫ్ఈఓ సెషన్ 10ను రద్దు చేసింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆర్థిక శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా రూ.55 కోట్లను విదేశీ సంస్థకు హెచ్ఎండీఏ ద్వారా చెల్లింపులు చేయడాన్ని సీరియస్‌గా తీసుకుంది. దీనిపై వివరణ ఇవ్వాలంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి మెమో జారీ చేశారు. ఆ మెమోకు అప్పటి పురపాలక శాఖ అధికారి అర్వింద్ కుమార్ వివరణ ఇచ్చారు. తాను ఎలాంటి నిబంధనలు ఉల్లంఘించలేదని, అప్పటి మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకే చెల్లింపులు చేశామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ఫార్ములా ఈ రేసుకు సంబంధించి ఏసీబీ విచారణ చేయాలంటూ పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దాన కిశోర్ లేఖ రాశారు. దీనికి ప్రభుత్వం సైతం సమ్మతించింది. ఏసీబీ జేడీ స్థాయి అధికారి నేతృత్వంలోని అధికారులు ఫార్ములా ఈ రేసు అంశాన్ని తిరగదోడారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, అప్పటి చీఫ్ ఇంజినీరుతోపాటు గత ప్రభుత్వం పురపాలక శాఖ మంత్రిగా పనిచేసిన కేటీఆర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి అనుమతి ఇవ్వాలని ప్రభుత్వానికి ఏసీబీ లేఖ రాసింది. ఈ మేరకు ఇద్దరు అధికారులపై విచారణకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ప్రజాప్రతినిధి అయిన కేటీఆర్‌పై కేసు నమోదుకు అనుమతి ఇవ్వాలని గవర్నర్‌కు లేఖ రాశారు. ఈ అంశంపై న్యాయ సలహా తీసుకున్న అనంతరం గవర్నర్ అనుమతి ఇచ్చినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఏసీబీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందా అని వేచి చూడాలి.

పార్టీ పగ్గాలు ఎవరికీ?

హైదరాబాద్-నవభూమి: ఫార్ములా ఈ కారు రేస్ స్కాంలో కేటీఆర్‌పై ఎఫ్ఐఆర్ నమోదుకు గవర్నర్ అనుమతి ఇచ్చినట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో కేటీఆర్ అరెస్టుకు రంగం సిద్ధమైనట్లు వినిపిస్తోంది. బీఆర్ఎస్ పార్టీకి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న కేటీఆర్ అరెస్టు తర్వాత పార్టీ పగ్గాలు ఎవరికి దక్కుతాయన్న చర్చ ఊపందుకుంది. పార్టీలో ప్రస్తుతం రెండో స్థానంలో మాజీ మంత్రి హరీశ్ ఉన్నారు. ఇక జైలు నుంచి వచ్చిన కేసీఆర్ తనయ కవిత,ఇటీవల కొద్దిరోజుల నుంచి యాక్టివ్ అయ్యారు. పార్టీ కార్యక్రమాల్లో విరివిగా పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో వర్కింగ్ ప్రెసిడెంట్ సీటును ఎవరు భర్తీ చేస్తారు? గులాబీ బాస్ మదిలో ఎవరున్నారన్న దానిపై చర్చ సాగుతోంది.

కేటీఆర్ అరెస్టు పక్కా అని టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్ స్వయంగా ప్రకటించిన నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ అప్రమత్తమైంది. బెయిల్ కోసం సుప్రీం న్యాయవాదులను సంప్రదిస్తూనే పార్టీని కాపాడుకునేందుకు కసరత్తు ప్రారంభించింది. అయితే పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఎవర్ని నియమించాలన్న దానిపై కేసీఆర్‌కు కత్తిమీద సాములా మారింది. కేటీఆర్‌తో సమంగా హరీశ్ ప్రభుత్వంపై నిరసన కార్యక్రమాలు చేపడుతూ పార్టీ కార్యకర్తలను జాగృతం చేస్తూ వస్తున్నారు. ఆయన్ను కాదనలేని పరిస్థితి.ఇటు కవిత మరింత జోష్‌తో రాజకీయ క్షేత్రంలో అడుగుపెడుతున్నారు. పుత్రికా ప్రేమను కాదనలేని పరిస్థితి. ఏటావాటా కవిత చేతుల్లోనే పార్టీ కార్యనిర్వాహక పగ్గాలు పెట్టి, హరీశ్‌కు కీలకమైన పదవి ఇచ్చే ఆలోచనల్లో ఉన్నట్లుగా కూడా కేసీఆర్ ఆలోచన చేస్తున్నట్లు వినిపిస్తోంది. ఏది ఏమైనా కొద్దిరోజుల నుంచి కేసీఆర్ పార్టీ శ్రేణుల నుంచి దీనిపై అభిప్రాయాలను కోరుతున్నట్లుగా కూడా వినిపిస్తోంది. చిట్టచివరికి కార్యకర్తల మనోభావాలకు అనుగుణంగా కవితకే వర్కింగ్ ప్రెసిడెంట్ తాత్కాలికంగా నియమించే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఈ లోగా హరీశ్‌కు బుజ్జగించే ప్రయత్నాలు కూడా జరగవచ్చు.

పుష్ప విడుదల

హైదరాబాద్-నవభూమి:అల్లు అర్జున్ విడుదల నేపథ్యంలో జైలు వద్ద భారీ జనసందోహం ఉండటంతో అధికారులు ముందు చూపుతో వెనుక గేటు నుంచి ఆయనను బయటకు పంపించారు. %దీఎ: ఎబజ్ఝుఎఱ ణవంఎ ఎ 14 ణవఎ 2024 2:12 ౸వీ% సంధ్య థియేటర్ సంఘటన నేపథ్యంలో నమోదు అయిన కేసులో అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెల్సిందే. అరెస్ట్ అయిన కొన్ని గంటల్లోనే బెయిల్ మంజూరు అయినప్పటికీ కొన్ని టెక్నికల్ ఇష్యూస్ చెప్పి అల్లు అర్జున్‌ను రాత్రి మొత్తం చంచల్‌గూడ జైలు లోనే ఉంచారు. శనివారం ఉదయం ఆరు గంటల సమయంలో అల్లు అర్జున్‌ను జైలు నుంచి విడుదల చేశారు. అల్లు అర్జున్ విడుదల నేపథ్యంలో జైలు వద్ద భారీ జనసందోహం ఉండటంతో అధికారులు ముందు చూపుతో వెనుక గేటు నుంచి ఆయనను బయటకు పంపించారు. మెయిన్ గేటు నుంచి లోనికి వెళ్లిన అల్లు అర్జున్ వెనుక గేటు నుంచి బయటకు వచ్చాడు. ఈ కేసులో బెయిల్ వచ్చినా రాత్రి మొత్తం జైలులో అల్లు అర్జున్‌ను ఉంచడం పట్ల పలువురు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కావాలని అల్లు అర్జున్‌ను జైల్లో ఉంచారు అంటూ కొందరు ఆరోపిస్తున్నారు. ఆ విషయమై న్యాయస్థానంలోనే తేల్చుకుంటాం అంటూ అల్లు అర్జున్ తరపు న్యాయవాదులు చెప్పుకొచ్చారు. ఆ విషయం పక్కన పెడితే అల్లు అర్జున్ చంచల్‌గూడ జైలు నుంచి బయటకు వచ్చిన సమయంలో తీసిన ఫోటోలు, వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ లోనికి వెళ్లే సమయంలో ఎలా ఉన్నాడో అదే డ్రెస్‌లో బయటకు వచ్చేప్పుడు ఉన్నారు. అల్లు అర్జున్ చాలా స్టైల్‌గా బయటకు వస్తున్నారంటూ ఈ ఫోటోలను సోషల్ మీడియాలో ఫ్యాన్స్ పెద్ద ఎత్తున షేర్ చేస్తున్నారు. అల్లు అర్జున్‌ను ఒక్క రాత్రి జైల్లో పెట్టి సంతోషిస్తున్న వారికి ఈ స్టైలిష్ వాక్ తో తగిన బుద్ధి చెప్పాడు అంటూ అల్లు అర్జున్ ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

గ్రూపు -2 పరీక్షలకు సర్వం సిద్ధం

(1వపేజీ తరువాయి)పెట్టుకోవద్దు అని చెప్పారు. మెరిట్ ఉంటే మిమ్మల్ని ఎవరూ ఆపలేరు అని అన్నారు. 5.51 లక్షల మందికి పైగా విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. వీటిని నో ఎంట్రీ గ్రూపు -2 లో 783 పోస్టుల భర్తీకి 2022 డిసెంబర్ 29న నోటిఫికేషన్ విడుదలైంది. పలు కార ణాల వల్ల పరీక్ష వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు ఈ నెల 15, 16 తేదీల్లో పరీక్షలను నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. పరీక్షకు హాజరయ్యే వారు హాల్ టికెట్‌తో పాటు ఇటీవల దిగిన పాస్ పోర్టు సైజు ఫొటో, ప్రభుత్వంచే జారీ చేయబడ్డ ఏదైనా గుర్తింపు కార్డు తీసుకురావాలని అధికారులు సూచించారు. ఇక మహిళా అభ్యర్థులకు మంగళసూత్రం, గాజుల వరకే అనుమతించనున్నారు. ఇతర ఆభరణాలు ఉంటే అనుమతించమని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ చెప్పులే ధరించాలన్నారు. బెల్ట్‌లు, రిమోట్ కీస్‌కు అనుమతి లేదని తెలిపారు. వేగంగా ఫలితాలు ఈసారి గ్రూప్ 2 ఫలితాలను వేగంగా ఇస్తాం అని టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు. మెరిట్ ఉంటే అర్హత సాధించే వారిని ఎవరూ ఆపలేరు అని అన్నారు. 5.51 లక్షల మందికి పైగా విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. పత్రి ఒక్కరికీ బయోమెట్రిక్ తప్పనిసరి అని అన్నారు. ప్రశ్నా పత్రాలకు సంబంధించి 58 స్టోరేజ్ పాయింట్లు పెట్టామన్నారు. అభ్యర్థికి తప్ప ప్రశ్నాపత్రం ఎవరికీ తెలిసే అవకాశం లేదు అని స్పష్టం చేశారు. 2015లో గ్రూప్ 2 నోటిఫికేషన్ అమలుకు చాలా సమయం తీసుకున్నారని అన్నారు. ఈ సారి వేగంగా ఫలితాలు ఇస్తాం అని బుర్రా వెంకటేశం చెప్పారు.

బాలకృష్ణ, జానారెడ్డి ఇళ్లకు హైడ్రా మార్కింగ్..!

(1వపేజీ తరువాయి)బాలయ్య, జానారెడ్డి ఇళ్లకు మార్కింగ్ వేయడంతో వీటి విషయంలో ప్రభుత్వం దూకుడుగా ముందుకెళ్తుందా, అదే జరిగితే వీరు ఎలా స్పందించబోతున్నారనేది ఉత్కంఠగా మారింది. ఇప్పటికే సినీ పరిశ్రమకు చెందిన నాగార్జున, అల్లు అర్జున్ ల విషయంలో దూకుడుగా ముందుకెళ్లిన ప్రభుత్వం.. ఇప్పుడు బాలయ్యకు సంబంధించిన నిర్మాణాలను కూడా టార్గెట్ చేస్తోందా అన్న చర్చ జరుగుతోంది.

ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ అనుకూలం

(1వపేజీ తరువాయి)కనబరిచి ఐఐటీ లాంటి ఉన్నత విద్యా సంస్థల్లో చేరిన పలువురు విద్యార్థులకు ల్యాప్ టాప్‌లు బహూకరించారు. అనంతరం పిల్లలు, వారి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. భోజనం చేస్తున్న సందర్భంగా విద్యార్థు

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 | హైదరాబాద్ ఆదివారం 15 డిసెంబర్ 2024

కేంద్రంలో ప్రభుత్వాన్ని రద్దు చేసి మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి: అఖిలేష్ యాదవ్

న్యూఢిల్లీ–నవభూమి: జమిలి ఎన్నికలకు సంబంధించిన 'ఒక దేశం, ఒకే ఎన్నిక' బిల్లు ప్రతిపాదనపై సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ మండిపడ్డారు. ఇంత హడావిడి చేస్తున్న ప్రధాని మోదీ కేంద్రంలో ప్రభుత్వాన్ని రద్దు చేసి మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. శనివారం పార్లమెంట్‌లో రాజ్యాంగంపై చర్చ జరిగింది. ప్రధాని మోదీ హాజరై ఈ చర్చలో పాల్గొని ప్రసంగించారు.

కాగా, అఖిలేష్ యాదవ్ ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. 'వన్ నేషన్ వన్ ఎలక్షన్' ప్రతిపాదనపై

మండిపడ్డారు. 'ఈ నివేదికలో 2,000 పేజీలు ఉంటాయని నేను అనుకుంటున్నా. నివేదిక ఏమిటో కూడా మాకు తెలియదు. 'వన్ నేషన్ వన్ ఎలక్షన్' తీసుకురావడానికి వారు ఇంత హడావిడి చేస్తున్నారు. ప్రధాని మోడీ ఇవాళ (పార్లమెంట్‌కు) వస్తున్నారు. ప్రభుత్వాన్ని ఆయన రద్దు చేయాలి. రాజ్యాంగంపై చర్చ జరుగుతున్నప్పుడు ఇదే మంచి సమయం. మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి' అని మీడియాతో అన్నారు.

18న రైల్ రోకో.. రైతు నేత సర్వాన్ సింగ్ పిలుపు

న్యూఢిల్లీ–నవభూమి: దేశ రాజధాని ఢిల్లీ శివారులోని పంజాబ్, హర్యానా సరిహద్దులో ఆందోళన చేస్తున్న రైతులను చెదరగొట్టేందుకు పోలీసులు శనివారం టియర్ గ్యాస్ ప్రయోగించారు. లాఠీచార్జి చేశారు. ఈ ఘటనల్లో 17 మంది రైతులు గాయపడ్డారు. వారిలో పలువురి పరిస్థితి తీవ్రంగా ఉంది. ఈ నేపథ్యంలో రైతులు తమ ఢిల్లీ చలో పాదయాత్రను నిలిపివేశారు. రైతులపట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై రైతు నేత సర్వాన్ సింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రపంచలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన భారత ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్న రైతులను బలగాలను ప్రయోగించిందని విమర్శించారు. రైతులపై కెమికల్ వాటర్ ప్రయోగించిందని ఆరోపించారు. అంతేగాక భాష్ప వాయుగోళాలు ప్రయోగించారని, బాంబులు విసిరారని మండిపడ్డారు. ఈ ఘటనల్లో 17 మంది గాయపడ్డారని చెప్పారు. పలువురి పరిస్థితి విషమంగా ఉందన్నారు. గాయపడ్డ రైతులకు సరైన చికిత్స కూడా అందించడం లేదని, వారికి సరైన చికిత్స అందేలా చూడాలని తాము పంజాబ్ ప్రభుత్వాన్ని కోరుతున్నామని సర్వాన్ సింగ్ చెప్పారు. అదేవిధంగా తమ భవిష్యత్ కార్యాచరణను కూడా సింగ్ వెల్లడించారు. ఈ నెల 16న పంజాబ్ బయట ట్రాక్టర్ ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. ఈ నెల 18న రైల్ రోకోకు పిలుపునిచ్చామని తెలిపారు. రైల్ రోకోలో పంజాబీ రైతులంతా పాల్గొని జయప్రదం చేయాలని సర్వాన్ సింగ్ కోరారు. ప్రతిపక్షాలు తమపాత్రను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. రైతులకు మద్దతుగా కేవలం ప్రకటనలతో సరిపెట్టుకోవద్దని హితవు పలికారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం కృషిచేయాలని కోరారు. ఇతర అంశాలపై పార్లమెంట్‌ను స్తంభింపజేసినట్టే రైతు సమస్యలపై కూడా పార్లమెంట్‌ను స్తంభింపజేయాలని డిమాండ్ చేశారు.

నేను ఎలాంటి రాజీనామా చేయలేదు.. క్లారిటీ ఇచ్చిన మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్

ముంబై – నవభూమి: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమికి బాధ్యత వహిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నానా పటోలే రాజీనామా చేశారంటూ వచ్చిన వార్తలను ఆయన కొట్టి వేశారు. తాను ఎలాంటి రాజీనామా చేయలేదని క్లారిటీ ఇచ్చారు. వాస్తవానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా తన పదవీకాలం మూడేళ్లు మాత్రమేనని, కానీ తాను నాలుగేళ్లుగా అధ్యక్ష పదవిలో కొనసాగుతున్నానని ఆయన చెప్పారు. అయినా తాను పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవికి పోటీ చేయడం, చేయకపోవడం అనేది తమ పార్టీ అంతర్గత వ్యవహారమని పటోలే వ్యాఖ్యానించారు. అయితే ప్రతి ఒక్కరికీ పార్టీ కోసం పనిచేసే అవకాశం దక్కాలని ఆయన అభిప్రాయపడ్డారు. మా పార్టీ గెలిచిన క్రెడిట్ తాను ఎన్నడూ తన ఖాతాలో వేసుకోలేదని, అదేవిధంగా అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి కూడా ప్రతి ఒక్కరూ బాధ్యులేనని ఆయన అన్నారు. కాగా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ కూటమి విజయం సాధిస్తుందని అంతా భావించారు. కానీ అందరి అంచనాలను తలకిందులు చేస్తూ మళ్లీ బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమికే మరాఠీ ప్రజలు పట్టంకట్టారు. దాంతో దేవేంద్ర ఫడ్నవీస్ నేతృత్వంలో సంకీర్ణ సర్కారును ఏర్పాటు చేశారు. ఏక్‌నాథ్ షిండే శివసేన పార్టీ అధ్యక్షుడు ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ ఎన్సీపీ పార్టీ చీఫ్ అజిత్ పవార్ ఉప ముఖ్యమంత్రులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

అసలు విషయాలు మాట్లాడటం బీజేపీకి ఇష్టం లేదు : ప్రియాంకాగాంధీ

న్యూఢిల్లీ–నవభూమి: పార్లమెంట్‌లో అసలైన అంశాలు లేవనెత్తడం ఎన్డీఏ సర్కారు ఇష్టం లేదని కాంగ్రెస్ పార్టీ జాతీయ కార్యదర్శి, ప్రియాంకాగాంధీ వాద్రా విమర్శించారు. శుక్రవారం లోక్‌సభలో చేసిన తొలి ప్రసంగంలోనే ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించిన ఆమె.. శనివారం మరోసారి కేంద్ర సర్కారు వైఖరిని తప్పుపట్టారు. నిజాలు మాట్లాడితే కేంద్రానికి నచ్చడం లేదని అన్నారు. శుక్రవారం లోక్‌సభలో తాను చేసిన ప్రసంగం నుంచి అదానీ అనే పదాన్ని తొలగించారని ప్రియాంకాగాంధీ ఆరోపించారు. ఆ పదాన్ని ఎందుకు తొలగించాల్సి వచ్చిందని ఆమె ప్రశ్నించారు. అదానీ అనే పదం ఏమైనా అన్‌పార్లమెంటరీ పదమా..? అని ప్రియాంకా ఫైర్ అయ్యారు. వాళ్లు పార్లమెంటులో ఎవరి పేరైనా ఎత్తువచ్చు, కానీ తాము మాత్రం అదానీ పేరు ఎత్తకూడదా..? అని మండిపడ్డారు. బీజేపీ నేతలు తరచూ నెహ్రూ, ఇందిర, రాజీవ్ పేర్లు ప్రస్తావించడంపై ఆమె ఈ విధంగా స్పందించారు.

నితీశ్ కుమార్‌ను 'ఇండియా' బ్లాక్ హెడ్‌గా చేసి ఉంటే వీడేవారు కాదు: ఒమర్ అబ్దుల్లా

న్యూఢిల్లీ–నవభూమి: జమ్ముకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా టీవీ చర్చా కార్యక్రమంలో పలు అంశాలపై మాట్లాడారు. ఇండియా బ్లాక్ నాయకత్వం, ఆర్టికల్ 370, పాకిస్థాన్‌తో సంబంధాలతో సహా కీలక రాజకీయ అంశాలను ఆయన ప్రస్తావించారు. బీహార్ సీఎం నితీశ్ కుమార్‌ను 'ఇండియా' బ్లాక్ హెడ్‌గా చేసి ఉంటే కూటమిని ఆయన వీడేవారు కాదని తెలిపారు. 'నితీశ్ కుమార్‌ను ఇండియా బ్లాక్ కన్వీనర్‌గా చేయడానికి మేం ప్రయత్నించాం. అయితే ఆయన చీఫ్‌గా ఉండటంపై కూటమిలోని కొన్ని వర్గాలు సంతోషంగా లేవు. ఆయనను చీఫ్‌గా చేయడంలో మేం విజయం సాధించినట్లయితే, ఇప్పటికీ మాతో ఉండేవారు' అని అన్నారు. కాగా, జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పని తీరు గురించి అడిగిన ప్రశ్నకు సమాధానాన్ని ఒమర్ అబ్దుల్లా దాటవేశారు. పార్టీకి నాయకత్వం వహిస్తున్న తండ్రి ఫరూక్ అబ్దుల్లా నిర్ణయంపై విమర్శలు చేయబోనని చెప్పారు. 'అతడు నా బాస్. ఆయన వ్యాఖ్యను నేను ఖండించలేను' అని అన్నారు. జమ్ముకశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరణకు తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. మరోవైపు పాకిస్థాన్‌తో చర్చలకు సంబంధించిన బాధ్యత ఆ దేశానికే ఎక్కువగా ఉందని ఒమర్ అబ్దుల్లా తెలిపారు. ముంబై దాడులు, జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదంపై భారత్ ఆందోళనలను పరిష్కరించడానికి పాకిస్థాన్ చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. 'పాకిస్థాన్ ఆక్రమణలో ఉన్న జమ్ముకశ్మీర్ భాగాన్ని తిరిగి తీసుకురావాలని మేం కోరుకుంటున్నాం. దీనికి యుద్ధం పరిష్కారం కాదు. చర్చలు అవసరం' అని అన్నారు.

టీచర్‌ను కిడ్నాప్ చేసి.. మహిళతో బలవంతంగా పెళ్లి

పాట్నా–నవభూమి: స్కూల్‌కు వెళ్తున్న టీచర్‌ను కొందరు వ్యక్తులు కిడ్నాప్ చేశారు. అతడ్ని గన్స్‌తో బెదిరించి కొట్టి గుడి వద్దకు తీసుకెళ్లారు. అక్కడ పెళ్లికూతురు ముస్తాబులో ఉన్న మహిళతో బలవంతంగా పెళ్లి చేశారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. బీహార్‌లోని కతిహార్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బేగుర్‌సరాయ్ జిల్లాలోని రాజౌరాకి చెందిన అవ్నీష్ కుమార్ ఇటీవల ప్రభుత్వ టీచర్ ఉద్యోగం పొందాడు. కతిహార్ జిల్లాలోని మిడిల్ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. కాగా, లఖిసరాయ్ జిల్లాకు చెందిన గుంజన్ అనే మహిళతో అవ్నీష్‌కు నాలుగేళ్లుగా ప్రేమ వ్యవహారం ఉంది. అయితే టీచర్ ఉద్యోగం వచ్చిన తర్వాత ఆమెను పెళ్లి చేసుకునేందుకు నిరాకరించాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆటోలో స్కూల్‌కు వెళ్తున్న అవ్నీష్‌ను రెండు వాహనాల్లో వచ్చిన కొందరు వ్యక్తులు అడ్డుకున్నారు. గన్స్‌తో బెదిరించి కొట్టి అతడ్ని కిడ్నాప్ చేశారు. ఒక ఆలయం వద్దకు తీసుకెళ్లారు. అక్కడ పెళ్లికూతురి అలంకరణలో ఉన్న గుంజన్‌తో బలవంతంగా పెళ్లి చేశారు. మరోవైపు ఈ బలవంతపు పెళ్లి తర్వాత గుంజన్ తన కుటుంబంతో కలిసి అవ్నీష్ ఇంటికి వెళ్లింది. అయితే ఆమెను కోడలుగా స్వీకరించేందుకు అతడి కుటుంబ సభ్యులు నిరాకరించారు. దీంతో తనకు న్యాయం చేయాలంటూ గుంజన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా, గుంజన్‌తో తనకు ఎలాంటి ప్రేమ వ్యవహారం లేదని అవ్నీష్ ఆరోపించాడు. ఆమె తన వెంటపడి వేధించిందని తెలిపాడు. స్కూల్‌కు వెళ్తున్న తనను కొంతమంది వ్యక్తులు కిడ్నాప్ చేశారని, కొట్టి బలవంతంగా గుంజన్‌తో పెళ్లి తంతు జరిపించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మద్యం కోసం వ్యక్తితో పరిచయం.. శిశువు మాయం

లక్నో:–నవభూమి: భార్య, నాలుగు నెలల శిశువుతో కలిసి రైలులో ప్రయాణించేందుకు ఒక వ్యక్తి స్టేషన్‌కు చేరుకున్నాడు. స్టేషన్ బయట మద్యం తాగుతున్న ఇద్దరితో పరిచయం పెంచుకున్నాడు. వారితో కలిసి మద్యం సేవించాడు. అయితే అందులోని ఒకడు పసి పాపను కిడ్నాప్ చేశాడు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ఈ సంఘటన జరిగింది. డిసెంబర్ 10న మసూరి గ్రామానికి చెందిన దీపక్, 23 ఏళ్ల భార్య అర్చన, నాలుగు నెలల కుమార్తె కిస్మత్‌తో కలిసి ఘజియాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. ఆగ్రా వెళ్లే రైలు కోసం వారు వేచి ఉన్నారు. కాగా, రైలు రావడానికి సమయం ఉండటంతో స్టేషన్ బయటకు దీపక్ వెళ్లాడు. అక్కడ ఇద్దరు వ్యక్తులు మద్యం తాగడాన్ని చూశాడు. వారి వద్దకు వెళ్లి పరిచయం చేసుకున్నాడు. తాను కూడా ఆగ్రా వెళ్తున్నట్లు వికాశ్ అనే వ్యక్తి తెలిపాడు. ఈ నేపథ్యంలో దీపక్ వారితో కలిసి మద్యం తాగాడు. మరోవైపు తిరిగి స్టేషన్‌లోకి వచ్చిన దీపక్ మద్యం మత్తులో ఉండగా అతడి భార్య టాయిలెట్‌కు వెళ్లింది. ఆమె తిరిగి వచ్చే సరికి వారి మూడు నెలల పసి బిడ్డ మాయమైంది. మద్యం మత్తు వీడిన తర్వాత దీపక్‌కు ఈ విషయం తెలిసింది. దీంతో రాత్రి 9 గంటల సమయంలో తన భార్యతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా, తాను పరిచయం చేసుకున్న వికాశ్ తన బిడ్డను కిడ్నాప్ చేసినట్లు దీపక్ ఆరోపించాడు. తన బిడ్డను ఇవ్వమని, డబ్బులు ఇస్తానని పలుమార్లు అతడు తనతో అన్నట్లు పోలీసులకు చెప్పాడు. దీంతో శిశువు కిడ్నాప్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాయనాడ్‌కు సహాయ ప్యాకేజీ కోసం.. కేరళ ప్రతిపక్ష ఎంపీల నిరసన

న్యూఢిల్లీ–నవభూమి: కేరళకు చెందిన ప్రతిపక్ష ఎంపీలు శనివారం పార్లమెంట్ వద్ద నిరసన తెలిపారు. కొండచరియలు విరిగిపడిన ప్రకృతి విలయంలో భారీగా నష్టం వాటిల్లిన వాయనాడ్‌కు సహాయ ప్యాకేజీ కోసం కేంద్రాన్ని డిమాండ్ చేశారు. వాయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రాతో సహా ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంటులోని మకర్ ద్వార్ వద్ద నిరసన చేపట్టారు. 'జస్టిస్ ఫర్ వాయనాడ్. వాయనాడ్‌కు రిలీఫ్ ప్యాకేజీ అందించండి' అన్న బ్యానర్‌ను ప్రదర్శించారు. 'వాయనాడ్‌కు న్యాయం చేయండి. విపక్ష చూపవద్దు' అని నినాదాలు చేశారు.

కాగా, వాయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. వాయనాడ్‌కు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం నిరాకరిస్తున్నదని ఆరోపించారు. వాయనాడ్‌తోపాటు హిమాచల్ ప్రదేశ్‌లోని బాధితులను రాజకీయాల కారణంగా కేంద్ర ప్రభుత్వం ఆదుకోవడం లేదని విమర్శించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో వివక్ష చూపకూడదని ఆమె అన్నారు. మరోవైపు వాయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ, డిసెంబర్ 3న కేరళ ప్రతిపక్ష ఎంపీలతో కలిసి కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిశారు. తక్షణ సహాయం అందించాలని కోరారు. జూలై 30న భారీ వర్షాలకు వాయనాడ్‌లో కొండచరియలు విరిగిపడి భారీగా ప్రాణ, ఆస్తి నష్టం జరిగింది. 300 మందికిపైగా మరణించగా అనేక ఇళ్లు, భవనాలు ధ్వంసమయ్యాయి. ముండక్కై, చూరల్‌మల ప్రాంతాల ప్రజలు ఎక్కువగా ప్రభావితమయ్యారు.

భార్యతో గొడవపడి ఇల్లుకు నిప్పంటించాడు..



న్యూఢిల్లీ–నవభూమి: భార్యాభర్తల గొడవ విషాదాంతమైంది. క్షణికావేశం ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. నలుగురిని తీవ్ర గాయాలపాలయ్యేలా చేసింది. ఛత్తీసగఢ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రాయ్‌పూర్ జిల్లాలోని ఖామ్తారాయ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోగల భాన్‌పురిలో అమ్రేశ్వర్‌రావు, సంధ్యారాణి అనే ఇద్దరు దంపతులు నివసిస్తున్నారు. శుక్రవారం రాత్రి ఓ చిన్న విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఇద్దరిలో ఎవరూ వెనక్కి తగ్గకపోవడంతో గొడవ పెరిగి పెద్దదైంది. మాటామాటా పెరిగి పోట్లాటకు దారితీసింది. ఆగ్రహం పట్టలేకపోయిన అమ్రేశ్వర్ రావు ఇంట్లో కూరగాయలు కోసే కత్తితో భార్య సంధ్యారాణిపై దాడిచేశాడు. ఆమె తీవ్ర గాయాలతో బయటకు వచ్చి పడిపోయింది. ఆమెను వెంబడిస్తూ బయటకు వచ్చిన అమ్రేశ్వర్‌రావు ఇరగుపొరుగు పోగవడం చూసి మళ్లీ లోపలికి వెళ్లాడు. ఓ క్యాన్‌లో పెట్రోల్ తీసుకొచ్చి ఇంట్లో చల్లాడు. ఆ తర్వాత అదే ఆవేశంలో నిప్పటించాడు. ఇంతలో స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. పోలీసులను చూడగానే అమ్రేశ్వర్‌రావు తగులబడుతున్న ఇంట్లోకి పరుగుతీశాడు. అతడు వెళ్లగానే ఇంట్లోని గ్యాస్ సిలిండర్ పేలిపోయింది. ఈ ఘటనలో అమ్రేశ్వర్‌రావు అక్కడికక్కడే మరణించాడు. అమ్రేశ్వర్‌రావును రక్షించేందుకు ప్రయత్నించి ఇద్దరు కానిస్టేబుళ్లతోపాటు, స్థానికులు ఇద్దరు గాయపడ్డారని రాయ్‌పూర్ అదనపు ఎస్పీ లఖన్ పటేల్ తెలిపారు. భర్త దాడిలో గాయపడిన సంధ్యారాణితోపాటు, సిలిండర్ పేలుడులో గాయపడ్డ నలుగురిని చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలిపారు. అమ్రేశ్వర్‌రావు మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపించామన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.

అతగాడి 'కరవు' పగోడికి కూడా వద్దు

న్యూఢిల్లీ–నవభూమి: అనుకుంటాం కానీ పెళ్లి కాని ప్రసాదుల కష్టం పగోడికి కూడా రాకూడదు. వారి వేదన ఎంత చెప్పినా తక్కువే. అయితే.. ఇప్పటివరకు ఎంతో మంది పెళ్లి ప్రసాదుల గురించి తెలిసి ఉండొచ్చు కానీ.. ఇతగాడి గురించి తెలిసినా.. ఈ చిట్టి వీడియోను చూసిన తర్వాత అంత తేలిగ్గా మర్చిపోలేరు. అంతటి ప్రభావం ఈ వీడియో సొంతం. ఇదంతా ఒక ఎత్తు అయితే.. ఈ వీడియోప్రారంభం నుంచి మధ్య వరకు కూడా ఆ వ్యక్తి చుట్టూ ఉన్న వారి హావభావాలకు.. చివర్లో అతగాడి వేదన.. ఆవేదనకు వారంతా రియాక్టు అయ్యే తీరు చూసినప్పుడు మీ పెదాల మీద అప్రయత్నంగా చిరునవ్వు వచ్చేస్తుంది. ఇంతకూ ఈ 'కరవు' వీడియోను సమ్ థింగ్ స్పెషల్‌గా చెప్పక తప్పదు. భారత్ పాక్ వెళ్లదు..టి20 కప్ భారత్ కు పాక్ రాదు పెళ్లి కోసం ఈ పెళ్లి కాని ప్రసాద్ చేసిన ప్రయత్నం వెరైటీగా నిలవటమే కాదు.. ఆన్ లైన్ లో వైరల్ గా మారింది. ఎంతలా ప్రయత్నించినా పెళ్లి కాకపోవటంతో.. చివరకు తన పెళ్లి కోసం సదరు వ్యక్తి చేసిన ప్రయత్నం అందరిని ఆకర్షిస్తోంది. యూఎస్ కు చెందిన వ్యక్తి తన భాగస్వామి కోసం చేసిన వెరైటీ ప్రయత్నాన్ని ప్రముఖ వ్యాపారవేత్త హర్ష గోయెంకా ఎక్స్ లో పోస్టు చేశారు. అయితే.. ఈ వీడియోను ఎప్పుడు.. ఎక్కడ షూట్ చేశారు? అన్న దానిపై క్లారిటీ లేదు. అయితే.. యూఎస్ లో ఇప్పుడు ఇలాంటి పరిస్థితి ఉందని పేర్కొన్నారు. కదులుతున్న రైల్లో చిత్రీకరించిన ఈ వీడియోలో ఏముందన్నది చూస్తే.. "మీకు అంతరాయం కలిగిస్తున్నందుకు సారీ. నేను డ్రగ్స్ వాడను. నాకు పిల్లలు లేరు. నేను మిమ్మల్ని డబ్బులు అడగటం లేదు. నేను పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను. అమెరికాను ప్రేమిస్తాను. ప్లీజ్.. నన్ను పెళ్లి చేసుకోండి. దీంతో నేను అమెరికాలో ఉంటాను. నాకు బాగా వంట చేయటంవచ్చు. చక్కగా మసాజ్ చేస్తా. డిస్కో.. మ్యూజిక్ వింటాను. నాకు మీ డబ్బు అవసరం లేదు. నా డబ్బులే మీకు ఇస్తాను. దాంతో మంచి బట్టలు.. షూస్ కొనుక్కోవచ్చు" అంటూ సాగే అతగాడి మాటలకు మొదట్లో విసుగ్గా.. ఇబ్బందిగా ఫీలైన వారంతా అతను మాటలు సాగే కొద్దీ.. చుట్టూ ఉన్న అందరి ముఖాల్లోనూ నవ్వు రావటం కనిపిస్తుంది. అని అడిగినప్పుడు ఎవరూ స్పందించకపోవటంతో.. చివరకు అతను.. తనకు ఆడా.. మగ అన్న భేదం ఏమీ లేదని.. ఎవరినైనా పెళ్లి చేసుకోవటానికి తనకు అభ్యంతరం లేదని చెప్పటంతో.. ఈ పెళ్లి కాని ప్రసాద్ కరవు అందరి ముఖాల్లో నవ్వులు పూయించింది. ఈ వీడియోవైరల్ గా మారటమే.. అతడిపై పాజిటివ్ కామెంట్లు పోస్టు చేస్తున్నారు. ఇంతకూ ఈ పెళ్లి కాని ప్రసాద్ కరవు వీడియోలో వ్యక్తి ఇప్పుడేం చేస్తున్నాడన్న కూతుహలం కలగటం ఖాయం.

ఏఐ విజిల్ బ్లోయర్ సూసైడ్.. డౌట్లు పెంచిన మస్క్ ట్వీట్

ముంబై – నవభూమి: టెక్నాలజీ అంటే ఎలాన్ మస్క్.. మస్క్ అంటే టెక్నాలజీ.. అలాంటి మస్క్ ఓ అంశంపై ట్వీట్ చేశారంటే.. అది సంచలనమే.. అన్నట్లు ట్విటర్ ను మస్క్ కొనుక్కుని దాని పేరున 'ఎక్స్'గా మార్చిన సంగతి తెలిసిందే. దీంతో ట్విటర్ కు మరింత ప్రాపగాండా వచ్చింది. ఇప్పుడు మస్క్ ఓ అంశమై ట్వీట్ పెట్టారు. అది కూడా భారత సంతతికి చెందిన యువకుడి ఆత్మహత్య గురించి కావడం గమనార్హం. అదిప్పుడు పెద్ద సంచలనంగా మారింది. చాట్ జీపీటీ మదర్ కంపెనీ ఓపెన్ ఏఐ అనే సంగతి తెలిసిందే. ఈ ఓపెన్ ఏఐ విజిల్ బ్లోయర్ (ప్రజా వేగు) సుచిర్ బాలాజీ. వయసు కేవలం 26 ఏళ్లే. అయితే, భారత సంతతికి చెందిన ఇతడు శాన్ ఫ్రాన్సిస్కోలో అనుమానాస్పద స్థితిలో చనిపోయాడు. అది కూడా తన సొంత ఇంట్లో. వాస్తవానికి గత నెల 26నే సుచిర్ మరణించాడు. కానీ, చాలా ఆలస్యంగా విషయం వెలుగులోకి వచ్చింది. అతడు ఆత్మహత్య చేసుకున్నట్లుగా పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనలో ఎలాంటి అనుమానాస్పద ఆధారాలు లభ్యం కాలేదని కూడా తెలిపారు. ఓపెన్ ఏఐ ఆపరేషన్లు, అనుసరిస్తున్న విధానాలు ఆందోళనకరం అంటూ గతంలో బాలాజీ పరిశోధనలో వెల్లడించాడు. ఆ సంస్థ కాపీ రైట్ల ఉల్లంఘనలకు పాల్పడుతోందని కూడా ఆరోపించారు. సరిగ్గా ఆ తర్వాత మూడు నెలలకు బాలాజీ మృతి చెందినట్లు స్పష్టం అవుతోంది. దీంతో తీవ్ర చర్చనీయమైంది. బాలాజీ ఓపెన్ ఏఐ మాజీ ఉద్యోగి కావడం గమనార్హం. అతడు 2020 నవంబరు నుంచి 2024 ఆగస్టు వరకు అందులో విధులు నిర్వర్తించాడు. ప్రజలకు మేలు కంటే కీడు ఎక్కువగా చేసే సాంకేతికతల కోసం ఇక తాను ఏమాత్రం పని చేయదల్చుకోలేదని అన్నాడు. అందుకే ఓపెన్ ఏఐను వీడినట్లు చెప్పాడు. ఇప్పుడు మస్క్ ట్వీట్ తో సంచలనం సుచిర్ మరణమే సంచలనం అనుకుంటే.. దీనిపై అపర కుబేరుడు, ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ చేసిన ట్వీట్ మరింత సంచలనం రేపుతంది. అది కూడా కేవలం 'హిమ్' అంటూ మస్క్ స్పందించడం గమనార్హం.

రైతులపై టియర్ గ్యాస్ ప్రయోగం.. 17 మందికి గాయాలు.. పాదయాత్ర నిలిపివేత

న్యూఢిల్లీ–నవభూమి: శంభు సరిహద్దు వద్ద మరోసారి ఉద్రిక్తత చోటు చేసుకుంది. తమ డిమాండ్ల పరిష్కారానికై రైతులు చేపట్టిన 'ఢిల్లీ చలో' మార్చ్‌ను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఆందోళనకర పరిస్థితులు తలెత్తాయి. రైతులపై హర్యాణా పోలీసులు టియర్ గ్యాస్ జల ఫిరంగులను ప్రయోగించారు. ఈ ఘటనలో సుమారు 17 మంది రైతులకు గాయాలయ్యాయి. దీంతో రైతు సంఘాల నేతలు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఢిల్లీకి తమ పాదయాత్రను నిలిపివేశారు. అంతర్గత సమావేశం అనంతరం తమ తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని రైతు నాయకుడు తేజ్వీర్ సింగ్ తెలిపారు.

తమ డిమాండ్ల పరిష్కారానికై రైతులు మరోసారి ఉద్యమబాట పట్టారు. ఇవాళ మధ్యాహ్నం 'చలో ఢిల్లీ' మార్చ్‌ను ప్రారంభించారు. కనీస మద్దతు ధర సహా 11 డిమాండ్ల సాధన కోసం 101 మంది రైతులు ఈ మార్చ్‌లో పాల్గొన్నారు. అయితే, రైతులను శంభు సరిహద్దు వద్ద హర్యాణా పోలీసులు అడ్డుకున్నారు. రైతులపై బాష్పవాయువు జల ఫిరంగులనుప్రయోగించారు. దీంతో సరిహద్దు వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇక రైతుల ఢిల్లీ చలో మార్చ్‌ను అడ్డుకోవడం ఇది మూడోసారి. డిసెంబర్ 6 నుంచి ఢిల్లీ వైపుకు వెళ్లేందుకు రైతులు ప్రయత్నించగా.. ఇప్పటికే ఆ ప్రయత్నాలను రెండుసార్లు పోలీసులు అడ్డుకున్న విషయం తెలిసిందే. దీంతో పోలీసుల తీరుపై రైతులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక రైతుల ఢిల్లీ మార్చ్ నేపథ్యంలో హర్యాణా ప్రభుత్వం అప్రమత్తమైంది. ముందు జాగ్రత్త చర్యగా మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేసింది. శనివారం ఉదయం 6 గంటల నుంచి 17వ తేదీ అర్ధరాత్రి వరకూ సేవలు నిలిపివేస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది.

రైతుల డిమాండ్లివి

తాము పండించిన పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కావాలని రైతులు ప్రధానంగా కోరుతున్నారు. రుణ మాఫీ చేయాలని, రైతులు, రైతు కూలీలకు పెన్షన్ ఇవ్వాలని, విద్యుత్ చార్జీలు పెంచరాదని, రైతులపై పెట్టిన పోలీస్ కేసులు ఎత్తివేయాలని, 2021 లఖింపూర్ ఖీరి బాధితులకు న్యాయం చేయాలని, భూ సేకరణ చట్టం 2013ను పునరుద్ధరించాలని, ఆందోళనలో మరణించిన రైతుల కుటుంబాలకు నష్టపరిహారం అందజేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 | హైదరాబాద్ ఆదివారం 15 । డిసెంబర్ । 2024

ఎట్టకేలకు పోలీసులకు చిక్కిన ఘరానా దొంగ..

ఢిల్లీ-నవభూమి: ఎట్టకేలకు పోలీసులకు చిక్కిన ఘరానా దొంగ.. ఏకంగా 13 దొంగతనం కేసులలో నిందితుడిగా ఉండి, దాదాపు ఆరు నెలలుగా తప్పించుకుని తిరుగుతున్న ఘరానా దొంగ అనూజ్ అలియాస్ అంటూ ను ఎట్టకేలకు ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అనూజ్‌పై దేశ రాజధాని ఢిల్లీలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లలో 13 దొంగతనం ఉన్నాయి. దాంతో ఆ ఘరానా దొంగను పట్టుకునేందుకు ఢిల్లీకి చెందిన ఐఎస్‌సీ/క్రైమ్ బ్రాంచ్ పోలీసులు ఆరు నెలలుగా గాలిస్తున్నారు. మొత్తం మూడు రాష్ట్రాల్లో గాలించారు. చివరికి గుజరాత్‌లో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి అరెస్టుకు సంబంధించిన దృశ్యాలను కింది వీడియోలో చూడవచ్చు.

భూమాఫియాకు వరంగా 'అసైన్మెంట్' చట్టసవరణ!

వ్యవసాయానికి పనికివచ్చే ప్రభుత్వ బంజరు భూములను గ్రామీణ పేదలకు ఇచ్చే పట్టాలను 'అసైన్మెంట్ పట్టా' అంటారు. దీనికి రెవెన్యూ శాఖ వారి తెలుగు పేరు 'అతుకుబడి పట్ట'. తెలంగాణలో 'లావని పట్టా', రాయలసీమలో 'డీఎమ్‌కె పట్టా', కోస్తా ఆంధ్రలో 'డీ ఫారం పట్టా' అని పేర్లు.జిరాయితీ పట్టా లేక ప్రైవేటు పట్టాకూ, డీ%-%ఫారం పట్టాకూ తేడా ఏమిటి? దస్తావేజు లేఖకుల పరిభాషలో చెప్పాలంటే జిరాయితీ పట్టాదారుకు 'దాన, విక్రయాది సమస్త హక్కులు' ఉంటాయి. అతుకుబడి పట్టాదారుకు అనుభవ హక్కు తప్ప మరే హక్కులు ఉండవు. అతుకుబడి పట్టా అనేది షరతులతో ఇచ్చే పట్టా. అవి ఆ పట్టాలోనే ఉంటాయి. అందులో ఈ మూడు ముఖ్యమైనవి: 1) పట్టాదారు వంశపారంపర్యంగా అనుభవించాలి, అన్యాక్రాంతం చేయరాదు. 2) ప్రభుత్వానికి అవసరమైనప్పుడు నష్టపరిహారం చెల్లించకుండానే భూమిని స్వాధీనం చేసుకోవచ్చు 3) తప్పుడు సమాచారం, నిబంధనలకు విరుద్ధంగా ఇవ్వబడిందని రుజువైతే పట్టా రద్దు చేయవచ్చును.

ప్రభుత్వ బంజరు భూమిని ఎవరికి ఇవ్వాలి, ఎలా మంజూరు చేయాలి అన్నదానికి సంబంధించిన పద్ధతులు బ్రిటిష్ హయాంలో రూపొందిన బోర్డు స్టాండింగ్ ఆర్డర్స్‌లో వున్నాయి. ఇవి కార్యనిర్వాహక ఆదేశాలు. ప్రభుత్వ భూములను సాగుకు ఇవ్వడం ద్వారా భూమి శిస్తు పెంచుకోవడం బ్రిటిష్ పాలకుల ప్రధాన లక్ష్యం. అదే సమయంలో సామాజిక న్యాయ కోణాన్ని కూడా వారు పాటించారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వ భూమిని వ్యవసాయ కూలీలు, ముఖ్యంగా దళిత వర్గాలకు మంజూరు చేయడానికి స్టాండింగ్ ఆర్డర్స్‌లో తగిన ఏర్పాటు చేశారు. తమ నేతృత్వంలో సర్వే సెటిల్మెంట్స్ జరిగిన (రైత్వారీ/ ప్రభుత్వ) గ్రామాలలో కొన్ని భూములను దళిత వర్గాలకు 'రిజర్వు' చేశారు కూడా. షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ) అని ఇప్పుడు పిలుస్తున్న వారిని అప్పుడు డిప్రెసెడ్ క్లాసెస్ (డీసీ) అన్నారు. సెటిల్మెంట్ రికార్డులలో భూములను 'డీసీ రిజర్వుడ్' అంటూ కేటాయించారు. ఆ భూములను వారికి మాత్రమే మంజూరు చేయాలని దాని అర్థం. వాటికి 'పంచమి భూములు' అని కూడా పేరు.(ఉమ్మడి) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పేదలకు భూముల పంపిణీ జరిగిందంటే, అది భూసంస్కరణల ద్వారా భూస్వాముల నుంచి మిగులు భూములు స్వాధీనం చేసుకుని చేసినది కాదు, తమ స్వాధీనంలో ఉన్న ప్రభుత్వ భూముల పంపిణీ ద్వారానే జరిగింది. కోనేరు రంగారావు కమిటీ, 1960 నుంచి లెక్కగట్టి ఉమ్మడి రాష్ట్రంలో 64 లక్షల ఎకరాల ప్రభుత్వ భూమి పంపిణీ జరిగినట్లుగా గుర్తించింది.

అతుకుబడి పట్టాలో అన్యాక్రాంతం చేయరాదన్న షరతు వున్నప్పటికీ పేదల నుంచి భూములు పెద్దవారి చేతికి వెళ్తూన్నాయని ప్రభుత్వ పెద్దలు గుర్తించి, దానిని అరికట్టడానికి 1977లో అసైన్మెంట్ భూముల బదలాయింపు నిషేధ చట్టాన్ని తెచ్చారు. ఈ చట్టంలో 'అన్యాక్రాంతం' అనే మాటను నిర్వచించారు. కొనుగోలు, తనఖా, కౌలు, కానుక, మార్పిడి, మరే రూపంలో జరిగిన అది అన్యాక్రాంతమే, అది చెల్లదన్నారు. చట్టానికి విరుద్ధంగా అన్యాక్రాంతం పొందిన వ్యక్తికి రెండు వేల రూపాయల జరిమానా, ఆరు నెలలు జైలు అని కూడా అన్నారు.ప్రభుత్వ బంజరు భూములతో పాటు, వ్యవసాయ కమతాల గరిష్ఠ పరిమిత చట్టం కింద స్వాధీనం చేసుకుని పంచిన భూములు కూడా అతుకుబడి పట్టా భూములే. కోనేరు నివేదిక ప్రకారం అవి 5 లక్షల 82 వేల ఎకరాలు. ప్రభుత్వ భూమి, సీలింగ్ మిగులు భూములు రెండు కలిపితే (ఉమ్మడి రాష్ట్రం లెక్క ప్రకారం) సుమారుగా 70 లక్షల ఎకరాలు అతుకుబడి పట్టా రూపంలో పేదల చేతిలో ఉంది, ఉండాలి. అన్యాక్రాంతం చేయరాదని పట్టాలో ఉన్నా, 1977లో చట్టం వచ్చినా అది ఎన్నడూ ఆగలేదు. అతుకుబడి పట్టా భూములలో 'గణనీయమైన భాగం అన్యాక్రాంతం' అయ్యిందని కోనేరు కమిటీ అన్నది. చట్టం వచ్చిన ఈ 47 ఏళ్లలో ఎందరికి ఆరునెలల జైలు శిక్ష పడింది?

1977 నుండి 2008 వరకు 30 సంవత్సరాలలో ఈ చట్టంలో ఎలాంటి మార్పులు లేవు (అమలు కూడా లేదు!). 2008 నుంచి 2023 మధ్యలో ఐదుసార్లు సవరించారు. 2008లో రాజశేఖర్‌రెడ్డి మొదటి సవరణలు తెస్తే, 2023లో సవరణ తెచ్చింది వారి సుపుత్రుడు జగన్మోహన్‌రెడ్డి. ఈ మార్పులన్నీ చట్టాన్ని పటిష్టం చేసి పేదల భూములు కాపాడటం కోసం జరిగినవి కాదు. 1977లోని ఆరు నెలల జైలు, రెండు వేలు జరిమానాలను ఏ సవరణ చట్టమూ పెంచలేదు. 2023 తాజ సవరణ గురించి ఇప్పుడు చూద్దాం.జగన్మోహన్‌రెడ్డికి ఎవరైన సలహా ఇచ్చారో లేక ఆయన పుర్రెకే పుట్టిందో, అతుకుబడి పట్టా భూములను అమ్ముకోవడానికి, పెద్దవారు ఎలాంటి ఆటంకమూ భయ సంకోచాల్లేకుండా భూములను కొట్టేయడానికి ఒక స్కీం తెచ్చారు. దాన్ని 'ఫ్రీ హోల్డ్ రైట్స్' అన్నారు (ఇలాంటి పేర్లు ఎలా తడతాయో!). మరి ఏమి కొంపలు మునిగిపోతున్నాయనో, ఈ 2023 సవరణను ముందు ఆర్డినెన్స్‌గా తెచ్చారు. అతుకుబడి పట్టా భూములను లాగేయడానికి ఇక ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకూడదని ఏలిన వారి ఉద్దేశం కావచ్చు. ఆర్డినెన్స్ గెజిట్‌లో ప్రకటితమైన తేదీ 31%-07-%2023 నుండి ఇరవై సంవత్సరాల వెనక్కి, అనగా తేదీ 31%-07-%2003కి ముందు ఇచ్చిన డీ ఫారం పట్టా భూములను కొనుగోలు చేసుకోవచ్చు.1977 చట్టం ప్రత్యేకత ఏమిటంటే, చట్టం వెనుక కాలానికి కూడా వర్తిస్తుంది. అతుకుబడి పట్టా భూముల అన్యాక్రాంతాన్ని చట్టం నిషేధించడంతో బాటు నేరంగా కూడా ప్రకటించిందని ముందు చెప్పుకున్నాం. అయితే 1977కు ముందు అమ్మకం జరిగి, కొన్నవారు కూడా పేదవారై ఉండి, మోసం, దగా చేయకుండా, సదుద్దేశంతో సరైన నగదు చెల్లించి కొనుగోలు చేసి ఉంటే దానికి మాత్రం చట్టం నుంచి మినహాయింపు ఉంది. అది కూడా విచారణలో ఆ సంగతులు నిరూపణ అయిన తరువాత. 1977కు ముందు భూమిని కొన్న ఆ పేదవాడు అతుకుబడి పట్టాదారవుతాడా లేక సమస్త హక్కులుగల జిరాయితీ పట్టాదారవుతాడా? అతను కూడా డీ ఫారం పట్టాదారే అవుతాడు. డీ ఫారం పట్టాలోని షరతులన్నీ తుచ తప్పకుండా అతడికి వర్తిస్తాయి.డీ ఫారం పట్టా భూములకు పూర్తి హక్కులు ఇవ్వాలంటే, ఇరవై సంవత్సరాల కిందట ఇచ్చిన అతుకుబడి పట్టాలను ముందుగా గుర్తించాలి. మండల రెవిన్యూ కార్యాలయాలలో రికార్డుల స్థితిగతులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. కొందరు కలెక్టర్లు ఇదే విషయాన్ని ప్రభుత్వం వారికి చెప్పుకున్నారు కూడా. అసైన్మెంట్ తేదీ నిర్ధారణకు కీలకమైన డీ.ఆర్. ఫైల్స్ కనబడటం లేదని వారు వాపోయారు. నిజానికి చట్ట సవరణ లక్షలాది గ్రామీణ పేద కుటుంబాలతో ముడిపడి ఉన్న విషయం. గత ప్రభుత్వంలో పెద్దలు వారిలోవారు మాట్లాడుకుని సవరణ చట్టం తెచ్చేశారు.

ఈ జగమంతా 'చిప్స్' మయం:

ప్రపంచమంతా ఇప్పుడు కృత్రిమమేధతో కొత్త పుంతలు తొక్కుతుంది. ఇది అనేక ఎలక్ట్రానిక్ పరికరాల సమూహంతో పనిచేస్తుంది. ఫోన్‌లు, కంప్యూటర్‌లు, కార్లు వంటి పరికరాలను పని చేయడానికి సెమీకండక్టర్లతో నడుస్తున్న ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్లు (ఐసి) లేదా మైక్రోచిప్స్ అవసరం. ఈ చిన్న భాగాలు మన రోజువారీ జీవితాలను సుఖమయం చేస్తున్నాయి. ఒక్క స్మార్ట్‌ఫోన్‌లో వందకు పైగా సెమీకండక్టర్ చిప్‌లు ఉంటాయి. స్మార్ట్‌ఫోన్‌లలో సెల్యులార్ నెట్వర్క్కు కనెక్ట్ చేయడానికి, టచ్స్క్రీన్, డేటాను నిల్వ కోసం, కంప్యూటర్లలో సమాచారాన్ని ప్రాసెస్ చేయడానికి బీ రిఫ్రిజిరేటర్లు, డిష్వాషర్లు, వాషింగ్ మెషీన్లు, మైక్రోవేవ్లు వంటి ఉపకరణాలలో విద్యుత్ ప్రవాహాన్ని నియంత్రించడానికి, మరింత సమర్థవంతంగా పనిచేయడానికి సెమీకండక్టర్ల చిప్స్ అవసరం. ఇంకా కృత్రిమమేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ - ఎఐ)లో కంప్యూటింగ్ శక్తికి డిమాండ్ పెరుగుతున్న కొద్దీ ఏఐ మోడల్స్కు శిక్షణ ఇవ్వడానికి, ఏఐ, జిపియులకు ప్రత్యేక రకం చిప్ అవసరం. కృత్రిమ మేధ అనువర్తనాలు, క్లౌడ్ కంప్యూటింగ్, మెషిన్ లెర్నింగ్లో ఉపయోగించే చిప్లకు డిమాండు ఉంది. వాహన తయారీదారులకు అధిక కంప్యూటింగ్ శక్తితో చిప్లు ఎక్కువగా అవసరం. ముఖ్యంగా పరిశ్రమ ఎలక్ట్రిక్ నుండి స్వయంప్రతిపత్తి వాహనాలకు మారుతున్నప్పుడు స్మార్ట్ఫోన్లలో ఉపయోగించే వాటి కంటే భిన్నమైన చిప్స్ అవసరం అవుతాయి. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, 5జీ, 6జీలు భవిష్యత్తులో చిప్ డిమాండ్ను పెంచుతాయి.

చిప్స్ కొరత:

కోవిడ్ -19 మహమ్మారితో వర్క్ ఫ్రం హోం, ఆన్‌లైన్ లెర్నింగ్ వలన ఎలక్ట్రానిక్స్ పరికరాలకు డిమాండ్‌ను వేగవంతం చేసింది. సరఫరా గొలుసులను విపరీతంగా పెంచింది. ప్రపంచవ్యాప్తంగా పరిశ్రమలకు అంతరాయం కలిగించే చిప్ కొరత ఏర్పడింది.

ప్రపంచ సెమీకండక్టర్ మార్కెట్ 2019తో పోలిస్తే 2020లో 6.8 శాతం పెరిగింది. ఫార్చ్యూన్ బిజినెస్ ఇన్సైట్స్ ప్రకారం ఇది 2022 లో 573.44 బిలియన్ డాలర్ల నుండి 2029 నాటికి 1,380.79 బిలియన్ డాలర్లకు 12.2% సమ్మిళిత వార్షిక వృద్ధి రేటుతో పెరుగుతుందని అంచనా వేసింది. ప్రపంచంలో



ఇప్పుడు రష్యా, ఉక్రెయిన్ మధ్య , ఇజ్రాయిల్, పాలస్తీనాల మధ్య జరుగుతున్న యుద్ధాలు, అనేక దేశాలలో సంభవిస్తున్న సంక్షోభాలు ప్రపంచ చిప్ సరఫరా గొలుసును ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. ఇక యుయస్ లో కొత్త ప్రభుత్వం కొలువుతీరాక చైనా చిప్స్ అమ్మకాలపై నియంత్రణలను ప్రేరేపించవచ్చు. ఈ విషయాన్ని యుఎస్ సెమీకండక్టర్ ఇండస్ట్రీ నివేదికలో ప్రపంచంలోనే అతిపెద్ద సెమీకండక్టర్ మార్కెట్ సెమీకండక్టర్ ఇండస్ట్రీ అసోసియేషన్ (ఎస్ఐఏ) తెలిపింది. ఈ కారణంగా మరో చిప్ కొరత ఏర్పడుతుందని కొన్ని అంచనాలు ఉన్నాయి. డిమాండ్, సరఫరా మధ్య అంతరాన్ని చిప్ తయారీదారులు కూడా అంత త్వరగా పూడ్చలేరు. ఇంక ఇక్కడ మరో సమస్య ఉంది. కొత్త సెమీకండక్టర్ ఫ్యాబ్‌లను తెరవడానికి ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ నైపుణ్యం కలిగిన ఇంజనీర్ల కొరత మరో పక్క ఉంది. ఎస్ఐఏ నుండి వచ్చిన కొత్త డేటా ప్రకారం 2030 నాటికి ఈ పరిశ్రమలు 1,15,000 కంటే ఎక్కువ ఉద్యోగాల కల్పనకు కారణమవుతాయని అంచనావేయబడింది.

మన దేశంలో పరిస్థితి:

దేశంలో జనాభా, ప్రజల ఆదాయం, సాంకేతిక పరిజ్ఞానాల పెరుగుదల కారణంగా కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ అతిపెద్ద వాటాను కలిగి ఉంది. స్మార్ట్ ఫోన్లు, టేబ్లు, ల్యాప్టాప్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు డిమాండ్ పెరగడంతో సెమీకండక్టర్ వినియోగం పెరుగుతోంది. నిరంతరం విస్తరిస్తున్న డిజిటల్ మౌలిక సదుపాయాలు, అధునాతన గాడ్జెట్ల పట్ల పెరుగుతున్న అభిరుచి, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ను ప్రాథమిక చోదక శక్తిగా నిలబెట్టాయి. ఇది దేశంలో సెమీకండక్టర్ మార్కెట్ పెరుగుదల గతిని ప్రభావితం చేసే కీలక రంగంగా మారింది. ప్రస్తుతం భారత్ ప్రధానంగా తైవాన్, చైనా, కొరియా, వియత్నాం దేశాల నుంచి సెమీకండక్టర్ దిగుమతులపై ఎక్కువగా ఆధారపడుతోంది. దేశంలో సెమీకండక్టర్ మార్కెట్ విలువ 2023 లో 3430 కోట్ల డాలర్లు. 2023 నుండి 2032 కాలంలో కాలంలో 20.1% సమ్మిళిత వార్షిక వృద్ధి రేటు (సిఎజిఆర్)తో 10,020 కోట్ల డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. ఇటీవలి సంవత్సరాలలో మనదేశం సెమీకండక్టర్ పరిశ్రమలో గణనీయమైన పురోగతిని సాధించింది. సెమీకండక్టర్ డిజైన్ ఇంజనీర్ల అత్యంత నైపుణ్యం కలిగియున్న ప్రముఖ దేశాలలో ఒకటిగా మారింది. ప్రపంచంలోని సెమీకండక్టర్ డిజైన్ ఉద్యోగులలో 20 శాతం మనవారే ఉన్నారు. లక్ష మందికి పైగా విఎల్ఎస్ఐ డిజైన్ ఇంజనీర్లు ప్రపంచ సెమీకండక్టర్ కంపెనీలు, దేశీయ డిజైన్ సేవా సంస్థలలో పనిచేస్తున్నారు.

సవాళ్లు:

అధునాతన ఫ్యాబ్రికేషన్ ఫెసిలిటీస్ (ఫ్యాబ్స్) స్థాపన నిర్వహణకు సంబంధించిన అధిక ముందస్తు ఖర్చుల మూలధన వ్యయం కారణంగా సెమీకండక్టర్ పరిశ్రమ గణనీయమైన నియంత్రణను ఎదుర్కొంటుంది. భారీ ప్రారంభ పెట్టుబడుల అవసరం చిన్న సంస్థలకు బలమైన అవరోధాన్ని సృష్టిస్తుంది. అదనంగా ఎగుమతి నియంత్రణలు, వాణిజ్య సుంకాలు, పర్యావరణ నిబంధనలు వంటి నిబంధనలలో మార్పులు సెమీకండక్టర్ మార్కెట్ను ప్రభావితం చేస్తాయి. కఠినమైన నియంత్రణ అవసరాలు భారత సెమీకండక్టర్ మార్కెట్కు అవరోధంగా ఉన్నాయి. ఎందుకంటే అవి కొత్త ఉత్పత్తులు సాంకేతికతల అభివృద్ధి ప్రవేశాన్ని నిరోధిస్తున్నాయి. కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు, ఇతర పర్యావరణ ప్రమాణాలకు సంబంధించిన కఠినమైన నిబంధనలు, మేధో సంపత్తి, పేటెంట్లపై న్యాయ పోరాటాలు మార్కెట్ పురోగతిని ప్రభావితం చేస్తాయి. వివాదాలు సంబంధిత కంపెనీలకు చట్టపరమైన ఆర్థిక ఇబ్బందులకు గురిచేయవచ్చు.

పరిష్కారాలు:

పోటీతత్వంతో ఉండటానికి ఉత్పత్తి క్షీణతను నివారించడానికి కంపెనీలు పరిశోధన అభివృద్ధిలో నిరంతరం పెట్టుబడి పెట్టాలి. ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, శక్తి వినియోగానికి సంబంధించిన సమస్యలతో సహా కంపెనీలు తమ ఉత్పత్తులను ఈ అవసరాలకు అనుగుణంగా మార్చాల్సి ఉంటుంది. సెమీకండక్టర్ తయారీ, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి స్పష్టమైన సహాయక నిబంధనలు, విధానాలు అవసరం. అనుమతుల ప్రక్రియలను క్రమబద్ధీకరించడం, ప్రోత్సాహకాలను అందించడం పరిశ్రమ వృద్ధికి దోహదపడుతుంది.

చేపడుతున్న కార్యక్రమాలు:

ఎలక్ట్రానిక్స్ తయారీ, రూపకల్పనకు గ్లోబల్ హబ్ గా భారతదేశం ఆవిర్భవించడానికి వీలుగా శక్తివంతమైన సెమీకండక్టర్, డిస్ ప్లే పర్యావరణ వ్యవస్థను నిర్మించడం దీని లక్ష్యంగా 2021లో రూ.76,000 కోట్ల ఆర్థిక వ్యయంతో డిజిటల్ ఇండియా కార్పొరేషన్ లోని ఒక ప్రత్యేకమైన స్వతంత్ర వ్యాపార విభాగాన్ని ఇండియా సెమీకండక్టర్ మిషన్ ప్రారంభమయ్యింది. దేశంలో సెమీకండక్టర్ పరిశోధన అభివృద్ధికి మద్దతు ఇవ్వాలనే ప్రభుత్వ ఉద్దేశాన్ని ప్రదర్శిస్తుంది. 2014 లో ప్రారంభించిన 'మేక్ ఇన్ ఇండియా' చొరవ దేశంలో తయారీని ప్రోత్సహించడం, దేశాన్ని ప్రపంచ తయారీ హబ్ గా స్థాపించడం లక్ష్యంగా పెట్టుకుంది. సెమీకండక్టర్ ఉత్పత్తిని ప్రోత్సహించడానికి ఎలక్ట్రానిక్స్ రంగానికి ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ (పిఎల్ఐ) పథకంతో సహా అనేక కార్యక్రమాలు ప్రారంభించారు. మెమరీ చిప్‌లలో గ్లోబల్ లీడర్ అయిన "మైక్రోన్ టెక్నాలజీ" సంస్థ భారీ నిర్దిష్ట ప్రణాళికతో గుజరాత్లో కొత్త సెమీకండక్టర్ అసెంబ్లీ యూనిట్ని నెలకొల్పనుంది. ఇది దేశ సెమీకండక్టర్ స్థితిగతులను గణనీయంగా పునర్నిర్మిస్తుందని భావిస్తున్నారు.

జనక మోహన రావు దుంగ
ఫోన్: 8247045230

చట్టమే గెలవాలి...!

సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ రోజునుంచి ప్రార్థనాస్థలాల (ప్రత్యేక నిబంధనలు)చట్టం-1991మీద దాఖలైన పిటిషన్లను విచారించబోతోంది. స్వాతంత్ర్యం సిద్ధించిన 1947 ఆగస్టు 15నాటికి దేశంలోని ఆయా ప్రార్థనాస్థలాల మతస్థితిని యథాతథంగా పరిరక్షిస్తూ, వాటి స్వరూప స్వభావాలను మార్చే అన్ని ప్రయత్నాలను ఈ చట్టం నిషేధిస్తున్నది. అయోధ్యలో రామజన్మభూమి%-బాబ్రీ మసీదు వివాదం నేపథ్యంలో, పీవీ నరసింహారావు ప్రభుత్వం తెచ్చిన ఈ చట్టం ఆ ఒక్క వివాదాన్ని మాత్రం మినహాయిస్తూ మిగతా ప్రార్థనాస్థలాల జోలికి ఎవరూ పోకుండా అడ్డుకొనే ప్రయత్నం చేసింది. ఈ చట్టం రాజ్యాంగవిరుద్ధమనీ, కొట్టివేయాలనీ కోరుతూ దాఖలైన ఆరుపిటిషన్లపై న్యాయస్థానం చేపడుతున్న ఈ విచారణ భవిష్యత్ భారతంలో లౌకికవాదం, శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ముఖ్యమైనది. అయోధ్య వివాదం పరిష్కారంతో ఇక ఈ తరహా ఘర్షణలకు తెరపడుతుందనీ, సయోధ్య వెల్లివిరుస్తుందనీ అంతా అనుకున్నారు. కానీ, కొన్ని సంస్థలు, కొందరు వ్యక్తులు వరుసగా రేపుతున్న మరిన్ని వివాదాలు మతవైషమ్యాలు పెంచుతున్న తరుణంలో, ఈ చట్టం ఉనికిమీద సర్వోన్నత న్యాయస్థానం రాబోయేరోజుల్లో ఏమి చెబుతుందోనని దేశప్రజలు ఎదురుచూస్తున్నారు.

పిటిషన్‌దారులలో సుబ్రహ్మణ్యస్వామి, న్యాయవాది అశ్విన్ ఉపాధ్యాయ పేర్లు ముఖ్యంగా చెప్పుకోవాలి. మధ్యయుగాల్లో కొందరు మతోన్మాదులు చేసిన అకృత్యాలకు ఈ నవయుగంలో జనం తన్నుకుచావకూడదన్న లక్ష్యంతో ఈ చట్టం రూపొందితే, దాని ఉద్దేశాన్ని వీరు తప్పుబడుతున్నారు. ఆనాటి దండయాత్రికుల దురాగతాలను ప్రశ్నించనివ్వకుండా, ఆ దురాక్రమణలను సవాలు చేయనివ్వకుండా ఈ చట్టం అడ్డుపడుతున్నదని వారి ఆరోపణ. యథాతథస్థితి పేరిట న్యాయస్థానాలనుంచి ప్రార్థనాస్థలాల వివాదాలకు పరిష్కారం దక్కనివ్వకుండా చేస్తున్నదనీ, అప్పటి చారిత్రక, సాంస్కృతిక అకృత్యాలకు ఇప్పుడు మరమ్మతులు జరగాల్సిందేనని వారి వాదన. అయోధ్య వివాదం దేశాన్ని ఎంతగా కుదిపేసిందో తెలిసిందే. దానికి న్యాయస్థానం అందించిన పరిష్కారంమీద భిన్నాభిప్రాయాలున్న విషయాన్ని అటుంచితే, అగ్గి అక్కడితో ఆరిపోకుండా దావానలంలాగా వ్యాపిస్తూండటం విచారకరం. పురాతన ఆలయాలను కూల్చి మసీదులు కట్టారనీ, అర్చనకు అనుమతించాలంటూ స్థానిక న్యాయస్థానాల్లో పిటిషన్లు వేస్తూండటం, అవి సరేననడం చూస్తున్నదే. మసీదు అడుగున ఏమున్నదో తేల్చడానికి దిగువకోర్టులు సర్వేలకు అనుమతిస్తుంటే, హైకోర్టులు సమర్థిస్తుంటే, సుప్రీంకోర్టు ఆట నియమాలను స్వల్పంగా మార్చి కానివ్వమనడం జరిగిపోతోంది. వారణాసిలో జ్ఞానవాపి, మథురలో షాహీ ఈద్గా, సంభాల్‌లో షాహీ జామా..ఇలా వివాదాలు సాగిపోతున్నాయి.

సుప్రీంకోర్టు 2019నాటి అయోధ్య తీర్పులో ఈ చట్టాన్ని ఘనంగా ప్రశంసించింది. అలనాటి ఘోరాలు, చారిత్రక అన్యాయాలను సరిదిద్దవలసిందేనంటూ వర్తమానంలో ఆయా మతస్థలాల రూపురేఖలను మార్చేందుకు చేసే ఏ ప్రయత్నాన్నీ అనుమతించకుండా, ఆదిలోనే అడ్డుపడుతూ ఈ చట్టం ఎంతో మంచిపనిచేసింది.. దేశప్రజల శాంతియుత సహజీవనానికి ఇది అత్యావశ్యకం అని గొప్పగా వ్యాఖ్యానించింది. కానీ, అదే న్యాయస్థానం ఈ చట్టాన్ని పరోక్షంగా బలహీనపరిచింది. అడుగున మందిరాలున్నాయన్న వాదనతో మసీదులను దెబ్బతీసే ప్రయత్నాలను నిలువరించలేదు. మూలాలు తెలుసుకుంటామని అంటున్నారు కానీ, స్వరూపాన్ని మారుస్తామనలేదు కదా అంటూ మాజీ చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ రెండేళ్ళక్రితం జ్ఞానవాపి వివాదంలో వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఈ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై కేంద్రప్రభుత్వం తన వైఖరి తెలియచేయకుండా, సర్వోన్నతన్యాయస్థానం తనకుతానుగా చొరవచూపకుండా, మరోపక్క దిగువకోర్టులను నియంత్రించకుండా ఒక జగన్నాటకం ఇంతకాలం సాగింది. అయోధ్యతో సరి, ఇక భవిష్యత్తులో సామాజిక అశాంతి రేగకూడదన్న ఈ చట్టం లక్ష్యం నెరవేరకుండా పోయింది. సంభాల్‌లో ఇటీవల జరిగిన హింస దేశ భవిష్యత్ పరిణామాలకు సంబంధించిన ఓ బలమైన హెచ్చరిక. బాబ్రీ కూల్చివేతకు ఒక ఏడాదిముందుగా, ఎంతో ముందుచూపుతో తయారైన ఈ మూడుదశాబ్దాలనాటి చట్టాన్ని నిలబెట్టుకోవడం దేశానికి శ్రేయస్కరం.

భక్తి

ధర్మాన్ని ఆచరించండి..అన్నీ లభిస్తాయి



వేదవ్యాసుడి జీవిత కథ ఆద్యంతం అద్భుతం. వ్యాసుడు వసిష్ఠుడికి ముని మనమడు. శక్తి మహర్షికి పౌత్రుడు. పరాశరుడి పుత్రుడు. తపోనిధి అయిన పరాశరుడు యమున దాటడానికి పడవ ఎక్కడమేమిటి? దాటించేందుకు తండ్రి స్థానంలో దాశ పుత్రి తాను పడవ నడపడమేమిటి? మహర్షి అకస్మాత్తుగా మత్స్య గంధిని మోహించడమేమిటి? తన తపశ్శక్తి ద్వారా ఆమె అభ్యంతరాలన్నిటినీ తొలగించటమేమిటీ? ఆ యమునా నదీ ద్వీపంలో ఆమెకు అయాచితంగా పుత్రుడిని ప్రసాదిం చటమేమిటి? అప్పటికప్పుడే సకల శాస్త్రవేత్త అయిన పుత్రుడు పుట్టు కురావడమేమిటి? పుడుతూనే తల్లిని విడిచి తపోవనాలకు వెళ్లిపోవట మేమిటి? ఇదంతా లోక కల్యాణం కోసం లోకాతీతుడిని అవతరింపజే సేందుకు లోకేశ్వరుడు ప్రదర్శించిన విచిత్ర విలాసం.ఆ కారణజన్ముడి జన్మకు ప్రయోజనం మాన వాళికి చతుర్విధ పురుషార్థ సాధన రహస్యాలను బహువిధాలుగా బోధించటం. అందుకే ఆయన జగద్గురువులకే గురువుగా నిలిచిపోయాడు. అగమ్యంగా ఉన్న వేదరాశి చిక్కులు విప్పి, చక్కబరచి, అధ్యయనానికి అనువుగా చతుర్వేదాలుగా విభజించి, వైదిక ధర్మప్రవర్తనం చేసిన ఆది గురువు వేదవ్యాసుడు. పంచమవేదమైన భారతేతిహాసం ద్వారా 'ధర్మాన్ని ఆచరించండి. అన్నీ లభిస్తాయి' అని పదేపదే ఎలుగెత్తి ఘోషించిన సకల లోక హితైషి సాత్యవతేయుడు. అర్థ కామ సాధనల విషయాలను విస్త రించి, అనేక నీతి కథల భాండాగారాలైన అష్టాదశ పురాణాల ద్వారా అందరికీ అందుబాటులోకి తెచ్చిన ఆప్తుడు వ్యాసుడు.బాదరాయణ బ్రహ్మ సూత్రాల ద్వారా వేదాంత సారాన్ని సూత్రీకరించి, మనుషులం దరికీ మహత్తర లక్ష్యమైన మోక్ష పురుషార్థానికి బంగారు బాట పరచిన వాడూ పరాశరుడే. ఇంతటి మహోపకారి అయిన ఈ జ్ఞాన చంద్రుడు ఉదయించిన ఆషాఢ పూర్ణిమ శు భతిథిని ఆసేతు శీతాచలమూ గురు పూర్ణిమ పర్వదినంగా జరుపుకోవటం సర్వవిధాలా సముచితమైన సంప్రదాయం. ఆ సందర్భంగా ప్రత్యేకంగా అస్మాదాచార్య పర్యంతమైన గురుపరంపరను సాదరంగా సంస్మరించుకొని, యథాశక్తి కృత జ్ఞతను ప్రకటించుకోవటం మన కనీసపు కర్తవ్యం.

ప్రపంచ సంపన్నుల్లో అంబానీ కుటుంబం

న్యూయార్క్-నవభూమి: ప్రపంచ కుబేర కుటుంబాల సంపద ఏటికేటికీ పెరిగి పోతోంది. అమెరికా రిటైల్ దిగ్గజం 'వాల్‌మార్ట్' వ్యవస్థాపకులు వాల్టన్ కుటుంబం ఈ విషయంలో 43,240 కోట్ల డాలర్ల (సుమారు రూ.36.65 లక్షల కోట్లు) సంపదతో ప్రపంచంలోనే అత్యంత సంపన్న కుటుంబంగా నిలిచింది. ఇది ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడైన టెస్లా అధినేత ఎలాన్ మస్క్ వ్యక్తిగత సంపద (44,700 కోట్ల డాలర్లు) కంటే కొద్దిగా తక్కువ. పశ్చిమాసియాలోని రాజ కుటుంబాల అందరి సంపదలతో పోలిస్తే మాత్రం వాల్టన్ కుటుంబ ఆస్తులే ఎక్కువ. దీనికి సంబంధించి బ్లూమ్‌బర్గ్ వార్తా సంస్థ తాజాగా 'ప్రపంచ సంపన్న కుటుంబాలు, 2024' పేరుతో ఒక జాబితా విడుదల చేసింది. అంబానీలకూ చోటు: ఈ జాబితాలో మన దేశానికి చెందిన రెండు కుటుంబాలకు చోటు దక్కింది. అంబానీ కుటుంబం 9,960 కోట్ల డాలర్ల (సుమారు రూ.8.44 లక్షల కోట్లు) సంపదతో ఎనిమిదో స్థానం సంపాదించింది. ఆ తర్వాత 4,140 కోట్ల డాలర్ల (సుమారు రూ.3.5 లక్షల కోట్లు) సంపదతో షాపూర్జీ పల్లోంజీ గ్రూప్‌నకు చెందిన మిస్త్రీ కుటుంబం 23వ స్థానంలో నిలిచింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
5 | హైదరాబాద్ ఆదివారం 15 డిసెంబర్ 2024

ఆమెకు తారలే అభిమానులు

కఠోర పరిశ్రమ ఎక్కడుంటుందో విజయం అక్కడే ఉంటుంది. సెలబ్రిటీ ఫిట్‌నెస్ ట్రైనర్ యాస్మిన్ కరాచీవాలా జీవితమే ఇందుకు ఉదాహరణ. ఒకప్పుడు బద్ధకంగా రోజులు వెళ్లదీసిన ఆమె... నిబద్ధతతో కష్టపడి లక్ష్యాన్ని చేరుకుంది. నేడు సామాన్యులకే కాదు... వెండితెర వేల్పులకూ స్ఫూర్తిమంత్రమైంది.

ఆమెకు తారలే అభిమానులు

కఠోర పరిశ్రమ ఎక్కడుంటుందో విజయం అక్కడే ఉంటుంది. సెలబ్రిటీ ఫిట్‌నెస్ ట్రైనర్ యాస్మిన్ కరాచీవాలా జీవితమే ఇందుకు ఉదాహరణ. ఒకప్పుడు బద్ధకంగా రోజులు వెళ్లదీసిన ఆమె... నిబద్ధతతో కష్టపడి లక్ష్యాన్ని చేరుకుంది. నేడు సామాన్యులకే కాదు... వెండితెర వేల్పులకూ స్ఫూర్తిమంత్రమైంది.

"నా బాల్యం చాలా విచిత్రంగా గడిచిపోయింది. ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకొంటే నన్ను నేనే నమ్మలేనంతగా మారిపోయింది నా శరీరం... జీవితం. చిన్నప్పుడు నేను చాలా బద్ధకస్తురాలిని. ఆడుకోవడం, తినడం, టీవీ చూడటం, పడుకోవడం ఇదే నా దినచర్య. నా బాల్యమే కాదు, యుక్తవయసు కూడా అలాగే సాగిపోయింది. ఎంత బద్ధకస్తురాలినంటే... కొన్నిసార్లు స్కూల్ నుంచి వచ్చాక యూనిఫామ్ మార్చకుండా పడుకునేదాన్ని. పిజ్జాలు, బిర్యానీలంటే పిచ్చి. బర్గర్లు, నూడుల్స్‌లాంటి ఫాస్ట్ ఫుడ్‌తోనే కడుపు నిండిపోయేది. నన్ను, నా అలవాట్లు చూసి మా అమ్మ ఎంతో ఆందోళన చెందేది. నా బద్ధకం ఎలా వదిలించాలో తెలియక బాధ పడేది. అలాంటి నేను ఇవాళ యాభై నాలుగేళ్ల వయసులోనూ ఇంత ఫిట్‌గా, క్రమశిక్షణగా ఉన్నానంటే ఎదుటివారికే కాదు, నాకూ ఆశ్చర్యంగా అనిపిస్తుంది. ఒక సంకల్పంతో నిబద్ధతగా కష్టపడితే అసాధ్యమైన లక్ష్యం ఏదీ ఉండదనేది నా నమ్మకం. ఆ నమ్మకమే నన్ను మీ ముందు ఇలా నిలబెట్టింది. టామ్‌బాయ్‌లా...

నేను పుట్టింది అమెరికాలో. అక్కడే పాఠశాల విద్యాభ్యాసం పూర్తయింది. తరువాత ముంబయికి వచ్చాం. సెయింట్ జేవియర్ కాలేజీలో చదివాను. నా స్నేహితుల్లో ఎక్కువ మగపిల్లలు ఉండేవారు. దాని కోసమే అమ్మను అడిగాను... కోఎడ్యుకేషన్ కాలేజీలో చేర్చమని. అప్పుడైతే వారితో కలిసి ఆడుకోవచ్చనేది నా ఉద్దేశం. నాకు నచ్చినట్టు జడ వేయడానికి అమ్మకు గంటకు పైగా పట్టేది. ఒక రోజు విసిగిపోయి సెలూన్‌కు తీసుకువెళ్లి నా జుట్టు కట్ చేయించింది. షార్ట్ హెయిర్‌తో అప్పటి నుంచి నా ఆహార్యం కూడా టామ్‌బాయ్‌లా మారిపోయింది. ఇక కళాశాలలో నేను ఆడినవి రెండే ఆటలు. షార్ట్‌పుట్, జావెలిన్ త్రో. మన బలం చూపించుకొనే క్రీడలు కదా అవి. అందుకే వాటిని ఎంచుకున్నా. టీనేజీలో రెబల్‌గా ఉండేదాన్ని. ఎవరైనా ఇది చేయమని చెబితే నాకు అస్సలు నచ్చేది కాదు.

స్నేహితురాలితో వెళ్లి...

నా ఫిట్‌నెస్ ప్రయాణం అనుకోకుండా మొదలైంది. ఒక రోజు నా స్నేహితురాలు మా ఇంటికి వచ్చింది. అప్పటికే తను ఓ అబ్బాయితో ప్రేమలో ఉంది. అందుకే బరువు తగ్గాలని అనుకొంటున్నానని, దాని కోసం జిమ్‌కు వెళ్లాలని, నన్ను తోడు రమ్మని అడిగింది. అప్పుడు నా వయసు పద్దెనిమిదేళ్లు. స్నేహితురాలు అడగడంతో కాదనలేకపోయాను. కొన్నిసార్లు మన జీవితంపై ఎదుటివారి ఒత్తిడి అనేక విధాలుగా పని చేస్తుంది. అయిష్టంగానే తన వెంట జిమ్‌కు వెళ్లి, నేనూ ఫిట్‌నెస్ క్లాస్‌లో చేరాను. ఏరోబిక్స్ సెషన్‌తో నా ఫిట్‌నెస్ జర్నీ మొదలైంది. డ్యాన్స్ మూమెంట్స్‌లా ఉండే ఆ వ్యాయామాలు నాకు బాగా నచ్చాయి. జిమ్‌కు వెళ్లేవరకు అందరు అమ్మాయిల్లా నేనూ బాగా డ్యాన్స్ చేయగలననే నమ్మకం ఉండేది. ఏరోబిక్స్ మొదలుపెట్టాకే తెలిసింది... నాకు అసలు డ్యాన్స్ రాదని. నా కదలికలు మిగిలినవారికి భిన్నంగా ఉండేవి. అందరూ నన్ను వింతగా చూసేవారు. అది నాకు అవమానంగా అనిపించింది. దాంతో పట్టుదల పెరిగింది. ఒక్కరోజు కూడా మానకుండా జిమ్‌కు వెళ్లాను. ఎంతో శ్రమించాను. బాగా మెరుగయ్యాను.

టీచర్ సలహాతో...

నాలోని పట్టుదల, నైపుణ్యం చూసిన మా ఏరోబిక్స్ టీచర్... అమెరికాలో ఫిట్‌నెస్ కోర్సు చేయమని చెప్పారు. ఆమె సలహాతో 'అమెరికన్ కాలేజీ ఆఫ్ ఎక్సర్‌సైజ్'లో చేరి, ఫిట్‌నెస్ శిక్షణ తీసుకున్నాను. అలా ఒక ఫిట్‌నెస్ కోర్సులో సర్టిఫికెట్ పొందిన తొలి భారతీయురాలిని నేనే. అదే సమయంలో కిండర్‌గార్డెన్ టీచర్ ట్రైనింగ్ కూడా తీసుకున్నాను. ముంబయికి తిరిగి వచ్చాక ఫిట్‌నెస్ పాఠాలు మొదలుపెట్టాను. ఉదయం టీచింగ్, సాయంత్రం ఫిట్‌నెస్ క్లాస్‌లు. రోజూ నగరంలో ఈ చివర నుంచి... ఆ చివరకు ప్రయాణం. కొన్ని నెలలు గడిచాయి. 'ఫ్రెంచ్ ఇంటర్నేషనల్ స్కూల్'లో ఇంగ్లీష్ టీచర్‌గా ఉద్యోగం వచ్చింది. తరువాత మినాజ్ కరాచీవాలతో పెళ్లయింది. మా అబ్బాయి పుట్టాక ఫిట్‌నెస్ తరగతులు కుదించుకున్నా.

అవహేళన చేసినా...

మా బాబు కాస్త పెరిగే వరకు నా అవసరం ఉంటుంది కదా. దాని కోసం చాలా అవకాశాలు వదులుకున్నా. కుదిరిన సమయంలోనే శిక్షణ ఇచ్చేదాన్ని. అయితే అందరిలా కాకుండా... నాకంటూ ఒక గుర్తింపు కావాలనిపించింది. దాంతో మరింత నైపుణ్యం పెంచుకొనేందుకు

పర్సనల్ ట్రైనర్ కోర్సు చేశాను. ఆ సమయంలో నా శరీరాకృతిని చూసి 'మగరాయుడిలా ఉంది' అంటూ అవహేళనగా మాట్లాడేవారు. 'నాకంటూ ఒక రోజు వస్తుంది' అని వారికి సమాధానం ఇచ్చేదాన్ని. అందుకే సవాలుగా తీసుకుని ముందు నా శరీరాన్ని నాజూగ్గా తయారు చేసుకున్నా. దీన్ని గమనించిన కొందరు తమకు కూడా అలాంటి ఆకృతి కావాలంటూ అడిగారు. తరువాత వారందరూ నా శిష్యులు అయ్యారు.

స్టూడియోకు శ్రీకారం...

ఫిట్‌నెస్ పాఠాల కోసం నా దగ్గరకు వచ్చేవారు క్రమంగా పెరిగారు. దాంతో మా గెస్ట్ రూమ్‌ను ఫిట్‌నెస్ స్టూడియోగా మార్చాను. కొన్నాళ్లకు అది సరిపోక స్టూడియో... లివింగ్ రూమ్‌కు, తరువాత టెర్రస్‌కు, అక్కడి నుంచి బాంద్రాలోని పెద్ద హాల్‌కు మారింది. ఇంట్లో నేను తరగతులు చెప్పినంతసేపూ మావారు నాకు తోడుగా ఉండేవారు. ఇంకా ఏదో చేయాలన్న తపనతో అమెరికా వెళ్లి పిలెట్స్ ట్రైనింగ్ తీసుకున్నా. తద్వారా భారత్‌లో తొలి బీఏఎసఐ (బాడీ ఆర్ట్స్ అండ్ సైన్స్ ఇంటర్నేషనల్) సర్టిఫైడ్ పిలెట్స్ ఇన్‌స్ట్రక్టర్‌ను అయ్యాను.

తారల ట్రైనర్‌గా...

ఇక అప్పటి నుంచి నా జీవితమ అనూహ్య మలుపు తీసుకుంది. బాలీవుడ్ తారల నుంచి పిలుపు వచ్చింది. కత్రినా కైఫ్, దీపికా పదుకొనే, కరీనా కపూర్, అలియాభట్... దాదాపు ప్రముఖ హీరోయిన్లు అందరితో కలిసి పని చేశాను. వారికి వ్యక్తిగత ట్రైనర్‌గా కూడా ఉన్నాను. 'యాస్మిన్ బాడీ ఇమేజ్' పేరిట ముంబయిలో అతిపెద్ద పిలెట్స్ స్టూడియో నెలకొల్పాను. దాంతోపాటు నగరంలోనే మరో రెండు, ఢిల్లీ, దుబాయ్, ఢాకాల్లోనూ ఫ్రాంచైజీలు ప్రారంభించాను. రెండున్నర దశాబ్దాలకు పైబడిన నా ఈ ప్రయాణంలో... ఎన్నో ప్రతిష్టాత్మక అవార్డులు అందుకున్నాను. భారత్‌లో ఫిట్‌నెసను ఒక పరిశ్రమ స్థాయికి తీసుక వెళ్లానని ప్రముఖులు ఎందరో కొనియాడారు. అందుకు ఎంతో గర్వంగా ఉంది."

లాంగ్ గౌన్లు..క్రాప్ టాప్‌లు!

ప్రపంచం కుగ్రామం అయింది.. ఫ్యాషన్ అంతా ఒక్కటైపోయింది.. అందుకే మనదగ్గర వెస్టర్న్ వేర్ సర్వసాధారణమైపోయింది.. ఇండోవెస్టర్న్ ?స్టైల్‌లో ఉండే లాంగ్ గౌన్లు.. కాస్త మోడ్రన్ టచ్‌తో ఉండే లెహంగా, క్రాప్ టాప్‌లు.. ఇప్పుడు ఫ్యాషన్ ప్రపంచాన్ని ఏలుతున్నాయి.. పెళ్ళిళ్ళు, పేరంటాలకు ఇవే సెంటరాఫ్ ఎట్రాక్షన్‌గా నిలుస్తున్నాయి..

ఇక్కత్ ఎక్కడున్నా మిమ్మల్ని సెంటరాఫ్ ఎట్రాక్షన్ చేస్తుంది. నల్లని సిల్క్ ఇక్కత్‌ని లాంగ్ గౌన్‌గా కుట్టాం. దీనికి వచ్చిన పెద్ద బార్డర్ హైలైట్‌గా కనిపిస్తున్నది. ఇక పైన ఆరెంజ్ కలర్ ప్యూర్ సిల్క్‌ని జతచేసి దానికి పోల్కీ బటన్స్ ఇచ్చాం. స్లీవ్స్ మీద సీక్వెన్స్, జర్దోసీ వర్క్‌తో నింపేశాం.

ఆకుపచ్చ సిల్క్ క్రాప్ టాప్ ఇది. దీని మీద గోటా పట్టీ, జర్దోసీ వర్క్‌తో నింపేశాం. దీనికి కూడా కోల్డ్ షోల్డర్ అద్దినట్లు ఉంది. ఇక పీచ్ కలర్ ప్యూర్ సిల్క్ లెహంగా మీద ఫుల్‌గా రాజస్థానీ ?స్టైల్‌లో గోటా పట్టీ వర్క్ చేయించాం. పిస్తా గ్రీన్ కలర్ బార్డర్‌ని జత చేసి దాని మీద గోల్డెన్ లేస్ కుట్టడంతో లెహంగా లుక్కే మారిపోయింది.

నీలాకాశంలో మెరిసే తారకలా కనిపించాలంటే ఈ డ్రెస్ వేయాల్సిందే! లైట్ బ్లూ నెట్ ఫ్యాబ్రిక్‌ని లాంగ్ గౌన్‌గా డిజైన్ చేశాం. వెస్టర్న్ స్టైల్‌లో ఉండేలా ఎక్కువ గేర్‌తో దీన్ని కుట్టాం. నెక్ దగ్గర సీక్వెన్స్, చిప్స్‌తో హెవీగా వర్క్ చేశాం. 3/4 స్లీవ్స్‌తో గౌన్ లుక్కే మారిపోయింది.

ఎండలో వెన్నెల్లా కనిపించేందుకు తెల్లని లాంగ్ గౌన్ పర్‌ఫెక్ట్ ఛాయిస్. తెల్లని ఆర్గంజా మీద ఎర్రని పూల మాదిరి ఆప్లిక్ వర్క్ చేశాం.

డ్రెస్ మొత్తం ఇదే వర్క్ వస్తుంది. బాక్స్ ప్లీట్స్ పెట్టి పైన ఎర్రని లైక్రా ఫ్యాబ్రిక్ అటాచ్ చేశాం. దీనికి హాల్టర్ నెక్ హైలైట్‌గా నిలిచింది.

డార్క్ బ్లూ కలర్ వెల్వెట్‌తో లెహంగా కుట్టాం. దాని మీద మొత్తం జరీ వర్క్‌తో నింపేశాం. గోల్డెన్ జరీ వచ్చిన లేస్‌ని బార్డర్‌గా జతచేశాం. ఇక క్రాప్‌టాప్‌కి పింక్ కలర్ ప్యూర్ సిల్క్ ఎంచుకున్నాం. దీని మీద కుందన్స్, జర్దోసీ, ముత్యాలతో హెవీగా వర్క్ చేశాం. కోల్డ్ షోల్డర్, ఫుల్‌స్లీవ్స్‌తో రాజకుమారిని తలపింపొచ్చు. స్లీవ్స్ మీద గ్లాస్ ట్యూబ్స్‌తో వర్క్ చేశాం.



తల్లులు ఊబకాయులైతే..

ఊబకాయంతో ఉండే తల్లులకు పుట్టే పిల్లల్లో రోగనిరోధకశక్తి తక్కువగా ఉంటుందని ఇటీవల చేసిన ఒక స్టడీలో వెల్లడైంది. అదే సమయంలో లావుగా లేని అమ్మలకు పుట్టిన బిడ్డల్లో మాత్రం ఈ లోపం కనిపించడంలేదని అధ్యయనకారులు పేర్కొన్నారు. తల్లి కావడానికి ముందర ఆడవాళ్లు భారీకాయంతో ఉంటే దాని ప్రభావం వాళ్లకి పుట్టే బిడ్డల్లో కనిపిస్తుందట. గుండెజబ్బులు, ఆస్తమా వంటి జబ్బుల బారిన పడే అవకాశం ఉందని ఈ స్టడీని నిర్వహించిన కాలిఫోర్నియా యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ ఇహెమ్ మెసాద్ తెలిపారు.

ఈ స్టడీలో ప్రధానంగా ఊబకాయులైన తల్లులకు పుట్టిన పిల్లల్లో రోగనిరోధకశక్తిపై, వారికి వచ్చే జబ్బులపై రీసెర్చ్ చేశారు. ఈ స్టడీ అమెరికాలోని 39 మంది తల్లులపై చేశారు. లావుగా ఉన్న తల్లులకు, సన్నగా ఉన్న తల్లులకు పుట్టిన పిల్లల బొడ్డుతాడు నుంచి కణాలు తీసి పరీక్షించారు. అందులో ఊబకాయులైన తల్లులకు పుట్టిన బిడ్డలు బాక్టీరియల్ యాంటిజన్స్‌కు సరిగా స్పందించడం లేదు. కానీ సన్నగా ఉన్న తల్లులకు పుట్టిన బిడ్డల్లో బాక్టీరియల్ యాంటిజెన్స్‌కు స్పందన బాగా ఉండడాన్ని గుర్తించారు. ఊబకాయంతో ఉన్న తల్లులకు పుట్టిన పిల్లల్లో మనిషి రోగనిరోధక వ్యవస్థలో ముఖ్యమైన సిడి4టి కౌంట్ తగ్గడం గమనించారు. ఆస్తమా, ఇతర రకాల ఎలర్జీల నివారణలో ముఖ్యపాత్ర వహించే రోగనిరోధక కణాల సంఖ్య ఊబకాయమున్న తల్లులకు పుట్టిన పిల్లల బొడ్డుతాడులో తక్కువగా ఉండడాన్ని కూడా ఈ అధ్యయనంలో గుర్తించారు.

ఒత్తిడిని అధిగమించేందుకు

మార్గాలున్నాయ్

ఈ రోజులలో ఒత్తిడికి గురికాకుండా ఎవరైనా ఉన్నారా అంటే... లేరనే చెప్పాలి. కాలంతోపాటు పరిగెత్తే క్రమంలో ఒత్తిడికి గురవుతున్నారు. ఒత్తిడిని జయించడానికి అనేక మార్గాలు ఉన్నాయి. ఒత్తిడిని అధిగమించడంపై పుస్తకాలు, టీవీలలో ప్రసారాలు, పత్రికలలో ప్రత్యేక కథనాలు కూడా వస్తుంటాయి. కౌన్సెలింగ్ తరగతులు కూడా కొందరు నిర్వహిస్తుంటారు. ముఖ్యంగా యోగా సెంటర్లు స్ట్రెస్‌పై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాయి. ఇంటర్నేషనల్ స్ట్రెస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన ఒత్తిడి నుంచి అధిగమించడానికి ఏమేమి చేయాలన్నదానిపై కొన్ని సూచనలు ఇస్తోంది. ఒత్తిడి ఎవరెవరిలో ఉంటుంది? వ్యవసాయదారులు పంటలు పండకపోతే, తెచ్చిన రుణం తీరకపోతే, చేతికొచ్చిన పంట ఎండిపోతే, తుపానుకు తుడిచి పెట్టుకుపోతే, తగిన ధర రాకపోతే ఒత్తిడికి గురవుతారు. 40 నుంచి 50 శాతం మంది రైతులలో ఒత్తిడి ఉంటుందని అంచనా. గృహిణులు కూడా ఒత్తిడికి గురవుతారట. ఉదయం నిద్ర లేచినప్పటినుంచి వారు చేసే పని అంతా కూడా ఒత్తిడితోనే ఉంటుంది. ఉద్యోగాలకు వెళ్ళేవారయితే పిల్లలను పాఠశాలలకు వెళ్ళేందుకు సిద్ధం చేయడం ఒక ఎత్తయితే, వారు ఉద్యోగానికి సమయానికి చేరుకోవడం కూడా మరొక ఎత్తు. గృహిణులలో 40 శాతం మందికి ఒత్తిడి ఉంటుందని అంచనా. ఉపాధ్యాయులు, ఉద్యోగులుకు సంబంధించి 20 నుంచి 30 శాతం మందికి ఒత్తిడి ఉంటుందని అంచనా. రాజకీయనాయకులలో సుమారు 50 శాతం మందికి ఒత్తిడి ఉంటుందని అంచనా. రాజకీయ నాయకులు పదవుల కోసం. ఎన్నికలలో గెలుపుకోసం. మంత్రి పదవులకోసం వంటి స్వీయపనుల కోసం ఒక ఒత్తిడి అయితే. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చలేక ఇబ్బందులు పడుతూ ఒత్తిడి గురవడం ఇంకొకటి. పోలీసులలో 60 శాతం మందికి ఒత్తిడి ఉంటుందని అంచనా. సొంత వ్యాపారాలు చేసే వారికి మరింతగా ఒత్తిడి ఉంటుంది. దాదాపు 70 శాతంమంది ఒత్తిడికి గురవుతారట. పోటీని తట్టుకుని వ్యాపారం చేయడంలో, లాభాలను ఆర్జించడంలో, తెచ్చిన రుణాలను తీర్చక ఇబ్బంది పడుతున్న సమయంలో ఒత్తిడికి గురవుతారట. ఎగ్జిక్యూటివ్‌లు తమకు ఇచ్చిన లక్ష్యాలను నెరవేర్చలేక ఒత్తిడికి గురవుతుంటారు. విద్యార్థులు కూడా పోటీపరీక్షలలో పాల్గొనేందుకు, రెగ్యులర్ పరీక్షలలో బెస్ట్ ర్యాంక్ తెచ్చుకునేందుకు ఇలా పలు రకాల ఒత్తిడిలు వారిపై కూడా ఉంటాయి. శ్వాసకోస వ్యాధులు, అజీర్ణవ్యాధులు, కడుపునొప్పి, చర్మవ్యాధులు, బ్లడ్ ప్రషర్, మధుమేహం, నిద్రపట్టకపోవడం, గుండెల్లో దడ, మైగ్రేన ఇలాంటి కొన్ని వ్యాధుల కారణంగా కూడా ఒత్తిడి ఉంటుంది. అలసట, అనారోగ్యసమస్యలు, సంసారం సరిగా సాగనప్పుడు, ఈర్ష్యా ద్వేషాలు ఉన్నపుడు, భయం అవహించి ఉండడం, విపరీతమైన భ్రాంతితో ఉండడం ఇలా ఎన్నో ఎన్నెన్నో... ఒత్తిడినుంచి అధిగమించేందుకు... విశ్రాంతి తీసుకోవాలి. ఎంత సమయం పాటు విశ్రాంతి తీసుకోవాలన్నదానిపై కొలమానం ఏదీ లేదు. మనస్సు ఆహ్లాదకరంగా ఉందనిపించేంత వరకు విశ్రాంతి తీసుకోవచ్చు. యోగా చేయవచ్చు, ప్రకృతి సుందర ప్రదేశాలు, దేవాలయాలను దర్శించవచ్చు. పర్యటనలకు వెళ్ళవచ్చు. ముఖ్యంగా ఒత్తిడిని జయించేందుకు ఆత్మవిశ్వాసం చాలా ముఖ్యం. ఒత్తిడీ ఒక మేలే.. నిజంగా ఒత్తిడీ ఒకమేలేనని చెబుతారు. ఒత్తిడి నుంచి ఉత్తేజితులవ్వాలి. ముఖ్యంగా చదువుకునే విద్యార్థి నుంచి దేశాధినేత వరకు అందరిలోనూ ఒత్తిడి ఉంటోంది. ముఖ్యంగా మేనేజ్‌మెంట్ చేసే వాళ్ళకు ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. ఒత్తిడి అనేది లేకపోతే కొందరు బద్ధకస్తులు అవుతారు. పనిని తొందరగా చేయాలని ఆనిపించడమే ఒత్తిడి.

ఏం చేయాలి? ..ఇప్పుడు ఎంత పని చేయగలమో అంతే చేయాలి. రేపటి గురించి తరువాత ఆలోచన చేయాలి. సమస్యలను ఎదుర్కొనడానికి సిద్ధపడాలి. కష్టంవస్తే కుంగి పోకూడదు. ఖాళీగా ఉన్న సమయంలో ఒత్తిడిని అధిగమించేందుకు ప్రయత్నాలు చేయాలి. పుస్తక పఠనం ద్వారా ఎంతో ఉపయోగం ఉంటుంది. ఆత్మీయుల వద్దకు వెళ్ళి కాసేపు మాట్లాడితే ,ఇష్టమైన ప్రాంతానికి పర్యటనకు వెళితేకూడా ఉపశమనం ఉంటుంది. పదిమందిలో కాసేపు కూర్చుని సరదాగా మాట్లాడండి.

దేశం గర్వపడే క్షణాలివి.. రాజ్యాంగంపై ప్రధాని మోదీ..

న్యూఢిల్లీ-నవభూమి: రాజ్యాంగంపై లోక్‌సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఈ సందర్భంగా కీలక కామెంట్స్ చేశారు. ఇవి దేశం గర్వపడే లక్షణాలని పేర్కొన్నారు. 75 ఏళ్ల ప్రజాస్వామ్యాన్ని వేడుకగా చేసుకునే క్షణాలివి అని పేర్కొన్నారు.

రాజ్యంగంపై లోక్‌సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఈ సందర్భంగా కీలక కామెంట్స్ చేశారు. ఇవి దేశం గర్వపడే లక్షణాలని పేర్కొన్నారు. 75 ఏళ్ల ప్రజాస్వామ్యాన్ని వేడుకగా చేసుకునే క్షణాలివి అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పండుగను ఘనంగా జరుపుకుంటున్నామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. మన రాజ్యాంగం ఎన్నో దేశాలకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. ఎందరో మహానుభావులు కలిసి రాజ్యాంగాన్ని రచించారని.. వారందరినీ స్మరించారు. దేశాభివృద్ధిలో మహిళల పాత్ర ఎనలేనిదన్నారు. దేశ అధ్యక్షురాలిగా ఆదివాసీ మహిళ ఎన్నికయ్యారని ప్రధాని చెప్పారు. మహిళలకు అన్ని రంగాల్లో గౌరవం దక్కాలని పిలుపునిచ్చారు ప్రధాని. రాజ్యాంగం మహిళలకు అన్ని విధాలుగా అండగా ఉందన్నారు. భారతదేశాన్ని వికసిత్ భారత్‌గా మార్చాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. భారత రాజ్యాం గం 75 సంవత్సరాల ప్రాముఖ్యతపై ప్రధాని మోదీ కీలక ప్రసంగం చేశారు. రాజ్యాంగ పండుగను నిర్వహించుకోవడం గర్వకారణం అన్నారు. ఈ 75 సంవత్సరాలు చిరస్మరణీయమైనవని పేర్కొన్నారు. ఇలాంటి కీలక సమయంలో పార్లమెంట్‌లో తాను ఉన్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు ప్రధాని మోదీ.

యూపీఐ చెల్లింపుల్లో మైలురాయి.. 11 నెలల్లో రూ.223 లక్షల కోట్ల పేమెంట్స్..!

న్యూఢిల్లీ-నవభూమి: యూపీఐ లావాదేవీల్లో కీలక మైలురాయి రికార్డైంది. ఈ ఏడాది జనవరి నుంచి నవంబర్ నెలాఖరు వరకూ 15,547 కోట్ల లావాదేవీలు జరిగితే రూ.223 లక్షల కోట్ల చెల్లింపులు జరిగాయని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ శనివారం 'ఎక్స్ (మాజీ ట్విట్టర్)' వేదికగా పోస్ట్ చేసింది. 'భారత్ ఆర్థిక వ్యవస్థ చడిజిటల్ పేమెంట్ విప్లవం దిశగా ప్రయాణిస్తోంది. 2024 జనవరి- నవంబర్ మధ్య 15,547 కోట్ల లావాదేవీల్లో రూ.223 లక్షల కోట్ల చెల్లింపులు జరిగాయి. ఇది భారత్ ఆర్థిక పరివర్తనపై ప్రభావం చూపుతుంది' అని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా కూడా యూపీఐ పేమెంట్స్‌కు ప్రాముఖ్యత పెరుగుతున్నదని పేర్కొంటూ FinMinYearReview 2024 అనే హ్యాష్ ట్యాగ్ జత చేసింది. ప్రస్తుతం ఏడు దేశాల్లో యూపీఐ లావాదేవీలు జరుగుతున్నాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సింగపూర్, భూటాన్, నేపాల్, శ్రీలంక, ఫ్రాన్స్, మారిషస్ దేశాల్లోనూ యూపీఐ చెల్లింపులు జరుగుతున్నాయి. ఇది భారత్‌లో పెరిగిపోతున్న డిజిటల్ పేమెంట్స్ ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది. మొబైల్ ఫోన్ల ద్వారా వ్యక్తులు, వ్యాపారుల మధ్య రియల్ టైం లావాదేవీల దిశగా డిజిటల్ చెల్లింపుల పరివర్తన సాగుతోంది. 2015లో ఆర్బీఐ మద్దతుతో నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్పీసీఐ) ప్రారంభించారు. యూఐడీఏఐ చైర్మన్, ఇన్ఫోసిస్ కో-ఫౌండర్ నందన్ నిలేకని సారథ్యంలోని కమిటీ.. దేశంలో సమర్థవంతమైన డిజిటల్ చెల్లింపుల ఫ్రేమ్ వర్క్ స్థాపించాలని ప్రతిపాదించింది. తదనుగుణంగా యూపీఐ ఏర్పాటు జరిగింది.

అన్నదాతకు తీపి కబురు.. వచ్చే నెల నుంచి తాకట్టు లేకుండా రూ.2లక్షల లోన్ మంజూరు..!

న్యూఢిల్లీ-నవభూమి: అన్నదాతలకు భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్బీఐ) శుభవార్త చెప్పింది. ఎటువంటి ఆస్తుల తాకట్టు లేకుండా తీసుకునే రుణ పరిమితిని రూ.2 లక్షలకు పెంచేసింది. 2025 జనవరి ఒకటో తేదీ నుంచి తాకట్టు లేకుండా రూ.2 లక్షల వరకూ పంట రుణం తీసుకోవచ్చు. చిన్న, సన్నకారు రైతులకు పంటల సాగు వ్యయం భారం కాకుండా ఆర్బీఐ ఈ నిర్ణయం తీసుకున్నది. రోజురోజుకు ద్రవ్యోల్బణం పెరిగిపోవడం, ఖర్చులు పెరగడంతో రైతులకు రుణ పరపతి సౌకర్యం మెరుగు పర్చాల్సిన అవసరం ఉందని కేంద్ర వ్యవసాయ శాఖ తెలిపింది. తాజా నిర్ణయం వల్ల 86 శాతం మంది రైతులకు లబ్ధి చేకూరుతుందని పేర్కొంది. తాజా నిర్ణయం మేరకు బ్యాంకులు పంట రుణాలపై కొత్త మార్గదర్శకాలు జారీ చేయడంతోపాటు అన్నదాతల్లో అవగాహన కల్పించాలని ఆర్బీఐ ఆదేశించింది. తాజాగా కేంద్రీయ బ్యాంకు నిర్ణయం వల్ల కిసాన్ క్రెడిట్ కార్డు (కేసీసీ) ద్వారా రుణ సౌకర్యం తేలిక కావడంతోపాటు గవర్నమెంట్ మోడిఫైడ్ ఇంటరెస్ట్ సబ్ వెన్షన్ స్కీమ్ కింద సరసమైన వడ్డీరేట్లపై రూ.3-4 లక్షల వరకూ రుణం పొందొచ్చు. 2004లో ఎటువంటి తాకట్టు లేకుండా రూ.10 వేల రుణం మాత్రమే తీసుకునే వెసులుబాటు ఉంది. కానీ, క్రమంగా ఆర్బీఐ ఈ పరిమితి పెంచుతూ వస్తోంది. కింది స్థాయిలో బ్యాంకులు మాత్రం తాకట్టు లేకుండా రుణాలు మంజూరు చేయడం లేదు. దీనివల్ల పంటల సాగు కోసం రైతులు ప్రైవేట్ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి చిక్కుల్లో పడుతున్నారు.

యాప్ స్టోర్స్ నుంచి టిక్‌టాక్‌ను తొలగించాలి.. ఆపిల్, గూగుల్ సంస్థలకు చట్టసభ్యుల విజ్ఞప్తి

న్యూఢిల్లీ-నవభూమి: ఆపిల్, గూగుల్ సంస్థలకు అమెరికా చట్టసభ్యులు కీలక విజ్ఞప్తి చేశారు. టిక్‌టాక్‌ను ఆపిల్ స్టోర్, గూగుల్ ప్లే స్టోర్ నుంచి తొలగించాలని భారతీయ అమెరికన్ రాజా కృష్ణమూర్తితో సహా ఇద్దరు యూఎస్ చట్టసభ సభ్యులు కోరారు. ఏప్రిల్‌లో ప్రెసిడెంట్ జో బైడెన్ సంతకం చేసిన బిల్లు సహా.. బైటెడెన్స్ నిషేధాన్ని ఎదుర్కొంటుంది. యూఎస్ చట్టసభ సభ్యులు జాన్ మూలేనార్, రాజా కృష్ణమూర్తి ఆపిల్ సీఈవో టిమ్ కుక్, గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్‌లకు లేఖ రాశారు. జనవరి 19లోగా ఆయా యాప్ స్టోర్స్ నుంచి టిక్‌టాక్‌ని తొలగించేందుకు సిద్ధం కావాలని కోరారు. టిక్‌టాక్ సీఈవో షు జీ చౌని వెంటనే పెట్టుబడుల ఉపసంహరణ ప్రతిపాదించాలని లేఖలో కోరారు. ఫారిన్ అడ్వైజరీ కంట్రోల్డ్ అప్లికేషన్ యాక్ట్ నుంచి అమెరికన్లను రక్షించే చర్యను డీసీ సర్క్యూట్ కోర్ట్ సమర్థించింది. ఈ క్రమంలో టిక్‌టాక్‌తో పాటు టీమ్ కుక్, సుందర్ పిచాయ్‌లకు చట్టసభ్యులు లేఖలో పంపారు. టిక్‌టాక్‌పై ఇప్పటికే చాలాదేశాలు నిషేధించాయి. టిక్‌టాక్‌ను భారత్ జూన్ 2020లో బ్యాన్ విధిస్తూ నిర్ణయం తీసుకున్నది. భద్రతను దృష్టిలో పెట్టుకొని చైనాకు చెందిన 58 యాప్‌లపై నిషేధం విధించిన విషయం తెలిసిందే. అలాగే, ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్, ఇండోనేషియా, కిర్గిజిస్తాన్, ఆస్ట్రేలియా, రష్యా, యూకే, బెల్జియం, డెన్మార్క్, కెనడా, న్యూజిలాండ్, తైవాన్, మాల్టా, ఫ్రాన్స్, నార్వే, లాట్వియా సైతం టిక్‌టాక్‌పై నిషేధాన్ని విధించాయి.

మీ సేవింగ్స్ ఖాతాలో గరిష్టంగా ఎంత డిపాజిట్ చేసుకోవచ్చు..



ముంబై-నవభూమి: ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరికీ బ్యాంకులో సేవింగ్స్ ఖాతా అవసరం. అన్ని ప్రభుత్వ పథకాలతోపాటు ఇతర లావాదేవీల కోసం కూడా బ్యాంకు ఖాతాను అనేక మంది కలిగి ఉంటున్నారు. అయితే ఇటీవల డిజిటల్ లావాదేవీలు పెరిగిన తర్వాత బ్యాంకు డిపాజిట్లు తగ్గాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి క్రమంలో సేవింగ్ అకౌంట్ తీసుకున్న తర్వాత ఎంత బ్యాలెన్స్ మెయింటెన్ చేయాలి, ఎలాంటి రూల్స్ పాటించాలనే విషయం అనేక మందికి తెలియదు. ఆ వివరాలను ఇక్కడ తెలుసుకుందాం.

మీ ఖాతాలో ఎంత డబ్బు

భారతదేశంలో బ్యాంకు ఖాతాలను తెరవడానికి ఎలాంటి పరిమితి లేదు. అందుకే అనేక మందికి రెండు లేదా అంతకంటే ఎక్కువ బ్యాంకు ఖాతాలు ఉంటాయి. కానీ నిబంధనల ప్రకారం జీరో బ్యాలెన్స్ ఖాతాలు మినహా అన్ని ఖాతాలలో కనీస బ్యాలెన్స్ నిర్వహించడం తప్పనిసరి. లేకుంటే బ్యాంకు మీ ఖాతాల నుంచి పెనాల్టీని వసూలు చేస్తుంది. కానీ సేవింగ్ ఖాతాల విషయంలో మాత్రం అలా ఉండదు. నిబంధనల ప్రకారం మీరు మీ సేవింగ్స్ ఖాతాలో ఎంత డబ్బునైనా ఉంచుకోవచ్చు. దీనికి సంబంధించి ఎలాంటి పరిమితి ఉండదు. అయితే మీ ఖాతాలో జమ చేసిన మొత్తం ఎక్కువై అది ఆదాయపు పన్ను పరిధిలోకి వస్తే మాత్రం, ఆ ఆదాయ మొత్తం గురించి మీరు చెప్పాల్సి ఉంటుంది.

ఒక రోజులో ఎంత డిపాజిట్

దీంతోపాటు బ్యాంకు శాఖకు వెళ్లి నగదు డిపాజిట్ చేసే విషయంలో, నగదు ఉపసంహరించుకునే విషయంలో కూడా పరిమితి ఉంటుంది. చెక్కు లేదా ఆన్‌లైన్ ద్వారా మీరు మీ సేవింగ్స్ ఖాతాలో వెయ్యి, లక్ష, కోటి వరకు ఏంతైనా జమ చేసుకోవచ్చు. కానీ రూ. 50,000 లేదా అంతకంటే ఎక్కువ నగదును బ్యాంకులో డిపాజిట్ చేస్తే, దాంతో పాటు పాన్ నంబర్ కూడా తెలపాలి.

అంటే ఈ లెక్కన మీరు ఒక రోజులో రూ. 1 లక్ష వరకు నగదు డిపాజిట్ చేసుకోవచ్చు. అలాగే మీరు మీ ఖాతాలో క్రమం తప్పకుండా నగదు జమ చేయకపోతే, ఈ పరిమితి రూ. 2.50 లక్షల వరకు చేరుతుంది. ఇది కాకుండా ఒక వ్యక్తి తన ఖాతాలో ఆర్థిక సంవత్సరంలో గరిష్టంగా రూ. 10 లక్షల వరకు జమ చేసుకోవచ్చు. ఈ పరిమితి పన్ను చెల్లింపుదారులకు ఒకటి లేదా అంతకంటే ఎక్కువ ఖాతాలకు వర్తిస్తుంది.

10 లక్షలకు పైగా ఉన్న డిపాజిట్లపై

ఒక వ్యక్తి ఆర్థిక సంవత్సరంలో రూ. 10 లక్షల కంటే ఎక్కువ నగదు డిపాజిట్ చేస్తే, ఆ బ్యాంకు ఆదాయపు పన్ను శాఖకు తెలియజేయాలి. అటువంటి పరిస్థితుల్లో ఆ వ్యక్తి ఆదాయం వివరాలను ప్రకటించాలి. ఆ వ్యక్తి ఆదాయపు పన్ను రిటర్న్‌లో ఆ మొత్తం గురించి సరైన సమాచారం ఇవ్వలేకపోతే, అతనిపై ఆదాయపు పన్ను శాఖ విచారణ చేయవచ్చు. పట్టుబడితే భారీ జరిమానా కూడా విధిస్తారు.

ఆ వ్యక్తి ఆదాయ మొత్తం గురించి సరైన వివరాలను వెల్లడించకపోతే, డిపాజిట్ మొత్తంపై 60 శాతం పన్ను, 25 శాతం సర్‌ఛార్జ్, 4 శాతం సెస్ విధించే అవకాశం ఉంది. అంటే మీరు రూ.10 లక్షల కంటే ఎక్కువ నగదు లావాదేవీలు చేయలేరని దీనర్థం కాదు. మీ వద్ద ఈ ఆదాయానికి సంబంధించిన రుజువు ఉంటే, మీరు ఎలాంటి చింత లేకుండా నగదు డిపాజిట్ చేసుకోవచ్చు.

భారత్ మొబిలిటీ ఎక్స్ పోలో ప్రదర్శించనున్న కియా సిరోస్.. ఇవీ స్పెషిఫికేషన్స్..!

న్యూఢిల్లీ-నవభూమి: దక్షిణ కొరియా ఆటోమొబైల్ సంస్థ కియా ఇండియా గ్లోబల్ మార్కెట్లలో తన కంపాక్ట్ ఎస్‌యూవీ కారు న్యూ కియా సిరోస్‌ను ఈ నెల 19న ఆవిష్కరించనున్నది. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న సొనెట్ సెల్టోస్ మధ్య నిలుస్తుందని భావిస్తున్నారు. త్వరలో ప్రారంభం కానున్న భారత్ మొబిలిటీ ఎక్స్ పో లో కియా ఇండియా తన కొత్త కియా సిరోస్ కారును ప్రదర్శించనున్నది. ఇదే ఎక్స్ లోలో కియా సిరోస్ కారు ధర కూడా ప్రకటిస్తుందని భావిస్తున్నారు. స్కోడా కైలాక్ నిసాన్ మాగ్నైట్ రెనాల్ట్ కైగర్ మారుతి ఫ్రాంక్స్ టయోటా టైసోర్ తదితర ఎస్‌యూవీ కార్లకు గట్టి పోటీ ఇవ్వనున్నది కియా సిరోస్ న్యూ కార్నివాల్‌లో మాదిరిగా కియా సిరోస్ కారులో ఫ్రంట్‌లో డీఆర్ఎల్స్‌తోపాటు క్యూబికల్ షేప్డ్ ఎల్ఈడీ హెడ్ ల్యాంప్స్, బ్లాక్డ్ ఔట్ సీ-పిల్లర్, ఫ్లష్ ఫిటింగ్ డోర్ హ్యాండిల్స్, స్క్వేర్డ్ ఆఫ్ వీల్ ఆర్చెస్, రూఫ్ రెయిల్స్ తదితర ఫీచర్లు ఉంటాయి. ఇన్ సైడ్‌లో లార్జ్ టచ్ స్క్రీన్ ఇన్‌ఫోటైన్‌మెంట్ సిస్టమ్, న్యూ ఎయిర్ క్రాఫ్ట్ థ్రోట్టెల్ లైక్ గేర్ షిఫ్టర్, పుష్ బటన్ స్టార్ట్/స్టాప్, వైర్ లెస్ చార్జింగ్ పాడ్, పనోరమిక్ సన్ రూఫ్, మల్టీపుల్ టైప్-సీ యూఎస్బీ పోర్ట్స్, మల్టీ లేయర్ డాష్ బోర్డ్ థీమ్, కెమెరా కోసం ప్రత్యేక బటన్, ఫ్రీక్వెంట్లీ ఆపరేటెడ్ ఫంక్షన్స్ కోసం ఫిజికల్ కంట్రోల్స్, 10.25 అంగుళాల టచ్ స్క్రీన్ ఇన్‌ఫోటైన్ మెంట్ సిస్టమ్ ఉంటుందని భావిస్తున్నారు. పవర్ ట్రైన్ వివరాలు వెల్లడించకున్నా సోనెట్ లో మాదిరిగా 1.2 లీటర్ల నేచురల్లీ ఆస్పిరేటెడ్ పెట్రోల్, 1.0 లీటర్ల టర్బో పెట్రోల్, 1.5 లీటర్ల డీజిల్ ఇంజిన్లతో కియా సిరోస్ కారు వస్తుందని భావిస్తున్నారు. 5-స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్ మిషన్, 6-స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్ మిషన్, ఐఎంటీ, ఏటీ అండ్ డీసీటీ వర్షన్లలో లభిస్తుంది.

ఆధార్ ఉచిత అప్‌డేట్ గడువు మరోసారి పొడిగింపు.. ఎప్పటి వరకు అంటే..?

న్యూఢిల్లీ-నవభూమి: నేటి సమాజంలో ఆధార్ కార్డు వినియోగం ఎంత కీలకంగా మారిందో ప్రతి ఒక్కరికీ తెలుసు. సిమ్ కార్డు కొనుగోలు మొదలు బ్యాంకు ఖాతాలు తెరవడం, వాహనాలు, ఇండ్లు, భూముల క్రయ విక్రయాలు.. ప్రభుత్వ పథకాలు, విద్యార్థులకు స్కాలర్‌షిప్ వంటి వాటికి అధార్ తప్పనిసరి అయ్యింది. అయితే.. వయసు పెరుగుతున్న కొద్దీ వ్యక్తుల ముఖాల్లో తేడాలు వస్తుండడం సర్వసాధారణం. దీంతోపాటు ఇంటి చిరునామాలు మారుతుం డడంతో అటు అధికారులు, ఇటు ఆధార్ కార్డుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటిని పరిష్కరించేందుకు ఆధార్‌లో మార్పులు, చేర్పులకు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ ఎప్పటికప్పుడు అవకాశం కల్పిస్తూ వస్తున్నది. ఈ క్రమంలోనే పదేండ్ల క్రితం నాటి ఆధార్ కార్డుల్లోని వివరాలను ఉచితంగా అప్‌డేట్ చేసుకోవడానికి కేంద్రం ఇచ్చిన గడువు నేటి ముగిసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉడాయ్ (%ఖ×ణూ×%) కీలక నిర్ణయం తీసుకుంది. ఈ గడువును మరోసారి పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రకటన చేసింది. ఈసారి ఏకంగా ఆరు నెలలు గడువు పెంచింది. 2025 జూన్ 14 వరకు గడువు పెంచుతున్నట్లు వెల్లడించింది. దీంతో ఉడాయ్ అధికార వెబ్‌సైట్ http://myaadhar.uidai.gov.inలో ఆధార్ నంబర్, మొబైల్ నంబర్ సాయంతో లాగిన్ అయి వివరాలను ఉచితంగానే అప్‌డేట్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసుకోండిలా.. https:// myaadhaar.uidai.gov.in పోర్టల్‌లో ఆధార్ నంబర్ ద్వారా లాగిన్ కావాలి. ప్రొసీడ్ టు అప్‌డేట్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. ఆధార్ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. ఓటీపీ ఎంటర్ చేసిన అనంతరం డాక్యుమెంట్ అప్‌డేట్ ఆప్షన్‌ను క్లిక్ చేస్తే స్క్రీన్‌పై వివరాలు వస్తాయి. వాటిని పూర్తిగా పరిశీలించి సవరణ ఉంటే చేయాలి. లేదంటే ఉన్న వివరాలతోనే నెక్స్ట్‌పై క్లిక్ చేయాలి. కిందికి స్క్రోలింగ్ చేస్తే వచ్చే ప్రూఫ్ ఆఫ్ ఐడెంటిటీ, ప్రూఫ్ ఆఫ్ అడ్రస్ డాక్యుమెంట్లను ఎంచుకోవాలి. ఆయా డాక్యుమెంట్లను స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలి. ఆ తర్వాత సబ్మిట్ బటన్‌పై క్లిక్ చేస్తే అప్‌డేట్ పూర్తయినట్లు పోన్ నెంబర్‌కు పద్నాలుగు అంకెల అప్‌డేట్ రిక్వెస్ట్ నెంబర్ వస్తుంది. దీని ద్వారా స్టేటస్ తెలుసుకోవచ్చు. ఇక గడువు ముగిసిన అనంతరం అప్‌డేట్‌తో పాటు ఫొటో, నివాసం, ఇతర మార్పులు, చేర్పులు చేసుకునేందుకు విధిగా రూ.50 చెల్లించాల్సి ఉంటుంది.

మహిళలకు గుడ్ న్యూస్.. భారీగా తగ్గిన బంగారం ధరలు

ముంబై-నవభూమి: నిన్న మొన్నటి వరకు మహిళలకు షాక్ ఇస్తూ వచ్చింది బంగారం. కొనడం సంగతి పక్కనబెడితే.. ముట్టుకుంటే షాక్ కొట్టింది. కొండెక్కి కూర్చున్న గోల్డ్‌ను కొనాలంటే అందరూ భయపడ్డారు. 80 వేల మార్క్‌కు చేరువలో ఉండటంతో పసిడి వైపు ఫోకస్ తగ్గించారు. వరుసగా బంగారం ధరలు పెరుగుతూ రావడంతో దాని మీద ఇన్వెస్ట్‌మెంట్స్ కాస్త తగ్గాయి. రేట్స్ తగ్గినప్పుడు చూద్దామనే భావన చాలా మంది కస్టమర్స్‌లో కనిపించింది. వాళ్లకు ఊరటను ఇస్తూ ఎట్టకేలకు దిగొచ్చింది పసిడి. ఒక్కరోజు గ్యాప్‌లోనే భారీగా తగ్గింది. మరి.. పసిడి ధరలు ఎలా ఉన్నాయి అనేది ఇప్పుడు చూద్దాం..

ఒక్కరోజులోనే..

డిసెంబర్ 13వ తేదీతో పోలిస్తే 14వ తేదీన బంగారం ధరలు భారీగా తగ్గాయి. నిన్నటితో కంపేర్ చేస్తే ఇవాళ గోల్డ్ రేట్‌లో భారీ మార్పు వచ్చింది. శనివారం నాడు 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.79,140గా ఉంది. అదే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారమైతే రూ.73,100 పలుకుతోంది. ఒక్కరోజు వ్యవధిలోనే రూ.500 వరకు ధరలు తగ్గడాన్ని గమనించొచ్చు. గత కొన్ని రోజులుగా పెరుగుతున్న ధరల నుంచి ఎట్టకేలకు ఇవాళ్టితో ఉపశమనం లభించింది. రేట్లలో ఈ మార్పునకు అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులే కారణమని తెలుస్తోంది.

భారీగా పడిపోయిన వెండి రేటు

గోల్డ్‌తో పాటు సిల్వర్ రేట్స్ కూడా భారీగా పడిపోయాయి. ఇవాళ హైదరాబాద్ మార్కెట్‌లో కిలో వెండి ధర ఏకంగా రూ.3 వేల మేరకు పడిపోవడం గమనార్హం. కిలో వెండి ధర రూ.1,01,000 దగ్గరకు దిగొచ్చింది. పైన పేర్కొన్న గోల్డ్, సిల్వర్ రేట్స్ డిసెంబర్ 14వ తేదీ పొద్దున 7 గంటల వరకు ఉన్న ధరలు. రేట్స్ ఒక్కోసారి మధ్యాహ్నానికి కూడా మారిపోయే ఛాన్స్ ఉంటుంది. కాబట్టి కొనుగోలు చేసే ముందు స్థానికంగా మరోసారి క్లియర్‌గా తెలుసుకోవడం మంచిది. పైన చెప్పిన రేట్లలో జీఎస్టీ సహా ఎలాంటి పన్నులు కూడా కలపలేదు. టాక్సులు కలిపితే ఇంకాస్త ఎక్కువే ఉంటాయి. ఏరియాలను బట్టి ధరల్లో మార్పులు ఉంటాయని గ్రహించాలి.

భారత్‌తో ఎంఎఫ్ఎన్‌కు స్విట్జర్లాండ్ కటీఫ్

న్యూఢిల్లీ-నవభూమి: భారత-స్విట్జర్లాండ్ వాణిజ్య బంధానికి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ద్వంద్వ పన్నుల ఎగవేత నిరోధక ఒప్పందం (డీటీఏఏ)లో భాగంగా భారత్‌కు ఇచ్చిన 'అత్యంత ప్రాధాన్యతా దేశం' (ఎంఎఫఎన్) హోదా క్లాజును వచ్చే ఏడాది జనవరి 1 నుంచి రద్దు చేస్తున్నట్టు స్విట్జర్లాండ్ ప్రభుత్వం ప్రకటించింది. భారత్.. ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో ఆపరేషన్ అండ్ డెవల్‌పమెంట్ (ఓఈసీడీ) గ్రూప్‌లో చేరక ముందే ఏదైనా దేశంతో డీటీఏఏ ఒప్పందం కుదుర్చుకున్నంత మాత్రాన ఆ దేశానికి ఆటోమేటిగ్గా ఎంఎఫ్ఎన్ హోదా వచ్చినట్టు కాదని గత ఏడాది సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీంతో స్విట్జర్లాండ్ ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. ఈ నిర్ణయంతో రెండు దేశాల కంపెనీలపై పన్నుల భారం పెరగడమేగాక, భారత్‌లో స్విట్జర్లాండ్ పెట్టుబడులపైనా ప్రభావం పడుతుందని భావిస్తున్నారు.

డిసెంబర్ 15లోపు అడ్వాన్స్ ట్యాక్స్ కట్టకపోతే.. జరిమానాలు ఏ స్థాయిలో కట్టాలి..?

ముంబై-నవభూమి: మరికొద్ది గంటల్లో డిసెంబర్ 15వ తేదీ వచ్చేస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం మూడో విడత అడ్వాన్స్ ట్యాక్స్‌చెల్లింపునకు ఇదే చివరి గడువు. ఆ గడువు దాటితే జరిమానా కట్టాల్సిందే. అయితే ఈ ఏడాది డిసెంబర్ 15 తేదీ ఆదివారం వచ్చింది కాబట్టి.. పన్ను చెల్లించాల్సిన వారు సోమవారం కూడా ఎలాంటి జరిమానా లేకుండా చల్లించవచ్చు. డిసెంబర్ 15వ తేదీ లోపు పన్ను చెల్లించకుంటే భారీ జరిమానాలను ఎదుర్కోవడమే కాకుండా, చట్టపరమైన చర్యలను కూడా ఎదుర్కోవాల్సి ఉంటుంది. అడ్వాన్స్ ట్యాక్స్ వల్ల జరిమానాలను నియంత్రించుకోవచ్చు. రూ.10 వేల కంటే ఎక్కువ పన్ను చెల్లించాల్సిన వాళ్లు జూన్ 15, సెప్టెంబర్ 15, డిసెంబర్ 15, మార్చ్ 15 తేదీలలో నాలుగు విడుతల్లో పన్నును చెల్లించవచ్చు. ఒక ఆర్థిక సంవత్సరంలో అందే అన్ని ఆదాయాలను పరిగణనలోకి తీసుకుని, అందుబాటులో ఉన్న పన్ను మినహాయింపులను తీసేయాలి. మిగిలిన ఆదాయంపై పన్నును లెక్కగట్టాలి. అలా లెక్కకట్టిన పన్ను రూ.10 వేలు లేదా అంతకంటే ఎక్కువ ఉంటే ముందస్తు పన్ను చెల్లించాలి. అలా అడ్వాన్స్ ట్యాక్స్ కడితే జరిమానాల భారం నుంచి తప్పించుకోవచ్చు. అడ్వాన్స్ ట్యాక్స్‌ను సకాలంలో చెల్లించకపోతే వడ్డీ రూపంలో నెలకు 1 శాతం (సంవత్సరానికి 12 శాతం) జరిమానాగా కట్టాల్సి ఉంటుంది. పన్ను కట్టడం ఒక్క రోజు ఆలస్యమైనా తర్వాతి మూడు నెలలకు వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. మార్చి 15న ఆ మూడు నెలల వడ్డీని చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ముందస్తు పన్ను మూడో వాయిదాను డిసెంబర్ 15న చెల్లించాలి. అయితే ఆ రోజు ఆదివారం కావడంతో చెల్లింపుదారులు ఎలాంటి జరిమానా కట్టాల్సిన అవసరం లేకుండానే డిసెంబర్ 15న పన్ను కట్టవచ్చు.

త్వరలో ఇండియాలో కూడా స్టార్‌లింక్ ఇంటర్నెట్ సేవలు.. వీటికి గట్టి పోటీ

ముంబై-నవభూమి: భారతదేశంలో ఇంటర్నెట్ యూజర్లకు గుడ్ న్యూస్ రాబోతుంది. అది ఏంటంటే ఎలాన్ మస్క్ శాటిలైట్ ఇంటర్నెట్ సర్వీస్ స్టార్‌లింక్ ప్రవేశం ఇండియాలో దాదాపు ఖరారైంది. శాటిలైట్ స్పెక్ట్రమ్‌కు సంబంధించి కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా కీలక విషయం తెలిపారు. స్టార్‌లింక్‌తో పాటు, ఎయిర్‌టెల్, జియో, అమెజాన్ కైపర్ భారతదేశంలో శాటిలైట్ ఇంటర్నెట్ సర్వీస్ కోసం పోటీలో ఉన్నాయి. ఇప్పటికే శాటిలైట్ సర్వీస్ స్పెక్ట్రమ్ కేటాయింపులపై ఎయిర్‌టెల్, జియో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చాయి.

ఈ రెండు కంపెనీలు

ఈ క్రమంలో శాటిలైట్ స్పెక్ట్రమ్ పంపిణీ భూగోళ మొబైల్ నెట్‌వర్క్‌ల మాదిరిగానే ఉండాలని ఈ రెండు కంపెనీలు కోరుతున్నాయి. అయితే దీనికి సంబంధించి ప్రభుత్వం వాటాదారుల నుంచి కూడా అభిప్రాయాన్ని కోరుతోంది. ఈ నేపథ్యంలో శాటిలైట్ స్పెక్ట్రమ్ వేలం 'ఫస్ట్ కమ్ అండ్ ఫస్ట్ సర్వ్' తరహాలో ఉంటుందని కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల భారతదేశంలో శాటిలైట్ ఇంటర్నెట్ సర్వీస్‌ను స్టార్‌లింక్ ప్రారంభించడం సులభం అవుతుంది.

స్పెక్ట్రమ్ వేలం..శాటిలైట్ కమ్యూనికేషన్ కోసం స్పెక్ట్రమ్ కేటాయింపులు 2జీ సర్వీస్ తరహాలో 'ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్' తరహాలో జరుగుతాయని జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. ఇండియా ఎకనామిక్ కాన్ఫరెన్స్ సందర్భంగా స్పెక్ట్రమ్ వేలం భౌతికం

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
7 | హైదరాబాద్ ఆదివారం 15 డిసెంబర్ 2024



ఐటీ కంపెనీలకు హెచ్-1బీ వీసాల కష్టాలు

న్యూఢిల్లీ-నవభూమి: భారత ఐటీ కంపెనీలు అమెరికాలో గడ్డు పరిస్థితి ఎదుర్కొంటున్నాయి. దేశంలోని ఏడు అగ్రశ్రేణి ఐటీ సంస్థలకు హెచ్-1బీ వీసాల జారీని అమెరికా కఠినం చేసింది. దీంతో ఈ వీసాలపై తక్కువ జీతాలకు తమ ఉద్యోగులను అమెరికా పంపించి ప్రాజెక్టులు పూర్తి చేయడం భారత కంపెనీలకు కష్టంగా మారింది. 2014-15 ఆర్థిక సంవత్సరంలో అమెరికా ప్రభుత్వం ఈ కంపెనీలకు 14,792 హెచ్-1బీ వీసాలు జారీ చేసింది. గత ఆర్థిక సంవత్సరానికి (2023-24) ఇది ఏకంగా 7,299కు పడిపోయింది. నేషనల్ ఫౌండేషన్ ఫర్ అమెరికన్ పాలసీ (ఎన్ఎఫ్ఏపీ) అనే సంస్థ ఈ వివరాలు వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం అమెరికా ఆమోదించిన మొత్తం హెచ్-1బీ వీసాల్లో భారతీయుల వాటా కేవలం 5.2 శాతం మాత్రమే. ప్రస్తుతం మొత్తం అమెరికా ఉద్యోగుల్లో హెచ్-1బీ వీసాలపై పని చేస్తున్న భారతీయుల శాతం కేవలం 0.004 శాతం మాత్రమే. డొనాల్డ్ ట్రంప్ రెండో జమానాలో హెచ్-1బీ వీసాల జారీని కఠినం చేస్తే ఇది మరింత పడిపోతుందని భావిస్తున్నారు. దీంతో అమెరికాలో ప్రాజెక్టులు చేపడుతున్న భారత కంపెనీలు అధిక జీతాలు ఇచ్చి స్థానికుల్ని ఉద్యోగాల్లో నియమించుకోక తప్పడం లేదు. ప్రాజెక్టులు సన్నగిల్లిన తరుణంలో ఇది తమపై అదనపు భారం మోపడమేనని కంపెనీలు వాపోతున్నాయి.

18 వేల మంది భారతీయులు వెనక్కి!

వాషింగ్టన్-నవభూమి: అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎన్నికల హామీ మేరకు లక్షలాది మంది అక్రమ వలసదారులను వారి సొంత దేశాలకు పంపించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మేరకు అమెరికా నుంచి పంపించాల్సిన 15 లక్షల మంది జాబితాను యూఎస్ ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఐసీఈ) సిద్ధం చేసింది. నవంబర్‌లో విడుదల చేసిన ఈ జాబితాలో 17,940 మంది భారతీయులు ఉన్నారు. తాను అధికారంలోకి వస్తే అక్రమ వలసదారులను వెనక్కు పంపడానికి అమెరికా చరిత్రలోనే అతి పెద్ద కార్యక్రమాన్ని చేపడతానని ట్రంప్ హామీ ఇచ్చారు.

జనవరి 20న ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆ తర్వాత అక్రమ వలసదారులను సొంత దేశాలకు పంపించే చర్యలను అమెరికా ప్రభుత్వం చేపట్టే అవకాశం ఉంది. కాగా, ప్యూ రిసెర్చ్ సెంటర్ అనే సంస్థ డాటా ప్రకారం అమెరికాలో 7.25 లక్షల మంది భారతీయులు అక్రమంగా నివసిస్తున్నారు. అమెరికాలోని అక్రమ వలసదారుల్లో మెక్సికో, ఎల్ సాల్వడర్ దేశాలకు చెందిన వారి తర్వాత భారతీయులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో 90 వేల మంది భారతీయులు అక్రమంగా అమెరికా సరిహద్దు దాటే ప్రయత్నంలో భద్రతా సిబ్బందికి చిక్కారు.

భారత్‌ను 'సహకరించని దేశం'గా పేర్కొన్న ఐసీఈ అక్రమ వలసదారులను దేశం నుంచి పంపేందుకు భారతీయ వ్యవస్థల నుంచి ఆలస్యం జరుగుతున్నదని పేర్కొన్న యూఎస్ ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఐసీఈ).. భారత్‌ను 'సహకరించని దేశం' విభాగంలో చేర్చింది. అమెరికా నుంచి అక్రమ వలసదారులను వారి సొంత దేశాలకు పంపే క్రమంలో సహకరించని, వారిని దేశంలోకి అనుమతించని దేశాలను ఈ జాబితాలో ఐసీఈ చేరుస్తున్నది. ఇప్పటివరకు భారత్, చైనా, పాకిస్థాన్ సహా 15 దేశాలను ఈ జాబితాలో చేర్చింది.

అందని ద్రాక్షలా హెచ్-1బీ వీసాలు

అమెరికాలో ఉద్యోగం చేసేందుకు ఇతర దేశాలకు చెందిన నిపుణులకు ఇచ్చే హెచ్-1బీ వీసాలు భారీగా తగ్గిపోతున్నాయి. ఈ వీసాల కోసం అమెరికాలోని కంపెనీలు ముందుగా పిటిషన్లు పెట్టుకుంటే ప్రభుత్వం ఆమోదం తెలుపుతుంది. గత కొన్నేండ్లుగా భారతీయ ఐటీ కంపెనీలకు హెచ్-1బీ వీసా అప్రూవల్స్ తగ్గిపోతున్నాయి. అమెరికాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఏడు ప్రముఖ భారతీయ ఐటీ కంపెనీలకు 2015 ఆర్థిక సంవత్సరంలో 14,792 హెచ్-1బీ వీసాలకు ఆమోదం రాగా, 2024 ఆర్థిక సంవత్సరంలో కేవలం 7,299 మాత్రమే వచ్చాయి. అధికారిక డాటాను విశ్లేషించిన అమెరికాకు చెందిన నేషనల్ ఫౌండేషన్ ఫర్ అమెరికన్ పాలసీ(ఎన్ఎఫ్ఏపీ) అనే సంస్థ ఈ విషయాన్ని వెల్లడించింది. 2024 ఆర్థిక సంవత్సరంలో అమెరికా ఇచ్చిన మొత్తం హెచ్-1బీ వీసా అప్రూవల్స్‌లో ఏడు ప్రధాన భారతీయ సంస్థలకు దక్కింది కేవలం 5.2 శాతం మాత్రమే. ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తర్వాత తిరస్కరణ శాతం భారీగా పెరిగే అవకాశం ఉందనే అంచనాలు ఉన్నాయి. దీంతో హెచ్-1బీ వీసాలు మరిన్ని తగ్గే అవకాశం ఉంది.

ఈవీఎం ఆలయం నిర్మాణం కోసం.. మహాయుతి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి: సంజయ్ రౌత్

ముంబై-నవభూమి: మహారాష్ట్రలో కొత్తగా కొలువైన బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి ప్రభుత్వంపై శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ మండిపడ్డారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఈవీఎం) ఆలయం నిర్మించడంపై తొలి కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకోవాలని ఎద్దేవా చేశారు. శనివారం మీడియాతో సంజయ్ రౌత్ మాట్లాడారు. 'తొలుత సీఎం నేతృత్వంలో అక్కడ (నాగ్‌పూర్‌లో) ఈవీఎంలతో ఊరేగింపు నిర్వహించాలి. నాగ్‌పూర్‌లోని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం ముందు ఈవీఎంల ఆలయాన్ని నిర్మించే నిర్ణయం కూడా తొలి కేబినెట్ సమావేశంలో సీఎం తీసుకోవాలని భావిస్తున్నా' అని అన్నారు.కాగా, కొత్తగా ఏర్పాటైన మహాయుతి ప్రభుత్వం క్యాబినెట్ బాధ్యతలపై ఇంకా నిర్ణయం తీసుకోలేక పోయిందని సంజయ్ రౌత్ విమర్శించారు. మహారాష్ట్రలో హత్యలు, అత్యాచారాలు రాజ్యమేలుతున్నాయని ఆరోపించారు. 'రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు కావస్తున్నా ఎవరికి ఏ శాఖ ఉందో తెలియడం లేదు. మహారాష్ట్రలోని గ్రామాల్లో ప్రతిరోజూ హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నాయి. దీనికి సీఎం సమాధానం చెప్పలేకపోతున్నారు. మహారాష్ట్రలో అరాచకాలు విస్తరించాయి. ఈ ప్రభుత్వం ఈవీఎంలతో ఏర్పడింది. వారికి బ్రెయిన్ లేదు. వారి మెదళ్లలో ఈవీఎంలు ఉన్నాయి' అని సంజయ్ రౌత్ విమర్శించారు.

చలో ఢిల్లీ మార్చ్‌ను అడ్డుకున్న పోలీసులు.. రైతులపై బాష్పవాయువు ప్రయోగం

న్యూఢిల్లీ-నవభూమి: తమ డిమాండ్ల పరిష్కారానికై రైతులు మరోసారి ఉద్యమబాట పట్టారు. ఇవాళ మధ్యాహ్నం 'చలో ఢిల్లీ' మార్చ్‌ను ప్రారంభించారు. కనీస మద్దతు ధర సహా 11 డిమాండ్ల సాధన కోసం 101 మంది రైతులు ఈ మార్చ్‌లో పాల్గొన్నారు.అయితే, రైతులను శంభు సరిహద్దు వద్ద హర్యాణా పోలీసులు అడ్డుకున్నారు. రైతులపై బాష్పవాయువు జల ఫిరంగులను ప్రయోగించారు. దీంతో సరిహద్దు వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇక రైతుల ఢిల్లీ చలో మార్చ్‌ను అడ్డుకోవడం ఇది మూడోసారి. డిసెంబర్ 6 నుంచి ఢిల్లీ వైపుకు వెళ్లేందుకు రైతులు ప్రయత్నించగా.. ఇప్పటికే ఆ ప్రయత్నాలను రెండుసార్లు పోలీసులు అడ్డుకున్న విషయం తెలిసిందే. దీంతో పోలీసుల తీరుపై రైతులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక రైతుల ఢిల్లీ మార్చ్ నేపథ్యంలో హర్యాణా ప్రభుత్వం అప్రమత్తమైంది. ముందు జాగ్రత్త చర్యగా మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేసింది. శనివారం ఉదయం 6 గంటల నుంచి 17వ తేదీ అర్ధరాత్రి వరకూ సేవలు నిలిపివేస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది.

ఢిల్లీ పాఠశాలలకు మళ్లీ బాంబు బెదిరింపులు.. ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

న్యూఢిల్లీ-నవభూమి:దేశ రాజధాని ఢిల్లీలో మరోసారి బాంబు బెదిరింపులు కలకలం రేపాయి. శుక్రవారం దాదాపు 30 పాఠశాలలకు బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా శనివారం ఉదయం కూడా పలు స్కూళ్లకు ఇలాంటి బెదిరింపులే వచ్చాయి.ఆర్కేపురం, వసంత్ కుంజ్ ప్రాంతాల్లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సహా పలు పాఠశాలలు బెదిరింపులు వచ్చాయి. శనివారం ఉదయం 6:12 గంటల ప్రాంతంలో బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. దీంతో అప్రమత్తమైన ఆయా పాఠశాలల యాజమాన్యం వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు పాఠశాలల వద్దకు చేరుకొని విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సాయంతో పాఠశాలల ఆవరణల్లో తనిఖీలు చేశారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ లభించలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. కాగా, స్కూళ్లలో బాంబులు ఉన్నాయంటూ బెదిరింపులు రావడంతో ఈ వారంలో ఇది మూడోసారి కావడం గమనార్హం. వరుస బెదిరింపులతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

45 ఏళ్ల తరువాత తెరుచుకున్న శివాలయం

న్యూఢిల్లీ-నవభూమి: ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ జిల్లాలో జరిగిన హింసాకాండ ఇటీవల సంచలనం సృష్టించిన నేపథ్యంలో ఇదే జిల్లాలో 45 ఏళ్ల క్రితం నాటి ఒక పురాతన శివాలయం వెలుగు చూసింది. ఖగ్గు సరై లోని ఈ శివాలయం 1978 నుంచి మూతపడిందని, ఇన్నేళ్ల తర్వాత వెలుగుచూడటంతో సాంప్రదాయ రీతిలో తిరిగి ఆలయాన్ని తెరిచినట్టు నగర్ హిందూ సభ నిర్వాహకుడు విష్ణు శరణ్ రస్తోగి తెలిపారు. ఇక్కడ నివసించే కొన్ని కుటుంబాలు వేరేచోటికి వెళ్లిపోవడంతో అప్పటి నుంచి ఆలయాన్ని పట్టించుకునే వాళ్లే లేకపోయారని ఆలయ చరిత్రను వివరించారు.

ప్రభుత్వాన్ని రద్దు చేసి ఎన్నికలు నిర్వహించండి: అఖిలేష్

న్యూఢిల్లీ-నవభూమి:"వన్ నేషన్, వన్ ఎలక్షన్" బిల్లును ఈ సమావేశాల్లోనే ఆమోదించాలని ప్రభుత్వం తొందరపడుతుండటాన్ని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ నిలదీశారు. ఇంత అత్యవసరంగా జమిలి బిల్లును ఆమోదించాల్సి అవసరం ఏముందని ప్రశ్నించారు. మరీ అంత తొందర అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భావిస్తే ప్రభుత్వాన్ని తక్షణం రద్దు చేసి దేశవ్యాప్తంగా మరోసారి ఎన్నికలు నిర్వహించాలని అన్నారు."ప్రధానమంత్రికి మరీ అంత తొందర అనిపిస్తే ఈరోజే దేశంలోని ప్రభుత్వాలన్నింటిని రద్దు చేసి ఎన్నికలు నిర్వహించాలి" అని అఖిలేష్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ అన్నారు. భారత రాజ్యాంగం ఆమోదించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా లోక్‌సభలో నిర్వహించిన ప్రత్యేక చర్చలో ప్రధానమంత్రి మోదీ మాట్లాడనున్న నేపథ్యంలో అఖిలేష్ తాజా వ్యాఖ్యలు చేశారు.'వన్ నేషన్-వన్ ఎలక్షన్' బిల్లు ఈనెల 16న లోక్‌సభ ముందుకు వచ్చే అవకాశాలున్నాయి. 129వ రాజ్యాంగ సవరణ బిల్లు కింద జమిలి ఎన్నికల బిల్లును న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ప్రవేశపెట్టనున్నారు. అయితే ఈ బిల్లుపై విపక్షాల నుంచి అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నారు. ఈ విధానం ఆచరణ సాధ్యం కాదని కాంగ్రెస్ ఎంపీ దిగ్విజయ్ సింగ్ కొట్టివేశారు. ఏదైనా రాష్ట్రంలో ఒక ప్రభుత్వం ఏర్పడి ఆరునెలల తర్వాత కారణాంతరాల వల్ల మెజారిటీ కోల్పోతే ఆ తర్వాత నాలుగున్నరేళ్ల పాటు రాష్ట్రాన్ని ఎవరు పరిపాలిస్తారని ఆయన ప్రశ్నించారు. ప్రతిపాదిత బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపాలని మరో కాంగ్రెస్ ఎంపీ జైరామ్ రమేష్ డిమాండ్ చేశారు. ఈ బిల్లు సమాఖ్య, ప్రజాస్వామిక సిద్ధాంతాలను బలహీనపరుస్తుందన్నారు.

కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఇళంగోవన్ కన్నుమూత

చెన్నై-నవభూమి: కాంగ్రెస్ సీనియర్ నేత, తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) మాజీ అధ్యక్షుడు ఈవీకేఎస్ ఇళంగోవన్ శనివారం ఉదయం చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయన వయస్సు 75 సంవత్సరాలు. ఈరోడ్ ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇళంగోవన్ గత నెల రోజులుగా అస్వస్థతతో ఉన్నారు. ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలతో నవంబర్ 11న ఆయన ఆసుపత్రిలో చేరారు. వైద్యులు మెరుగైన వైద్యచికిత్స అందించినప్పటికీ ఆయన ఉదయం 10.12 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఇళంగోవన్ మృతి పట్ల తమిళనాడు కాంగ్రెస్ సంతాపం తెలిపింది. ఆయన మృతి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని సంతాప సందేశంలో పేర్కొంది.

ప్రఖ్యాత సామాజిక సంస్కర్త ఈవీ రామస్వామి మనుమడు, డీఎంకే వ్యవస్థాపకుడు ఈవీకే సంపత్ కుమారుడైన ఇళంగోవన్ 1980లో కాంగ్రెస్‌లో చేరడంతో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1994లో గోపిచెట్టిపాలయం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనంతరం 2004లో పార్లమెంటు సభ్యుడిగా పనిచేశారు. టీఎన్‌సీసీ అధ్యక్షుడిగా డీఎంకే, అన్నాడీఎంకే నుంచి ఎదురైన సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నారనే పేరు ఆయనకు ఉంది. 2016లో కాంగ్రెస్-డీఎంకే పొత్తును పునరుద్ధరించడంలో కీలక పాత్ర పోషించారు. 2016 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 48 సీట్లు గెలుచుకుంది. పి.చిదంబరం 'కాంగ్రెస్ జననాయగ పెరవై' పార్టీని 2004లో కాంగ్రెస్‌లో విలీనం చేయించి ఆయనను పార్టీలోకి తీసుకురావడంలో ఇళంగోవన్ కృషి ఉంది.

శంభు సరిహద్దుల్లో మరోసారి ఉద్రికత.. బాష్పవాయువు, జల ఫిరంగులతో అడ్డుకున్న పోలీసులు

న్యూఢిల్లీ-నవభూమి: రైతులు మరోసారి 'ఢిల్లీ చలో' మార్చ్ తలపెట్టడంలో పంజాబ్-హర్యానా సరిహద్దు ప్రాంతంలోని శంభు వద్ద శనివారం మధ్యాహ్నం మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కనీస మద్దతు ధర సహా పలు డిమాండ్ల సాధన కోసం 101 మంది రైతులు ఢిల్లీ వైపు వెళ్లేందుకు ప్రయత్నించడంతో వారిని శంభు సరిహద్దు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ప్రదర్శకులు ముందుకు రాకుండా బాష్పవాయువు, జల ఫిరంగులను ప్రయోగించారు. తమ డిమాండ్ల సాధనం కోసం రైతులు చేపట్టిన నిరసన కార్యక్రమం శనివారంతో 307వ రోజుకు చేరింది.భద్రతా కారణాలను ఉటంకిస్తూ రైతులు ముందుకు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేయడంతో.. శాంతియుతంగా తాము ఢిల్లీ మార్చ్ నిర్వహిస్తామని రైతు నేతలు విజ్ఞప్తి చేశారు. "మా నిరసనలకు అడ్డుపడకండి. మాకు వెళ్లేందుకు రోడ్డు ఇవ్వండి. ఇనుప బారికేడ్లు, రాతి బారికేడ్లు మా గొంతును అణిచివేయలేవు" అని రైతు నేత ఒకరు విజ్ఞప్తి చేశారు. దేశంలోని 50 శాతం రైతులు వ్యవసాయంపైనే ఆధారపడి బతుకుతున్నారని, వారి గొంతును అణిచివేయలేరని చెప్పారు. ఖనౌరి సరిహద్దు వద్ద సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర) రైతు నేత జగ్జిత్ సింగ్ దల్లెవాల్ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారని, ఆయన ఆరోగ్యం ప్రధానితో సహా అందరి కళ్ల ముందే క్షీణిస్తోందని ఆయన వాపోయారు. తాము జెండాలు, దుస్తులతో మాత్రమే చలో ఢిల్లీ వెళుతున్నామని, కావాలంటే తమను క్షుణ్ణంగా సోదాలు చేసుకోవచ్చని, తాము కేవలం సమస్యలపై ప్రభుత్వంతో మాట్లాడేందుకే ఢిల్లీ వెళ్తున్నామని ఆయన వివరించారు.

అనుమతి తెచ్చుకుంటేనే...

ైతు నేతల విజ్ఞప్తులపై అంబాలా ఎస్‌పీ స్పందిస్తూ, రైతులు ఢిల్లీకి వెళ్లాలనుకుంటే తగిన అనుమతి తీసుకోవాలని, అప్పుడు వారిని అనుమతించేదుకు అభ్యంతరం లేదని చెప్పారు. కాగా, శనివారం మళ్లీ ఢిల్లీ చలో యాత్రను చేపడుతున్నట్టు రైతు నేతలు ప్రకటించడంతో హర్యానా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. మొబైల్ ఇంటర్నెట్ సేవలు నిలిపివేసింది. సరిహద్దుల వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించింది. సుప్రీంకోర్టు విచారణకు కొంత సమయం పడుతుందని, అందువల్ల రైతులు తాత్కాలికంగా తమ నిరనలు తెలిపివేయాలని హర్యానా మంత్రి అనిల్ విజ్ శనివారంనాడు కోరారు.

అమిత్ షాకి అరవింద్ కేజ్రీవాల్ లేఖాస్త్రం

న్యూఢిల్లీ-నవభూమి: దేశ రాజధాని న్యూఢిల్లీలో శాంతి భద్రతలు పూర్తిగా కుప్పకూలాయని మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతోన్న నేరాల్లో ఢిల్లీ మహానగరం దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. దేశవ్యాప్తంగా మొత్తం 19 మెట్రో నగరాలు ఉంటే.. వాటిలో నేరాల్లో ఢిల్లీ తొలి స్థానంలో నిలిచిందన్నారు. ఇది కలవరపాటుకు గురి చేస్తుందని తెలిపారు. ఎయిర్‌పోర్టులు, స్కూళ్లకు బాంబు బెదిరింపులు పెరిగాయని.. అలాగే బెదిరించి డబ్బులు దండుకొనే గ్యాంగ్‌లు సైతం అధికమయ్యాయని.. అలాగే మాదక ద్రవ్యాలకు సంబంధించిన నేరాలు 350 శాతం మేర ఢిల్లీలో పెరిగాయని గుర్తు చేశారు.

ఇవి ఆందోళన కలిగిస్తున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో ఈ అంశాలపై కలిసి చర్చించేందుకు సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి అమిత్ షాకు మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం కేంద్ర మంత్రి అమిత్ షాకు అరవింద్ కేజ్రీవాల్ లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఢిల్లీలోని శాంతి భద్రతల పరిస్థితి పూర్తిగా క్షీణించడమే కాకుండా.. నేరాల రాజధానిగా మారిపోయిందని అమిత్ షాకు రాసిన లేఖలో కేజ్రీవాల్ అభివర్ణించారు.మరోవైపు ఈ వారం ప్రారంభంలో అమిత్ షా లక్ష్యంగా చేసుకొని ట్విట్టర్ వేదికగా అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. అమిత్ షా ఢిల్లీని నాశనం చేశారన్నారు. ఢిల్లీని జంగిల్ రాజ్‌గా మార్చారని విమర్శించారు. ఎక్కడ చూసినా ప్రజలు.. భయానక జీవితాన్ని గడుపుతున్నారన్నారు. ఢిల్లీలో శాంతి భద్రతలను సరిగ్గా నిర్వహించే లేకపోతుందంటూ బీజేపీపై ఆగ్రహం వ్యక్తం చేశారు.2025, ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మరోసారి ఢిల్లీలో పాగా వేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. మరోవైపు కేజ్రీవాల్ పాలనకు గండి కొట్టాలని బీజేపీ సైతం ఓ స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్తుంది.

అమెరికాలో ఓపెన్‌ఏఐ విజిల్‌బ్లోయర్ సుచిర్ బాలాజీ ఆత్మహత్య

న్యూఢిల్లీ-నవభూమి:భారత సంతతికి చెందిన ఓపెన్‌ఏఐ మాజీ ఉద్యోగి సుచిర్ బాలాజీ(ఆత్మహత్య చేసుకున్నాడు. శాన్‌ఫ్రాన్సిస్‌కోలో 26 ఏళ్ల ఆ వ్యక్తి అనుమానాస్పద రీతిలో మరణించాడు. నగరంలోని బుచానన్ స్ట్రీట్ అపార్ట్‌మెంట్‌లో సుచిన్ బాలాజీ మృతదేహాన్ని గుర్తించారు. అతను సూసైడ్ చేసుకున్నట్లు మెడికల్ ఆఫీసర్ తెలిపారు. మరణం వెనుక ఎటువంటి ఆధారాలు లేవని పోలీసులు చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో పేరుగాంచిన ఓపెన్‌ఏఐ సంస్థలో జరుగుతున్న అక్రమాలను సుచిర్ బాలాజీ వెలుగులోకి తెచ్చాడు. ఆ కంపెనీ అనుసరిస్తున్న వ్యాపార విధానంపై ఇప్పటికే పలు దావాలు దాఖలు అయ్యాయి.ఓపెన్‌ఏఐ సంస్థ అమెరికా కాపీరైట్ చట్టాలను ఉల్లంఘించినట్లు మూడు నెలల క్రితం సుచిర్ బాలాజీ ఆరోపించారు. ఆ కంపెనీ అక్రమరీతిలో చాట్‌జీపీటీ డెవలప్ చేసినట్లు అతను పేర్కొన్నాడు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రోగ్రామ్‌కు చెందిన చాట్‌జీపీటీ టెక్నాలజీ ద్వారా ప్రస్తుతం లక్షలాది మంది డబ్బులు ఆర్జిస్తున్నారు. ఓపెన్‌ఏఐ సంస్థ వ్యాపారవేత్తలను, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను వేధిస్తున్నట్లు బాలాజీ ఆరోపించారు. సమాజానికి హాని చేసే సంస్థలో ఉండకూడదన్న ఉద్దేశంతో ఓపెన్‌ఏఐ సంస్థను బాలాజీ వదిలివెళ్లాడు.

క్రీమ్ లాంటి వ్యాక్సిన్! సూది ఉండదు.. నొప్పి తెలియదు

న్యూయార్క్-నవభూమి:సూది అవసరం లేని, క్రీమ్‌లా రాసుకునే సరికొత్త వ్యాక్సిన్ విధానాన్ని అమెరికాలోని స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. వ్యాధులు సోకకుండా నివారించడానికి వేసే వ్యాక్సిన్‌ల వల్ల సాధారణంగా నొప్పి, జ్వరం వంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి. ఈ కొత్త విధానం ద్వారా ఇలాంటి సైడ్ ఎఫెక్ట్స్ దాదాపుగా ఉండవని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. స్టఫిలోకాకస్ ఎపిడెర్మిడిస్ వంటి సాధారణ చర్మ బ్యాక్టీరియా ఆధారంగా వ్యాక్సిన్‌లను శరీరానికి ఇవ్వొచ్చని వీరు ప్రతిపాదిస్తున్నారు. శాస్త్రవేత్తలు ఈ బ్యాక్టీరియాను మాడిఫై చేసి ధనుర్వాతానికి కారణమయ్యే రసాయనంతో కలిపి ఎలుక చర్మంపై పూయగా, దాని శరీరంలో పెద్ద సంఖ్యలో యాంటీబాడీలు ఉత్పత్తి అయ్యాయని గుర్తించారు.

ఆ తర్వాత ఈ రసాయనాన్ని ఎలుకకు నేరుగా ఇవ్వగా యాంటీబాడీలు అప్రమత్తమై దాని ప్రభావం లేకుండా చేశాయి. భవిష్యత్తులో ఇలాంటి సాధారణ చర్మ బ్యాక్టీరియాలను వ్యాక్సిన్లతో మాడిఫై చేసి క్రీమ్‌లా చర్మంపై పూయడం ద్వారా శరీరంలో యాంటీబాడీలను ఉత్పత్తి చేయవచ్చని ప్రొఫెసర్ మైఖేల్ ఫిష్బాచ్ తెలిపారు. ఎలుకలపై తమ కొత్త విధానం పని చేసిందని, తర్వాత కోతులపై ఈ పరీక్షలు జరుపుతామని చెప్పారు. భవిష్యత్తులో ఈ విధానం సూది, నొప్పి లేని వ్యాక్సిన్ల అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు.

అవసరమైన అవయవానికే మందు ఔషధాన్ని తీసుకెళ్లే సూక్ష్మ కణాలు



జురిచ్-నవభూమి:శరీరంలోని అవసరమైన అవయవానికే నేరుగా ఔషధాన్ని అందించే సూక్ష్మ కణాలను స్విట్జర్లాండ్‌లోని ఈటీహెచ్ విద్యాసంస్థకు చెందిన శాస్త్రవేత్తలు తయారు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు 'అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. సాధారణంగా టాబ్లెట్, ఇంజక్షన్ ద్వారా ఇచ్చే ఔషధం నేరుగా అవసరమైన అవయవానికి వెళ్లకుండా శరీరమంతా ప్రయాణిస్తుంది. ఈ సూక్ష్మ కణాల ద్వారా ఇచ్చే ఔషధం మాత్రం నేరుగా అవసరమైన అవయవానికి అందుతుంది. జింక్ ఆక్సైడ్‌తో శాస్త్రవేత్తలు ఈ మైక్రోపార్టికల్స్‌ను తయారుచేశారు.ఔషధంతో కూడిన ఈ సూక్ష్మ కణాలను ఇంజక్షన్ ద్వారా రక్తంలోకి పంపించి, అల్ట్రాసౌండ్ విధానం ద్వారా బయటినుంచి అవసరమైన శరీర భాగానికి పంపించవచ్చని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. దీని ద్వారా సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని, అధిక డోస్ ఇవ్వాల్సిన అవసరం ఉండదని తెలిపారు. క్యాన్సర్, గుండెజబ్బులు ఉన్న రోగులకు ఈ కొత్త సాంకేతికత ఉపయోగకరంగా ఉంటుందని వెల్లడించారు. గుండ్రంగా ఉండే సాధారణ సూక్ష్మ కణాల కంటే పూలలా కనిపించే ఈ సూక్ష్మ కణాలతో ఎక్కువ మోతాదులో ఔషధాన్ని శరీరానికి అందించవచ్చని చెప్పారు. ఎలుకలపై చేసిన పరీక్షలు విజయవంతమైనట్టు తెలిపారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
8 హైదరాబాద్ ఆదివారం 15 డిసెంబర్ 2024

ఈ ఘటనలో మీడియా తప్పు లేదు : మంచు మనోజ్

మంచు ఫ్యామిలీలో జరుగుతున్న గొడవల నేపథ్యంలో సినీ నటుడు మంచు మోహన్ బాబు జర్నలిస్ట్‌పై దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దాడి ఘటనలో జర్నలిస్ట్‌కు తీవ్రగాయాలు కాగా.. మోహన్ బాబు క్షమాపణలు చెప్పాలి అంటూ జర్నలిస్ట్ సంఘాలు అన్నీ ధర్నా చేయడం మొదలు పెట్టాయి. ఇప్పటికే ఈ ఘటనకు సంబంధించి మోహన్ బాబు క్షమాపణలు తెలుపగా.. తాజాగా

ఈ విషయంపై నటుడు మంచు మనోజ్ స్పందించాడు. ఈ ఘటనలో మీడియా తప్పు లేదు. నిస్సహాయ స్థితిలో నేను మీడియాను లోపలికి తీసుకువెళ్లాను. మా ఇంట్లోకి నన్ను అనుమతించకపోవడంతోనే మీడియా ప్రతినిధులను వెంటబెట్టుకుని తీసుకువెళ్లా. లోపలికి వెళ్లిన అనంతరం తనపై దాడి జరిగింది. ఈ ఘటనలో అసలు మీడియా తప్పు లేదు అంటూ మనోజ్ చెప్పుకొచ్చాడు.

బ్రదర్స్ ఇద్దరితోనూ ఒకేసారి శ్రీలీల సినిమాలు..!

రాఘవేంద్రరావు కొత్త పెళ్లి సందడి సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ శ్రీలీల. ఆ సినిమా డిజాస్టర్‌గా నిలిచినా తెలుగు ప్రేక్షకులకు శ్రీలీల నచ్చింది. అందుకే రవితేజకు జోడీగా ధమాకా సినిమాలో నటించే అవకాశం దక్కించుకుంది. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో చాలా సినిమాల్లో నటించే అవకాశాలు వచ్చాయి. ఏకంగా సూపర్ స్టార్ మహేష్ బాబుకు జోడీగా త్రివిక్రమ్ దర్శకత్వంలో గుంటూరు కారం సినిమాలో ఈ అమ్మడు నటించిన విషయం తెల్సిందే. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద నిరాశ పరిచిన మంచి పేరు మాత్రం దక్కించుకుంది. అందుకే ఈ అమ్మడికి మరిన్ని ఆఫర్లు వస్తున్నాయి. ప్రస్తుతం ఈ అమ్మడు నితిన్‌కి జోడీగా నటించిన రాబిన్‌హుడ్ సినిమా విడులకు సిద్ధంగా ఉంది. సంక్రాంతి కానుకగా ఆ సినిమా వచ్చే అవకాశాలు ఉన్నాయి. రాబిన్‌హుడ్ కాకుండా ఇంకా పలు సినిమాల్లో ఈ అమ్మడు నటిస్తోంది, మరికొన్ని చర్చల దశలో ఉన్నాయి. ఇటీవలే నాగ చైతన్య హీరోగా కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో రూపొందబోతున్న సినిమాలో శ్రీలీల హీరోయిన్‌గా ఎంపిక అయ్యింది. త్వరలోనే ఆ సినిమా షూటింగ్‌లో శ్రీలీల జాయిన్ కాబోతుంది అంటూ ఆమె సన్నిహిత వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. ఇటీవల నాగ చైతన్యతో నటించేందుకు ఎంపిక అయిన శ్రీలీల అనూహ్యంగా అఖిల్ అక్కినేనితో కలిసి నటించే అవకాశంను దక్కించుకుంది. వినరో భాగ్యము విష్ణు కథ దర్శకుడు మురళీ కిషోర్ అబ్బురు దర్శకత్వంలో అఖిల్ అక్కినేని సినిమా రూపొందబోతుంది. అందుకు సంబంధించిన చర్చలు ముగింపు దశకు చేరుకున్నాయి. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌లో రూపొందబోతున్న వీరి కాంబో మూవీలో హీరోయిన్‌గా శ్రీలీలను ఎంపిక చేయడం జరిగిందనే వార్తలు వస్తున్నాయి. ఇదే నిజం అయితే ఒకేసారి ఇద్దరు అక్కినేని బ్రదర్స్‌తో సినిమా చేసే అవకాశం దక్కించుకున్న హీరోయిన్‌గా శ్రీలీల నిలువబోతుంది. బన్నీ అరెస్ట్ పై నార్త్ ఆడియన్స్ ని రియాక్షన్! శ్రీలీల ఇటీవల పుష్ప 2 లో కిస్సిక్ అంటూ భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఐటెం సాంగ్స్‌లో నటించను అంటూనే అల్లు అర్జున్, సుకుమార్‌లపై శ్రీలీల ఆ పాటలో నటించి మెప్పించింది. అల్లు అర్జున్‌తో సమానంగా శ్రీలీల వేసిన డాన్స్‌కి ప్రేక్షకులు ఫిదా అవుతున్నారు. ఒక వైపు హీరోయిన్‌గా వరుసగా సినిమాలు వస్తున్న సమయంలో ఐటెం సాంగ్ లో నటించడం అనేది చాలా పెద్ద విషయం. ఆకట్టుకునే అందంతో పాటు మంచి డాన్సర్ కమ్ నటి అయిన శ్రీలీల ముందు ముందు మరింత మంది స్టార్ హీరోలతో సినిమాలు చేసే అవకాశాలు రావాలని ఆమె ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. చైతూ, అఖిల్‌ల సినిమాలు వచ్చే ఏడాదిలోనే ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

అరెస్ట్‌తో అల్లు అర్జున్‌కు తెలంగాణ ప్రభుత్వం రిటర్న్ గిఫ్ట్..! రేవంత్ సర్కారుపై రాంగోపాల్ వర్మ సెటైరికల్ ట్వీట్..!

టాలీవుడ్ స్టార్ నటుడు అల్లు అర్జున్ అరెస్ట్ వ్యవహారంపై ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మ స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం తీరుపై ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రానికి బన్నీ గొప్ప బహుమతి ఇస్తే.. అరెస్ట్ చేసి రిటర్న్ గిఫ్ట్ ఇచ్చిందంటూ విమర్శించారు. 'తెలంగాణ నివాసి అయిన అల్లు అర్జున్ భారత్‌లోనే బిగ్గెస్ట్ స్టార్. భారతీయ సినిమా చరిత్రలో భారీ హిట్ కొట్టి రాష్ట్రానికి గొప్ప బహుమతి అందిచారు. కానీ, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఆయనను జైలుకు పంపి బన్నీకి రిటర్న్ గిఫ్ట్ ఇచ్చింది' అంటూ రాంగోపాల్ వర్మ ట్వీట్ చేశారు. ప్రస్తుతం ఆయన చేసిన ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో అల్లు అర్జున్‌ను అరెస్టు చేసిన సమయంలో రాంగోపాల్ వర్మ స్పందించారు. అల్లు అర్జున్‌ని అరెస్ట్ చేసిన అధికారులకు నాలుగు ప్రశ్నలు సంధించారు. పుష్కరాలు, బ్రహ్మోత్సవాల్లో తోపులాటలో భక్తులు పోతే దేవుళ్లను అరెస్ట్ చేస్తారా? ఎన్నికల ప్రచారాల తొక్కిసలాటల్లో ఎవరైనా చనిపోతే రాజకీయ నాయకులను అరెస్ట్ చేస్తారా? ప్రీ రిలీజ్ ఫంక్షన్స్‌లో ఎవరైనా పోతే హీరో, హీరోయిన్లని అరెస్ట్ చేస్తారా..? భద్రత ఏర్పాట్ల అంశం పోలీసులు, ఆర్గనైజర్లదే తప్ప సినిమా హీరోలు, ప్రజా నాయకులు ఎలా కంట్రోల్ చేయగలరు? అంటూ ప్రశ్నించారు. ఇదిలా ఉండగా.. సంధ్య థియేటర్ కేసులో శుక్రవారం అల్లు అర్జున్ అరెస్టయ్యారు. ఈ కేసులో నాంపల్లి కోర్టు ఆయనకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. తెలంగాణ హైకోర్టు ఆయనకు మధ్యంతర బెయిల్ ఇచ్చిన విషయం తెలిసిందే. బెయిల్ పత్రాలు సకాలంలో అందడం ఆలస్యం కావడంతో అల్లు అర్జున్ శనివారం చర్లపల్లి జైలు నుంచి విడుదలయ్యారు.

రాజమౌళి- రమ మరో పుష్ప-శ్రీవల్లిలా సై సై సోకులకు అంటూ

ఇటీవలే పుష్పరాజ్ వీరవిహారం పెద్ద తెరపై చూసాం. పుష్ప2 సినిమాలో యాక్షన్ కంటెంట్ కంటే భావోద్వేగాలు, భార్యాభర్తల అనుబంధం, రొమాన్స్ పాళ్లు సుకుమార్ కొంచెం ఎక్కువే కలిపారు. నిజానికి పుష్ప 2 విజయానికి ఇవే ప్రధాన అస్సెట్ గా మారాయి. పుష్ప 2లో అల్లు అర్జున్ – రష్మిక మందన్న మధ్య మరోసారి అద్భుతమైన కెమిస్ట్రీ వర్కవుటైంది. పాటల్లోను ఈ జంట అద్భుతమైన హుక్ స్టెప్పులతో అలరించడమే గాక, అసభ్యతకు తావులేని చక్కని రొమాన్స్ తోను ఆకట్టుకున్నారు. అంటే....పుష్పలో పుష్పరాజ్– శ్రీవల్లి నడుమ ఉన్న అన్యోన్యత అనుబంధం మళ్లీ ఇదిగో ఇక్కడ వేదికపై కనిపిస్తున్న జంట నడుమ కనిపించింది. ఈ పాపులర్ లవ్ కపుల్ ఎవరో ప్రత్యేకించి చెప్పాల్సిన పని లేదు. భారతదేశంలో నంబర్ వన్ దర్శకుడిగా చరిత్ర సృష్టించిన దర్శకధీరుడు రాజమౌళి, అతడి సతీమణి రమ.. ఈ ఇద్దరూ వేదికపై ఇలా డ్యాన్సులు చేస్తుంటే నిజంగానే అభిమానులు ఉద్వేగానికి లోనవుతున్నారు. సై సై సోకులకు అంటూ చంటిగాడు పాటకు మాస్ స్టెప్పులతో ఆకట్టుకున్నారు రాజమౌళి. ఇది చూశాక.. జక్కన్నలో ఇంత మంచి డ్యాన్సర్ ఉన్నాడా? అని కొందరు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్.ఎస్.రాజమౌళి ముందే రిహార్సల్ చేసిన తర్వాత ఇలా రమాతో కలిసి వేదికపై స్టెప్పులు అదరగొట్టారని కూడా వ్యాఖ్యానిస్తున్నారు. ఏది ఏమైనా ఇది కేవలం టీవీ షో మాత్రమే అయినా కానీ, జక్కన్న ఆయన సతీమని మధ్య స్టెప్పుల సింక్‌ని చూసి అంతా ఆశ్చర్యపోతున్నారు. ముఖ్యంగా రాజమౌళి ఇందులో పుష్పరాజ్ రేంజులో లెగ్ మూవ్ మెంట్ కూడా చేసి చూపించారు. ఆయన అభిమానులకు ఇది గొప్ప విజువల్ ట్రీట్ అనడంలో సందేహం లేదు. తదుపరి మహేష్‌తో సినిమాని రెండేళ్ల తర్వాతే విడుదల చేస్తాడు కాబట్టి అప్పటివరకూ అభిమానులకు ఇది మాత్రమే ట్రీట్.

నీ నుంచి ఎంతో స్ఫూర్తి పొందాను.. రానాకు సమంత బర్త్‌డే విషెస్

రానా దగ్గుబాటి పుట్టినరోజు నేడు. ఈ సందర్భంగా అభిమానులు ఆయనకు సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఇదే సమయంలో సినీ సెలబ్రిటీలు సైతం రానాకు విషెస్ తెలుపుతున్నారు. ఈ క్రమంలో స్టార్ నటి సమంత సైతం రానాకు ప్రత్యేకంగా బర్త్‌డే విషెస్ తెలియజేశారు. 'హ్యాపీ బర్త్ డే రానా. నువ్వు చేసే ప్రతి పనిలోనూ వంద శాతం ఫోకస్ పెడుతుంటావు. ఈ విషయంలో నీ నుంచి నేను ఎంతో స్ఫూర్తి పొందాను. నేను ఎప్పటికీ నీ అభిమానినే. దేవుడు ఆశీర్వాదులు నీకు ఎప్పుడూ ఉండాలి' అంటూ ఇన్‌స్టా వేదికగా పోస్టు పెట్టారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. కాగా, రానా ప్రస్తుతం సరికొత్త టాక్ షోతో ప్రేక్షకులను అలరిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే 'నం1 యారి' అంటూ ఓటీటీలో సందడి చేసిన రానా.. ఇప్పుడు 'ది రానా దగ్గుబాటి షో' అనే పేరుతో అభిమానులను అలరిస్తున్నాడు. ఈ షో ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లో నవంబర్ 23 నుంచి స్ట్రీమింగ్ అవుతోంది.

బంతి స్వింగ్ అవడం లేదు.. స్టంప్ కెమెరాల్లో బుమ్రా మాటలు రికార్డు..!

న్యూదిల్లీ–నవభూమి: బోర్డర్ గవాస్కర్ టెస్ట్ సిరీస్‌లో భాగంగా బ్రిస్బేన్ వేదికగా మూడో టెస్ట్ ప్రారంభమైంది. గబ్బా టెస్ట్‌లో తొలిరోజు వర్షం కారణంగా కేవలం 13.2 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. అయితే, గబ్బా పిచ్ పేసర్లకు అనుకూలించే అవకాశం ఉండడంతో కెప్టెన్ రోహిత్ శర్మ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్నాడు. అయితే, గబ్బా పిచ్ ఫాస్ట్ బౌలర్లకు పెద్దగా అనుకూలించలేదు. టీమిండియా బౌలర్లు 13.2 ఓవర్లు వేసినా ఒక్క వికెట్ తీయలేకపోయారు. బ్రిస్బేన్‌లో ఆకాశం మేఘావృతమై ఉండడంతో పాటు పిచ్‌పై గడ్డి ఉండడంతో వికెట్‌కు అనుకూలంగా ఉంటుందని భావించారు. అయితే, బుమ్రా, సిరాజ్ విసిరిన బంతులు ఏమాత్రం స్వింగ్ కాకపోవడంతో బౌలర్లు కాస్త నిరాశకు గురయ్యారు. బంతి స్వింగ్ అవడం లేదని బుమ్రా చెప్పిన మాటలు స్టంప్ మైక్‌లో రికార్డయ్యాయి. మూడో టెస్ట్‌లో తొలిరోజు ఆటముగిసే సరికి 13.2 ఓవర్లలో ఆస్ట్రేలియా జట్టు వికెట్ నష్టపోకుండా 28 పరుగులు చేసింది. ఉస్మాన్ ఖవాజా 19 పరుగులతో, నాథన్ మెక్‌స్వీనీ నాలుగు పరుగులతో నాటౌట్‌గా ఉన్నారు. తొలిరోజు వర్షం అంతరాయం కలగడంతో రెండోరోజు ఆదివారం 98 ఓవర్లు వేయనున్నారు. మ్యాచ్ నిర్ణీత సమయానికంటే అరగంటే ముందే మొదలుకానున్నది. రెండో రోజు మ్యాచ్ భారత కాలమానం ప్రకారం ఉదయం 5.20 ప్రారంభం కానున్నాయి.

ఒకరి ప్రేమ దక్కినప్పుడు మనమూ తిరిగి ప్రేమించాలి.. ఎంగేజ్‌మెంట్ ఫొటో షేర్ చేస్తూ పీవీ సింధూ పోస్ట్..!

న్యూదిల్లీ–నవభూమి: స్టార్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు ఎంగేజ్‌మెంట్ ఘనంగా జరిగింది. వెంకట దత్తసాయితో త్వరలోనే వివాహం జరుగనున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎంగేజ్‌మెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీ సింధు, వెంకట దత్తసాయి రింగ్స్ మార్చుకున్నారు. ఎంగేజ్‌మెంట్ ఫొటోను సింధు ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో పంచుకున్నది. ఈ సందర్భంగా 'ఒకరి ప్రేమనకు దక్కిన సమయం లో.. తిరిగి మనం ప్రేమించాలి' అని క్యాప్షన్‌తో ఫొటోను షేర్ చేసింది. ఎంగేజ్‌మెంట్ సందర్భంగా ఇద్దరూ కేక్ కట్ చేశారు. ఇక పీవీ సింధు వివాహ వేడుక ఈ నెల 22న రాజస్థాన్‌లో జరుగనున్న విషయం తెలిసిందే. ఉదయ్‌పూర్‌లోని ప్యాలెస్‌లో వివాహ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కాబోయే వరుడు హైదరాబాద్‌కు చెందిన ఐటీ ప్రొఫెషనల్. పొసిడెక్స్ టెక్నాలజీస్‌లో వెంకట దత్త సాయి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. వివాహం అనంతరం 24న హైదరాబాద్‌లో రిసెప్షన్‌ను నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వరల్డ్ చాంపియన్ గుకేశ్‌కు టెస్లా బాస్ కంగ్రాట్స్

న్యూదిల్లీ–నవభూమి: ప్రపంచ చెస్ చాంపియన్‌గా 18 ఏళ్ల గుకేశ్ అవతరించిన విషయం తెలిసిందే. సింగపూర్‌లో జరిగిన ఫిడే వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్‌లో చైనా క్రీడాకారుడు డింగ్ లిరెన్‌ను ఓడించి అతను విశ్వ విజేతగా నిలిచాడు. ఆ టైటిల్‌ను అందుకున్న అతిపిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. ఈ నేపథ్యంలో గుకేశ్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది. సినీ, రాజకీయ, క్రీడా పరిశ్రమల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా గుకేశ్‌పై ప్రపంచ కుబేరుడు, టెస్లా బాస్ ఎలాన్ మస్క్ సైతం అభినందనలు తెలిపారు. ఎక్స్ వేదికగా గుకేశ్‌కు కంగ్రాట్స్ చెబుతూ స్పెషల్ పోస్టు పెట్టారు. ప్రస్తుతం మస్క్ ట్వీట్ వైరల్ అవుతోంది.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**